RNI No. APTEL/2006/17880 www.bharathasakthi.com




# భారత శక్తి®

తెలుగు దినపత్రిక
VOICE OF INDIAN



Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 20 సంచిక:34 హైదరాబాద్, గురువారం, 17 జూలై 2025 పేజీలు: 12 వెల: 1.00



# బనకచర్లపై చర్చ జరగలేదు: సీఎం రేవంత్‌రెడ్డి

దిల్లీ: జూలై 16, )తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి జలాల అంశంలో ఉన్న సమస్యలపై చర్చించడానికి అధికారులు, ఇంజినీర్లతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి (%=వఋఝత్ష్ట =వఎఎఎ%)తెలిపారు. ఆ కమిటీ నివేదిక మేరకు తదుపరి చర్యలు ఉంటాయన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర జలశక్తిశాఖ నిర్వహించిన సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ భేటీలో ఏపీ ప్రభుత్వం నుంచి గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు కడతామన్న ప్రతిపాదన చర్చకు రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అజెండాలో వారు కడతామనే ప్రతిపాదనే చర్చకు రానప్పుడు ఆపాలన్న చర్చే ఉండదన్నారు. ఇది అపెక్స్ కమిటీ భేటీ కాదని చెప్పారు. "తెలంగాణ హక్కులను కేసీఆర్ గతంలో ఏపీకి ధారాదత్తం చేశారు. ఆయన చేసిన తప్పులను సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నాం. పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ సమావేశం జరిగింది. ఈ భేటీలో కేంద్ర ప్రభుత్వం కేవలం నిర్వాహక పాత్రే పోషించింది. కేంద్రం ఎవరివైపూ మాట్లాడలేదు.

భేటీలో తీసుకున్న నిర్ణయాలన్నీ తెలంగాణ విజయమే. అనుమానించుకుంటూ పోతే ముందుకు సాగలేం. సమస్యలను పరిష్కరించుకునేందుకే ఉన్నాం.. గొడవలు పెట్టుకునేందుకు కాదు. ఇరు రాష్ట్రాలు గొడవలు పెట్టుకోవాలని కొందరు చూస్తున్నారు. వివాదాలు లేకుండా సమస్యలను పరిష్కరించుకోవడమే మా అజెండా"అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.




హైదరాబాద్: తెలంగాణ పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ కనకరత్నం ఏసీబీ వలలో చిక్కారు. డీఈ బదిలీ విషయంలో ఆయన రూ. 50వేలు డిమాండ్ చేశారు. లంచం డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ ఏడాది మార్చి 31న కనకరత్నం పదవీవిరమణ పొందారు. అయితే, ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగిచింది. కాగా సొంత శాఖలోని డీఈ తాండూరు నుంచి వికారాబాద్‌కు బదిలీ చేయాలని కోరగా.. కనకరత్నం రూ.50వేలు లంచం అడిగారు. దీంతో డీఈ ఏసీబీని ఆశ్రయించారు. దీంతో కనకరత్నం లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పంచాయతీ రాజ్ కార్యాలయంతోపాటు కేపీహెచ్‌బీ కాలనీలోని ఆయన నివాసంలోనూ సోదాలు నిర్వహించారు. అనంతరం కనకరత్నంను అరెస్టు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వెల్లడించారు.



## పెద్దపల్లిలో వీ హబ్ ఏర్పాటు చేస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు

పెద్దపల్లి: మహిళలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు చేపట్టామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. పెద్దపల్లిలో ఏర్పాటుచేసిన ఇందిరాశక్తి సంబరాల సభకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, ఎమ్మెల్యే విజయరమణరావుతో కలిసి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

# చదువు "కొంటున్నాం"

## ( విద్యాహక్కు చట్టం ఎటుపోయింది..? )

- చదువుల తల్లిని బహిరంగ మార్కెట్ లో అమ్మేస్తున్న దౌర్భాగ్యం..
- న్యాయస్థానాలు అక్షింతలు వేస్తున్నా ఏమాత్రం ప్రయోజనం లేదు..
- అక్రమ విద్యా సంస్థలకు నోటీసులు ఇవ్వడం చేతులు దులుపుకోవడం..
- అవినీతి అధికారుల అలసత్వం.. పేద విద్యార్థులకు శాపం..
- ఉచితంగా నిర్బంధ విద్య అమలైనప్పుడే అందరికీ విద్య దొరుకుతుంది..
- కేజీ టు పీజీ ఫ్రీ అంటూ ఊదరగొట్టడం తప్ప ఏపార్టీ ఏమీ చేసింది లేదు..
- కార్పొరేట్ స్కూళ్లకు, విద్యాసంస్థలకు దాసోహం అంటున్న ప్రభుత్వాలు..
- పరిపాలనలో భాగస్వాములవుతున్న కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు..
- ప్రైవేట్ విద్యా సంస్థల్లో సెక్షన్ 12(1)(సి) ఎందుకు అమలవ్వడం లేదు..?
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఎప్పుడు న్యాయం జరుగుతుంది..?
- పేద విద్యార్థులు చదువుకోకూడదా..? ఉన్నత స్థానానికి చేరకూడదా..?
- విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు పోరాటం సాగిస్తున్న ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ..

హైదరాబాద్, 16 జులై ( భారత శక్తి ) :

విద్యాహక్కు చట్టం – 2009 ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థలు చట్టంలోని సెక్షన్ 12(1)(సి) ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు 25శాతం రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తూ తెలంగాణ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శికి హైకోర్టు అక్షింతలు వేసింది.

కాగా 2020లో కొందరు సామాజిక కార్యకర్తలు ఈవిషయమై దాఖలు చేసిన పిటిషన్?పై తెలంగాణా హైకోర్టు.. సుప్రీంకోర్టు తీర్పును ఉటంకిస్తూ తీర్పునిచ్చింది. అయితే ఈ తీర్పు మేరకు తెలంగాణ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి 2024 అక్టోబర్ 10న ప్రైవేటు విద్యా సంస్థలకు నోటీసు ఇచ్చి చేతులు దులుపుకోవడంతో మరోసారి ఈ విషయంపై న్యాయస్థానం ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి ప్రశ్నించింది. గుర్తింపుపొందిన ప్రైవేటు విద్యాసంస్థలు యాజమాన్యాలు (ట్రెస్మా) బలహీన వర్గాలకు విద్యాహక్కు చట్టం ప్రకారం 25శాతం సీట్లు నిబంధన అమలు జరిపేది లేదని స్పష్టంగా ప్రకటించారు.

ఈ ప్రకటన విద్యాహక్కు చట్టాన్ని తిరస్కరించడం అవుతుంది. విద్యాహక్కు చట్టం అమలుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గత15 ఏళ్ళుగా అమలుపరచని ఈ నిబంధనతో పాటు, క్యాపిటేషన్ ఫీజు వసూలు చేయడం చట్టవిరుద్ధం.



**దేశంలో ఉచితాలు అవసరం లేదు.. ఉచితాలు అనుచితం అంటూ మేధావులు చెబుతూనే ఉన్నారు.. ఉచితాలనే తాయిలాలు పంచుతూ పబ్బం గడుపుకుంటున్నాయి ప్రభుత్వాలు.. ఉచితాలతో సోమరిపోతులను చేస్తున్నారు.. నిజానికి దేశంలో ఉచితంగా ఏదైనా ఇవ్వాలి అనుకుంటే రెండే రెండు.. అవి విద్య, వైద్యం.. దురదృష్టం ఏమిటంటే ప్రస్తుత పరిస్థితుల్లో ఈ రెండే చాలా ఖరీదైనవిగా మారిపోయాయి.. ఎందుకంటే ఇవి పెద్ద వ్యాపార వస్తువులుగా మార్చేశారు.. మార్కెట్ ను షేక్ చేస్తున్నారు.. ఎలాంటి చట్టాలు వీరికి వర్తించవు.. వీరికి ఎలాంటి నిజాయితీ ఉండదు.. కేవలం ధన వ్యామోహం తప్ప.. పేద విద్యార్థులు విద్యావంతులైతే తమ మనుగడకే ప్రమాదం అని తలస్తున్న బడా నాయకులు ఆడుతున్న ఆట ఇది.. ఈ పద్ధతి మారాలి.. విద్య అందరికీ అందాలి..**

కనుక నిబంధనల అమలులో పారదర్శకత ఉండాలి. విద్యాహక్కుచట్టం నిబంధనలు అమలుకోసం ప్రభుత్వం ఏదైనా వ్యవస్థను నెలకొల్పడం అనే అవసరం ఇప్పుడు ముందుకొచ్చింది. రాజ్యాంగ చట్టంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఈచట్టం వచ్చింది. అనేక ఏళ్ళ పోరాటం మూలంగా వాస్తవంగా విద్యాహక్కు చట్టం –2009లోచట్టంగా ముందుకొచ్చింది. 2010 ఏప్రిల్ నుంచి ఆ చట్టం అమలులోకి వచ్చింది. అప్పటినుంచి 15ఏళ్ళుగా ప్రైవేటు

మిగతా 12లో

# విచిత్రమైన వలస జీవితాలు..

**( కళ్ళు చెదిరే వాస్తవాలు.. )**


- రాజకీయ, మతపరమైన అంశాలు, హింస అనేవి లేవు..
- మెరుగైన జీవితం కోసం వలసపోవడం చూసాం..
- వాతావరణ మార్పుల వల్ల ఇప్పుడీ దుర్భర పరిస్థితి నెలకొంది..
- ఒక దేశం యావత్తూ శాశ్వతంగా వదిలేయాల్సిన దారుణం..
- పిల్లా పాపలతో ఎక్కడికి వెళ్తారు..? ఎలా బ్రతుకుతారు..?
- ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ

అందిస్తున్న ఓ ఆసక్తికర కథనం..

కరువు, కాటకాలు.. ఉపాధిలేకపోవడం, రాజకీయ హింస, మతపరమైన అలజడులు.. ఇలాంటివి ఎదురైనప్పుడు తమ జీవితాలను మెరుగుపరుచుకోవడానికి ఒక ప్రాంతంలో ఉన్న ప్రజలు వలసపోవడం మనం చూస్తూ ఉంటాం.. ఇది కేవలం ఒక ప్రాంతానికే పరిమితం అవుతుంది.. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి స్వల్ప సంఖ్యలో వలసవెళ్లే ప్రజలు మరోచోట ఎలాగోలా ఒక ప్రాంతంలో అవకాశం ఉంటుంది.. కానీ ఇవేవీ కారణాలు కాకుండా.. కేవలం వాతావరణ మార్పుల నుంచి తప్పించుకోవడానికి వలస వెళ్లాల్సిన దారుణ పరిస్థితులు నెలకొన్నాయి.. అదీ కాకుండా ఏకంగా ఒక దేశమే వలస వెళ్లాల్సి వస్తోంది.. వూహించుకోవడానికే ఇది భయానకంగా ఉంది.. మరి అక్కడి ప్రజల మానసిక స్థితి గతులు ఎలా వుంటాయో..? ఆలోచిస్తే ఒళ్ళు గగుర్పొడచక మానదు.. అలాంటి కథనం మీ కోసం..

హైదరాబాద్, జూన్ 16 ( భారత శక్తి ) :

లేలేత నీలి రంగు సముద్ర జలాలు.. పగడపు దిన్నెలు.. ఎంతో పొడవైన కొబ్బరి చెట్ల వరుసతో ప్రకృతి సౌందర్యంతో అలరారుతున్న ఒక చిన్న ద్వీపదేశం తువాలు.. ఇక్కడి జీవనం సాంప్రదాయమైన నృత్య, సంగీతాలతో మేళవించుకుని ఉంటుంది.. దాదాపు మూడువేల సంవత్సరాల సాంస్కృతిక వైభవం అక్కడ నివసిస్తున్న ప్రజల సొంతం. ఈ ద్వీపదేశం హవాయ్, ఆస్ట్రేలియాల నడుమ పసిఫిక్ మహా సాగరంలో తొమ్మిది ద్వీపాలతో కూడిన ఈ అందమైన దేశానికి ఇప్పుడు ఊహించని ముప్పు వచ్చిపడింది. శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్న ప్రకారం మరికొన్ని దశాబ్దాల్లోనే ఈ దేశం పూర్తిగా కనుమరుగు కానుందట.. నేలతో పాటు అక్కడి జన జీవితాలనూ వేడెక్కిన సముద్ర జలాలు కబళించబోతున్నాయట.. కాగా తువాలు భూభాగం సముద్ర మట్టానికి కనిష్ఠంగా 6.6అడుగులు, గరిష్ఠంగా 15అడుగుల ఎత్తులోనే ఇప్పుడు ఉంది.. అంతా కలిపితే మహా 25.14 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగి ఉంది.. సుమారుగా ఇక్కడ 10,643 మంది జనాభా ఉంటారు.. కాగా వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతో తుపానుల ఉద్ధృతి, సముద్ర మట్టం పెరుగుతుంటే, అలల తాకిడికి నేల కొంచం కొంచంగా కోసుకుపోతోంది. తాగునీటి వనరులు ఉప్పునీటితో కలిసిపోతున్నాయి.. వ్యవసాయం, జీవనోపాధులు విపరీతంగా దెబ్బతినిపోతున్నాయి. దీంతో ఇప్పటి పరిస్థితులు తువాలును నివాసానికి పనికిరాకుండా చేస్తున్నాయి. వాతావరణ మార్పులు ఎంతటి విధ్వంసాన్నీ విషాదాన్నీ మిగులుస్తాయో ఆ దేశ ప్రజల దుస్థితే





మిగతా 12లో

# నిర్మాణాల్లో కనిపించని నాణ్యత

భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని మనం గొప్పగా చెప్పుకొంటున్నాం. కొత్త రహదారులు, ఆకాశాన్ని తాకే భవంతులు, ఆధునిక వంతెనలతో దేశ ముఖచిత్రం మారిపోతున్నదని సంబురపడుతున్నాం. కానీ, వేగవంతమైన ప్రగతి వెనక, నాణ్యత లేని నిర్మాణాలు, నిర్వహణకు నోచుకోని వంతెనలు, రోడ్లు నిశ్శబ్దంగా ప్రజల ప్రాణాలను బలి గొంటున్నాయి. తాజాగా గుజరాత్‌లోని వడోదర జిల్లాలో మహిసాగర్ నదిపై పాత వంతెన ఉన్నట్టుండి కుప్పకూలింది.వంతెనపై వెళ్తున్న వాహనాలు అమాంతం నదిలో పడ్డాయి. గతంలో తెలంగాణలో నిర్మాణ దశలో ఉన్న మానేరు వంతెన, శతాబ్దాల చరిత ఉన్న వేములవాడ వంతెన కూలాయి. ఈ ఘటనలు నిజానికి చేదు అనుభవాలు. వంతెనలపై మృత్యువీచికలు ఇంకెన్నాళ్లు? ఇటీవల వడోదరలో కూలిన వంతెన దాదాపు నాలుగు దశాబ్దాల పాతది. ఇలాంటి వంతెనలు వాటి జీవితకాలం ముగిసిన తర్వాత, సరైన నిర్వహణ లేకపోతే కూలిపోవడం సహజం.ప్రభుత్వాలు అలాంటి వంతెనల నుంచి ప్రజల ప్రాణాలను ఎలా కాపాడతాయనేదే ప్రశ్న. దేశంలో వంతెనలు కూలడం లేదా పాడవటానికి అనేక కారణాలున్నాయి. వాటిలో ప్రధానమైనది నిర్వహణ లోపం. రెండోది వాటి నిర్వహణకు ప్రభుత్వాలు తగిన నిధులు కేటా యించకపోవడం. మూడోది వంతెనల పటుత్వాన్ని చెక్ చేయాల్సిన ఇంజినీర్లు మిన్నకుండటం. వాస్తవానికి పాత వంతెనలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయా ల్సి ఉంటుంది.లేకపోతే మొత్తం వంతెన బలహీనపడుతుంది. వంతెనలు కూలడానికి మరో ప్రధాన కారణం.. నాణ్యత లేకుండా నిర్మాణం చేపట్టడం. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలను పాటించకపోవడం, తక్కువ నాణ్యత గల పదార్థాలను ఉ పయోగించడం వంటివి వంతెనల జీవితకాలాన్ని తగ్గిస్తాయి. వంతెనలపై ప్రతిరోజూ వందలాది వాహనాలు వెళ్తాయి. రాష్ట్రాలను, జిల్లాలను కలిపే వంతెనలపై అధిక లోడ్ తో వెళ్లే వాహనాలు ఎక్కువగా ఉంటాయి.వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుని ప్రభుత్వాలు వంతెనలు నిర్మాణం చేపడితే బాగుంటుంది. కొన్నిసార్లు ఆ వంతెనలపై,? వాటి సామర్థ్యానికి మించి లోడ్ తీసుకెళ్లే వాహనాలు కూడా ప్రయాణిస్తాయి. వాటి రాకపోకలను నియంత్రించే సరైన వ్యవస్థ లేకపోవడమూ ప్రమాదాలకు కారణం. అలాగే ఎడతెరిపి లేకుండా కురిసే భారీ వర్షాలు, వరదలు, భూకంపాలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు వంతెనలు కూలడానికి కారణం. 2011లో బీహార్‌లోని కోసీ నదిపై ఉన్న ఒక పాత వంతెన కూలింది. 2012లో పశ్చి మ బెంగాల్‌లోని ఒక వంతెన కూలి కొంద రి ప్రాణాలను బలితీసుకున్నది. 2016లో మహారాష్ట్రలోని మహాడ్ వద్ద సావిత్రి నదిపై పాత వంతెన కూలిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రమాదంలో పలువురు మృతిచెందారు. 2017లో ముంబైలో అంధేరీ రైల్వే స్టేషన్ సమీపంలోని పాదచారుల వంతెన కూలి పలువురు గాయపడ్డారు.2018లో పశ్చి మ బెంగాల్‌లోని మజెరత్ వంతెన కూలి ముగ్గురు మరణించారు. 2019లో బీహార్‌లోని గోపాల్‌గంజ్‌లోని గండక్ నదిపై నిర్మించి వంతెన కూలింది. 2022లో గుజరాత్‌లోని మోర్బీ వంతెన కూలి వంద మందికి పైగా మరణించారు. ఇది ఆ రాష్ట్రంలోనే పాత వంతెన. నిర్వహణ లోపం సరిగా లేకపోవడం వల్లనే ప్రమా దం సంభవించింది.2023లో బీహార్‌లో సుల్తాన్‌గంజ్- అగువానీ ఘాట్ వంతెన కూలిపోయిన ఘటన నిర్మాణంలో ఉన్న వంతెనల నాణ్యతపై ప్రశ్నలను లేవనెత్తిం ది. ఈ ప్రమాదాలన్నీ కలిపి మృతుల సంఖ్య కచ్చితంగా వేలల్లో ఉంటుందని అంచనా. కానీ, ఆయా ప్రభుత్వాలు ప్రమాదాల తీవ్రతను, మృతుల సంఖ్యను కచ్చితంగా చెప్పిన దాఖలా లేదు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం కొన్ని వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నా యి. పెద్ద ఎత్తున వంతెనలు కూలిపోయిన సంఘటనలు తక్కువగా ఉన్నప్పటికీ, చిన్నపాటి నష్టాలు, మరమ్మతులు అవసరమైన వంతెనలు అనేకం ఉన్నాయి. తెలంగాణ లో ఇటీవల కాలంలో రెండు వంతెన ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఒకటి.. 2024 ఏప్రిల్‌లో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు గ్రామం వద్ద మానేరు వాగుపై నిర్మాణ దశలో ఉన్న వంతెన కూలిన ఘటన.ప్రమాదంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే అంశం. రూ.49 కోట్ల అంచనాతో 2016లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు పను లు ఎనిమిదేండ్లు గడిచినా పూర్తి కాలేదు. కాంట్రాక్టర్ నాణ్యాత ప్రమాణాలు పాటించకపోవడం, అధికారులు నాణ్య తాపరమైన అంశాలను పెద్దగా తనిఖీ చేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందనేది సుస్పష్టం.ఆ తర్వాత 2023 సెప్టెం బర్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రము ఖ పుణ్యక్షేత్రం వేములవాడలో శతాబ్దాల నాటి ఒక కమాన్ బ్రిడ్జి కూలింది. ఘటన లో పది మందికి పైగా స్థానికులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి ఇప్ప టికీ కేవలం మంచానికే పరిమితమై ఉన్న పరిస్థితి. వంతెన కూలిన సమయంలో దానిపై నుంచి వెళ్తున్న ఓ లారీ కూరగాయల మార్కెట్‌లోకి దూసుకెళ్లడంతో నష్ట తీవ్రత పెరిగింది.ఈ వంతెన వంద సంవత్సరాలకు పైగా పాతదని, సరైన నిర్వహణ లేకపోవడం వల్లే కూలిపోయిందని స్థానికులు నాడు ఆందోళన చేపట్టారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కూడా అనేక పాత వంతెనలు ఉన్నాయి. ముఖ్యంగా తీరప్రాంతంలో, నదులపై ఉన్న వంతెనలు తుఫానులు, వరదల కారణంగా బీటలు వారుతున్నాయి.గతంలో ప్రకాశం బ్యారేజీ ప్రాంతంలో ప్రభుత్వాలు అనేక మరమ్మతులు చేపట్టాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున వంతెనలు కూలి భారీ ప్రాణనష్టం జరిగిన సంఘటనలు పెద్దగా నమోదు కానప్పటికీ, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే మున్ముందు మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

# మళ్లీ యనమల యాక్టివ్...

కాకినాడ, జూలై 16,

సీనియర్ నేత మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిలో మళ్లీ ఆశలు పెరిగాయి. మాజీ కేంద్ర మంత్రి అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవి దక్కడంతో తనకు కూడా పార్టీ హైకమాండ్ ఏదో ఒక పదవి ఖచ్చితంగా ఇస్తుందన్న నమ్మకం పెరిగిపోయిందట. అశోక్ గజపతిరాజు లాగానే తాను కూడా పార్టీలో సీనియర్ నేత కావడంతో పాటు క్లిష్ట సమయంలో చంద్రబాబు కు అండగా నిలబడటంతో తనకు ఖచ్చితంగా పదవి లభిస్తుందన్న భావనలో ఉన్నారు. అశోక్ గజపతి రాజు కుమార్తె ఆదితి గజపతి రాజుకు కూడా గత ఎన్నికల్లో విజయనగరం టిక్కెట్ ఇవ్వగా, యనమల కుమార్తె దివ్యకు తుని నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చింది. తునిలో యనమల దివ్య గెలిచింది. సుదీర్ఘకాలం తర్వాత తుని నియోజకవర్గంలో టీడీపీ గెలిచింది. ఎమ్మెల్సీ పదవి ఇవ్వకపోవడంతో తనకు పెద్దల సభకు పంపాలని యనమల రామకృష్ణుడు బలంగా కోరుకుంటున్నారు. పార్టీ కోసం ఇప్పటి వరకూ తాను చేసిన కృషి, పడిన శ్రమను హైకమాండ్ గుర్తించకపోతుందా? అని యనమల బలంగా నమ్ముతున్నారు. అందుకే ప్రస్తుతం యనమల రామకృష్ణుడు మౌనంగానే ఉ ంటున్నారు. అదే సమయంలో తుని నియోజకవర్గానికే పరిమితమయ్యారు. అలాగని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మీద విమర్శలు మానుకోలేదు. అంటే ఖచ్చితంగా చంద్రబాబు తనవైపు చూస్తారని యనమల గట్టిగా విశ్వసిస్తున్నారు. తనలాంటి సీనియర్ నేతలను, సామాజివర్గానికి చెందినవారిని పక్కన పెట్టే అవకాశం లేదని కూడా అంచనా వేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ... ఆయన వయసుతో పాటు కొన్ని ప్రత్యేక పరిస్థితులు టీడీపీ అధినాయకత్వం మంత్రిపదవికి దూరం పెట్టింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ యనమల రామకృష్ణుడు మంత్రి పదవిలో ఉంటారు. ఆయనకు తూర్పు



గోదావరి జిల్లా నుంచి నియోజకవర్గం ఫిక్స్ అయినట్లేనని ఎవరైనా లెక్కలు వేసుకుంటారు. పైగా చంద్రబాబుకు యనమల అత్యంత సన్నిహితుడిగా ముద్రపడింది. అనేక కష్ట సమయాల్లో పార్టీకి అండగా నిలిచారన్న పేరు కూడా పార్టీలో యనమల రామకృష్ణుడికి ఉంది. సీనియర్ నేత అయినా ఆయన సేవలను ఉపయోగించుకుంటారని అందరూ భావించారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యనమల రామకృష్ణుడుకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడంతో అప్పుడే కొంత సందిగ్ధత మొదలయింది.. గత వైసీపీ హయాంలో మూడు రాజధానుల ప్రతిపాదన పెట్టినప్పుడు యనమల రామకృష్ణుడు శాసనమండలిలో తన రాజకీయ చతురతను ఉ పయోగించి బిల్లు ఆమోదం పొందకుండా అడ్డుకోగలిగారు. ఇలా ఎలా చూసినా యనమల రామకృష్ణుడికి పదవి గ్యారంటీ అన్న ప్రచారం ఊపందుకుంది. మరొక వైపు అశోక్ గజపతిరాజుకు కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన ఏడాది తర్వాత గోవా గవర్నర్ గా నియమించడంతో ఇక తనను కూడా ఇటు రాజ్యసభ కు కాని, అటు గవర్నర్ గా పంపుతారన్న నమ్మకం యనమల రామకృష్ణుడి వర్గంలో పెరిగిపోయింది. అందుకే ఇక యనమల రానున్న రోజుల్లో మరింత యాక్టివ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటున్నది భవిష్యత్ లో తేలనుంది.

# నేడు పాఠశాలల భద్రత మరియు ఆరోగ్య దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

తమిళనాడు రాష్ట్రం కుంభకోణంలో ఓ పాఠశాల లో అగ్ని ప్రమాదం సంభవిం చి 58 మంది విద్యార్థులు చని పోయారు. అప్పట్లో ఈ ఘట న దేశవ్యాప్తంగా అనేక విమర్శలకు తావిచ్చింది. దీంతో కేంద్ర ప్రభుత్వం మరుసటి సంవత్సరం నుంచి జూలై 17న పాఠశాలల్లో భద్రత, ఆరోగ్య దినోత్సవం నిర్వహించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈరోజున విద్యార్థులకు అప్రమత్తత, ఆరోగ్యం, మధ్యా హ్న భోజనం, పాఠశాల భవనాలపై అవగాహన కల్పిస్తారు. అనారోగ్యం బారిన పడకుండా విద్యార్థులకు ఆరోగ్యంగా ఉండేలా చూసేందుకు జవహర్ బాల ఆరోగ్య




రక్ష పథకం పేరుతో ఆరోగ్య భద్రత కల్పించింది. ఈ పథకం కింద పిల్లలను పాఠశాలలో వైద్యులు పరీక్షించి అవసరమైన వారికి చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవడం ముఖ్య ఉద్దేశం. అనేక పాఠశాలల్లో మొక్కుబడిగా ఈ పథకం కొనసాగుతుంది. కొన్ని చోట్ల వైద్య పరీక్షలే నిర్వహించడం లేదు. అలాగే పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈవ్ టీజింగ్ గురికాకుండా చూడడమనేది పాఠశాలల బాధ్యత. కులం, మతం పరంగా వేధింపులకు గురికాకుండా చూడాలి. బడి బస్సులు భద్రమేనా?... ప్రైవేట్ పాఠశాలల్లో ప్రతి ఏటా వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నా బస్సుల విషయంలో నిబంధనలు పాటించడం లేదు. ప్రతి పాఠశాల బస్సు మే 15 లోగా ఆర్టీఓ అధికారుల దగ్గరికి తెచ్చి ఫిట్‌నెస్ ధ్రువపత్రం తీసుకోవాలి. బస్సు వేగంగా వెళ్లకుండా నిరోధకాలు బిగించాలి. పాఠశాలల బస్సులను గుర్తించే విధంగా పచ్చని రంగు వేయాలి. బస్సులో ప్రథమ చికిత్స పెట్టె ఉండాలి. పిల్లలను దించేందుకు ఒక సహాయకుడు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. డ్రైవర్ పేరిట ఆరోగ్యకార్డు ఉండాలి. 3 నెలలకు ఒకసారి వైద్యపరీక్షలు చేయించి అందులో రాయాలి. వాహనం నడిపే డ్రైవ ర్‌కు ఐదేళ్ల అనుభవం ఉండాలి. కిటికీల చుట్టూ గ్రిల్ ఉండాలి.

# ఎవ్వరికి పట్టని ఆదిమూలం

తిరుపతి, జూలై 16, )

కొందరు రాజకీయ నేతలకు పాపం.. ఏ పార్టీలో ఉన్నా సుఖం ఉండదు. ఎమ్మెల్యేగా గెలిచారన్న మాటే కానీ వారు వార్డు సభ్యుడి కంటే హీనంగా చూస్తారు. అందులోనూ రిజర్వ్ డ్ నియోజకవర్గాల్లో ఇటువంటి పరిస్థితి ఉంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా రిజర్వ్ డ్ నియోజకవర్గాల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోవాల్సిందే. అది వైసీపీ అధికారంలో ఉంటే రెడ్డి సామాజికవర్గం నేతలు ఆధిపత్యం వహిస్తారు. టీడీపీ అధికారంలో ఉంటే కమ్మ సామాజికవర్గం నేతలు పెత్తనం చేస్తారు. ఫలితం మాత్రం సేమ్ టు సేమ్. అక్కడ ఎమ్మెల్యేల మాట చెల్లుబాటు కాదు. పార్టీని నడిపించే అధికార పార్టీ నేతల మాటకే విలువ ఉంటుంది. అధికారులు సయితం వారికే సెల్యూట్ కొడతారు.రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా... చిత్తూరు జిల్లా సత్యవేడు నియోజకవర్గం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏ మాత్రం లేదు. సత్యవేడు నియోజకవర్గం నుంచి కోనేటి ఆదిమూలం 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచారు. అయితే అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు ఆయన మాట చెల్లుబాటు కాలేదు. అంతా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పెత్తనమే నడిచింది. తన నియోజకవర్గం కాకపోయినా చిత్తూరు జిల్లా కావడంతో పెద్దిరెడ్డి చెప్పినట్లు అధికారులు నడుచుకునే వారు. ఆదిమూలం మాత్రం పేరుకు ఎమ్మెల్యేగా ఉన్నా ఏ ప్రయోజనమూ లేదు. పెద్దిరెడ్డితో కోనేటి ఆదిమూలం విభేదించడంతో ఆయనను తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం ఎంపీగా పోటీ చేయాలని అన్నారు. దీనికి ఇష్టపడని ఆదిమూలం టీడీపీలో చేరిపోయారు.. టీడీపీ నుంచి 2024 ఎన్నికల్లో టిక్కెట్ తెచ్చుకున్న కోనేటి ఆదిమూలం రెండోసారి కూడా గెలిచారు. అయినా పరిస్థితుల్లో ఏమాత్రం మార్పురాలేదు. ఆయనపై లైంగిక వేధింపుల కేసు నమోదయింది. దీంతో తెలుగుదేశం పార్టీ ఆదిమూలం కోనేటిని సస్పెండ్ చేసింది. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై కేసు నమోదయింది. తనపై కుట్ర జరిగిందని ఆయన చెప్పినప్పటికీ పోలీసులు కేసు నమోదు చేశారు. తర్వాత న్యాయస్థానంలో బాధితురాలు ఆ కేసును విత్ డ్రా చేసుకోవడంతో ఆదిమూలం కోనేటి పై కేసును కొట్టి వేశారు. కేసు ఏమీ లేదని తెలిసిన తర్వాత, బాధితురాలు స్వయంగా ప్రకటన చేసిన తర్వాత కూడా కోనేటి ఆదిమూలం పరిస్థితుల్లో మార్పు రాలేదు. దీంతో కోనేటి ఆదిమూలంకు కోపం నషాళానికి అంటింది. ఎంతమంది తనపై పెత్తనం చలాయిస్తారంటూ మండిపడ్డారు. కొద్ది రోజులుగా తనా? పార్టీకి దూరంగా ఉంటే నియోజకవర్గంలో ఎవరు పడితే వాళు వస్తారా? అని ఆయన నిన్న ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యేకు కాకుండా పార్టీలో ఉన్న ఇతరులకు పోలీసులు ఎలా సెల్యూట్ కొడతారంటూ ఆదిమూలం కోనేటి మండిపడ్డారు. ప్రజల ఓట్లతో గెలిచిన తనను కాదని, ఒకరు కో- ఆర్డినేటర్ గా, మరకొరు పరిశీలకుడిగా చెప్పుకుంటూ నియోజకవర్గంలో పనులన్నీ చక్కబెట్టుకుంటున్నారని, తనపై తప్పుడు ప్రచారం చేసిన వారినే వీరు వెనకేసుకు వస్తున్నారని ఆదిమూలం కోనేటి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆదిమూలం ఆవేదన పట్టించుకునే వారెవరు?

# లిక్కర్ ఫైల్స్ ..... కొలిక్కి వచ్చినట్టేనా

## ఇవాళ చార్జిషీట్ దాఖలు




విజయవాడ, జూలై 16,

అసలు ఎపిసోడ్ ఇప్పుడే స్టార్ట్ అయింది. అరెస్టులు, విచారణలు, కస్టడీలు..ఇవన్నీ ఆల్‌మోస్ట్ కంప్లీట్ అయినట్లే. కానీ కీలక దశలో ఉన్న లిక్కర్ కేసులో నిందితులకు బెయిల్ రాకుండా అడ్డుకోవడమే సిట్ ముందున్న ప్రధాన లక్ష్యం. అందుకోసం కోర్టులో సబ్‌మిట్ చేసేందుకు పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తోందట సిట్. ముడుపుల వ్యవహారం ఏంటి..ఎవరెవరికి లింకులు ఉన్నాయి..ఏ నెంబర్ కార్లు వాడారు..ఫోన్ సంభాషణలు ఏంటి..ఇలా ప్రతీ ఒక్కటి పక్కా స్కెచ్ ప్రకారం జరిగిందని ప్రూవ్ చేసేందుకు తీవ్ర కసరత్తే చేస్తోందట సిట్ టీమ్. లేటెస్ట్ టెక్నాలజీతో మద్యం ముడుపుల వీడియోలను సేకరించినట్లు తెలుస్తోందిడెన్లలో దాచిన డబ్బులు, వాటిని నిందితులు సెల్‌ఫోన్లలో షూట్ చేసిన వీడియోలు దొరికినట్లు చెబుతున్నారు. నిందితుల నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల నుంచి ఈ వీడియోలను స్వాధీనం చేసుకున్నారని అంటున్నారు. ఎన్నికల తర్వాత నిందితులు ముందు జాగ్రత్తగా తమ సెల్‌ఫోన్ల నుంచి ఆ వీడియోలను డిలీట్ చేశారట. అధికారులు ఆ సెల్‌ఫోన్లను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపి డిలీట్ చేసిన వీడియోలను రిట్రీవ్ చేశారని చెప్పుకుంటున్నారు.మద్యం డీలర్ల నుంచి ముడుపులు వసూలు చేశాక పెద్దలకు చేరవేసేవరకు..అంతా లిక్కర్ స్కామ్‌లో కీలక సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కసిరెడ్డి డైరెక్షన్‌లో జరిగిందట. నిందితులు లిక్కర్ సొమ్ము పంపిణీకి ముందు వీడియోలు తీశారని అంటున్నారు. డెన్లలో దాచిన డబ్బుల వివరాలను సెల్‌ఫోన్లలో వీడియోలు తీసి పెట్టుకున్నారట. ఎన్నికల తర్వాత అలర్ట్ అయిన రాజ్ కసిరెడ్డి తాను ఏర్పాటు చేసుకున్న వసూళ్ల నెట్‌వర్క్‌లోని ప్రతి వ్యక్తినీ హైదరాబాద్‌కు పిలిపించి వారి సెల్‌ఫోన్లు తీసుకున్నాడని విచారణలో తేలిందంటున్నారు.ప్రతి ఫోన్‌కూ కనీసం లక్ష రూపాయలకు తగ్గకుండా ఇచ్చి కొత్త ఫోన్ తీసుకోవాలని సూచించాడట. ఇక లిక్కర్ ఆర్డర్లు పెట్టిన కంప్యూటర్లను డిపోల్లో ధ్వంసం చేశారట. అయినా కొన్ని వీడియో ఫుటేజ్‌లతో పాటు చాటింగ్‌లు, ఫొటోలు బయటపడ్డట్లు తెలుస్తోంది. సిట్ అధికారులు త్వరలో దాఖలు చేయనున్న చార్జిషీట్‌లో ఈ ఆధారాలను పొందుపరచనున్నట్లు తెలుస్తోంది.లిక్కర్ కేసులో ఓ స్కెచ్ ప్రకారం దోపిడీ జరిగిందని విచారణలో తేలిందంటున్నారు. సిట్ ఇప్పటి వరకూ 40 మందిని నిందితులుగా చేర్చింది. రాజ్ కసిరెడ్డితో పాటు మాజీ సీఎం జగన్ సెక్రటరీ ధనుంజయ్ రెడ్డి, వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు తొమ్మిది మందిని అరెస్టు చేసింది. సాక్షులు, అనుమానితులను 200మందికి పైగా విచారించింది. ఈ కేసులో భాగస్వామ్యం ఉన్న పది మందికిపైగా విదేశాలకు పారిపోయారు. ఈ కేసు విచారణలో మూడు నెలలకు పైగా సిట్ సేకరించిన ఆధారాలు ఈ నెల 17న విజయవాడ ఏసీబీ కోర్టుకు చేరనున్నాయి.మద్యం ముడుపుల వసూళ్లు, డెన్‌లలో దాచడం, కీలక వ్యక్తులకు పంపడం, ఎన్నికల్లో అభ్యర్థులకు పంపిణీ చేయడం, కీలక వ్యక్తుల పాత్ర, బినామీల ఆస్తులు, హవాలా మార్గంలో విదేశాలకు తరలించడం వంటివి చార్జిషీట్‌లో మెన్షన్ చేసే అవకాశం ఉ ందంటున్నారు. పది రోజులకు పైగా ఇదే పనిలో బిజీగా ఉన్న సిట్ అధికారులు లీగల్ ఎక్స్‌పర్ట్స్‌తో చర్చిస్తున్నారట. సూత్రధారులెవరు, పాత్రధారులెవరనే దానిపై టెక్నికల్ ఎవిడెన్స్‌తో పక్కా ఆధారాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ వేయబోతున్నారట.ఎక్సైజ్ అధికారులు, గత ప్రభుత్వ పెద్దలు, వైసీపీ నేతల పాత్రపై కూడా ఇప్పటివరకు తాము కలెక్ట్ చేసి అన్ని ఎవిడెన్స్‌ను సిట్ కోర్టుకు సబ్‌మిట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 21 నాటికి రిమాండ్ ఖైదీగా రాజ్ కసిరెడ్డి జ్యుడీషియల్ కస్టడీ 90 రోజులు పూర్తి అవుతుంది. ఈ లోపు చార్జిషీట్ వేయకపోతే డిఫాల్ట్‌గా బెయిల్ వస్తుంది. దీంతో ప్రధాన నిందితుడిగా అలిగేషన్స్ ఫేస్ చేస్తున్న రాజ్‌కసిరెడ్డి బయటికి వస్తే..కేసు మొత్తం తారుమారైపోతుందని సిట్ భావిస్తోందట. అందుకే చాలా పకడ్బందీగా..లీగల్ ఎక్స్‌పర్ట్స్ ఒపీనియన్‌తో చార్జిషీట్ దాఖలు చేయనున్నట్లు సమాచారం.ఓ వైపు విజయసాయిరెడ్డి సిట్ విచారణ బాకీ ఉంది. ఇప్పటికే ఆయన ఓ సారి సిట్ ముందుకెళ్లి..ఇన్ అండ్ ఔట్ అంతా చెప్పేసి..అందరినీ ఇరకాటంలో పెట్టేశారు. ఇప్పుడు మరోసారి ఆయన సాక్షిగా సిట్ ముందు హాజరుకాబోతున్నారు. ఈసారి విజయసాయి ఏం చెప్తారనే టెన్షన్ ఓ వైపు కొనసాగుతూనే ఉంది. ఇక ఇప్పుడు ఛార్జిసీట్ అంశం ఇంకా ఉత్కంఠ రేపుతోంది. రాజ్‌కసిరెడ్డికి బెయిల్ రావడం..రాకపోవడం పక్కన పెడితే..ఆయనతో ఎవరికి లింకులు ఉన్నాయని సిట్ ఆరోపిస్తుందో..ఎలాంటి ఆధారాలను బయటపెడుతుందోనన్న ఆందోళన అయితే ఫ్యాన్ పార్టీ పెద్దల్లో కనిపిస్తుందంటున్నారు. కీలకంగా మారిన విజయసాయి విచారణ..సిట్ ఛార్జిషీట్ తర్వాత ఏం జరగబోతోందో చూడాలి మరి.

# నేడు అంతర్జాతీయ న్యాయ దినోత్సవం

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని "అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవం" అని కూడా పిలుస్తారు. దీనిని ప్రపంచ వ్యాప్తంగా జూలై 17 న జరుపుకుంటారు. దీనిని అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ వ్యవస్థకు గుర్తింపుగా జరుపుకుంటారు. నేపథ్యం: ఒక్క అమాయకుడికి కూడా అన్యాయము జరగకూడదన్న సూత్రము న్యాయవయ్వస్థకు పునాది. అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ ఏర్పాటుకు గుర్తింపు




చర్యగా ప్రతిఏటా ప్రపంచవ్యాప్తంగా "జూలై 17" న అంతర్జాతీయ న్యాయదినోత్సవం జరుపుకుంటున్నాము. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ సృష్టికి కారణమయిన ఒడంబడిక 'రోమ్ స్టాట్యు' వార్షికోత్సవము కారణముగా జూలై 17 వ తేదీని ఇంటర్నేషనల్ జస్టిస్ డే కోసం ఎంచుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ రోజున ఆంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ ను ప్రోత్సహిస్తూ ముఖ్యంగా ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టుకు మద్దతుగా అనేక కార్యక్రమాలు చేపడతారు. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ (ఐ.సి.సి.) రోమ్ స్టాట్యు పదవ వార్షికోత్సవం సందర్భంగా 2008 లో ఇంటర్నేషనల్ జస్టిస్ డేను సెలబ్రేట్ చేశారు. ఐ.సి, సి. అసాధారణ సేవల్ని గుర్తిస్తూ మరింత ప్రశాంత ప్రపంచసృష్టికి, మరింత న్యాయానికి అనువుగా ఎల్లలులేని న్యాయాన్నీ నొక్కిచెప్పడానికి గాను ఇంటర్నేషనల్ జస్టిస్ డేని ప్రకటించారు. జూలై 17 తేదీన ఇంటర్నేషనల్ జస్టిస్ డేగా ప్రకటిస్తూ తీర్మానిస్తూ సంతకాలు చేసిన తొలి ఏకైక మేయర్ గా పోర్ట్ ల్యాండ్ మేయర్ - టామ్ పాటర్ 'నిలిచిపోయారు". ఒకరి హక్కుల్ని ఒకరం పరస్పరం కాపాడుకోలేక పోతే, మన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరం, వాటిని బహుశా ఎవరూ కాపాడలేకపోవడం సంభవించే సమయం రాగలదని నేను ప్రగాఢముగా విశ్వసించే వ్యక్తిని" అని మేయర్ టామ్పాటర్ పేర్కొనారు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరికీ సమానత్వం, సమాన న్యాయము ఉండాలని అభిప్రాయపడ్డారు. సుమారు 150 దేశాలు సభ్యులు చేరారు. అంతర్జాతీయ న్యాయానికి ఐ.సి.సి ఎంతగానో తోడ్పడుతుంది. టెర్రరిజం పెచ్చుమీరిన ఈ రోజుల్లో అన్నిదేశాలు కూడగట్టుకొని న్యాయాన్ని కాపాడెతేనే మానవ మనుగడ ప్రశాంతంగా అహింసామార్గములో పయనించడానికి వీలుపడుతుంది.

# డ్రగ్స్ తో జీవితాలు నాశనం

నరసాపురం జూలై 16,

యువత డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా మెలగాలని



పట్టణ సీఐ బి యాదగిరి అన్నారు. ఈరోజు పట్టణంలోని ఆదిత్య కాలేజీలో జరిగిన డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పట్టణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ డ్రగ్స్ కు అలవాటు పడి చాలామంది ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు బైక్ పై వచ్చి ఒంటరిగా ఉండే మహిళల మెడలో చైన్లు లాక్కుని వెళ్ళి వారి ?లు పాలైన సందర్భాలు వున్నాయని. విద్యార్థి దశలో డ్రగ్స్కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని కాబట్టి విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా వుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్.ముత్యాలరావు కాలేజి యాజమాన్యం విధ్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరు బయట నిద్రిస్తున్న భార్యాభర్తల పై పెట్రోల్ పోసి తగలబెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు

వినుకొండ జూలై 16,

నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామంలో దారుణం జరిగింది. ఇంటి ముందు నిద్రిస్తున్న భార్యాభర్తల పై పెట్రోల్ పోసి తగలబెట్టిన సంఘటన జరిగింది. నీలబోయిన పెద్ద శీను, మంగమ్మలపై బుధవారం ల్లవారుజామున మూడు గంటల సమయంలో ఆరు బయట నిద్రిస్తున్న సమయంలో పెట్రోల్ పోసి తగలబెట్టారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడి చేరుకొని వివరాలు సేకరించారు. మంటల్లో తీవ్రంగా గాయాల పాలైన దంపతులిద్దరినీ మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. నరసరావుపేట డిఎస్పి నాగేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వలంటీర్ల వ్యవస్థ...కామా కాదు... ఫుల్ స్టాప్...

గుంటూరు, జూలై 16,

ఏపీలో కూటమి సర్కార్ వచ్చిన తర్వాత వాలంటీర్ల వ్యవస్థను సైడ్ చేశారు. వాలంటీర్ల సేవలను వాడకుండానే పెన్షన్లను ఇచ్చేస్తున్నారు. రేషన్ బండ్లతో పనిలేకుండానే సరుకుల్ని పంచేస్తున్నారు. ఏపీలో ఇక వాలంటీర్ల అవసరం లేకుండా పోయింది. వాలంటీర్ల వ్యవస్థ వల్లే వైసీపీకి నష్టం జరిగిందని అన్ని సర్వేలు చెబుతున్నాయి. ఇటు వైసీపీ సైతం అదే నిజమని భావిస్తోంది. అందుకే కూటమి సర్కార్ కూడా వాలంటీర్ల వ్యవస్థను టచ్ చేయడం లేదట. వాలంటీర్ల వ్యవస్థ విషయంలో వైసీపీ కూడా ఓ క్లారిటీకి వచ్చేసినట్టు ఆ పార్టీ నేతలు బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. మాజీ సీఎం జగన్ ఇక నుంచి వాలంటీర్ల వ్యవస్థ జోలికి వెళ్లకూడదని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. తాజాగా దీనిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే పార్టీ అంతర్గత మీటింగ్‌లో మాట్లాడారని తెలుస్తోంది. వాలంటీర్ల వ్యవస్థ పై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒక నిర్ణయం తీసుకున్నట్లు చెప్పుకొచ్చారాయన. వాలంటీర్ల వ్యవస్థ అనేది ముగిసిన అధ్యయం కానుంది. కూటమి ప్రభుత్వమే కాదు భవిష్యత్‌లో వైసీపీ కూడా వాలంటీర్ వ్యవస్థ జోలికి పోయేలా కనిపించడం లేదు. ఆ వ్యవస్థతోనే వైసీపీకి దారుణ పరాజయం ఎదురైందని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారట. నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల పార్టీ శ్రేణులతో కీలక వ్యాఖ్యలు చేశారు. వాలంటీర్ వ్యవస్థ వల్ల వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రజలకు దూరమయ్యారని అన్నారు. తాను పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి దగ్గర ఇదే విషయాన్ని ప్రస్తావించానని చెప్పుకొచ్చారు. ఏ పార్టీకైనా కార్యకర్తలే మూలస్తంభాలని, వాలంటీర్లు కాదని హైకమాండ్‌కు చెప్పారట. వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మరోసారి వలంటీర్ వ్యవస్థ జోలికి వెళ్ళవద్దని విజ్ఞప్తి చేసినట్లు స్వయంగా పార్టీ సమావేశంలోనే చెప్పారట. అయితే మాజీ ఎమ్మెల్యే అభిప్రాయాన్ని ఆ పార్టీ శ్రేణులందరూ ముక్తకంఠంతో ఆహ్వానించారట. రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా ఇదే అభిప్రాయంతో ఉన్నారని పార్టీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ వ్యవస్థను ప్రారంభించింది వైసీపీ ప్రభుత్వం. ప్రతి 50 కుటుంబాల బాధ్యతను వారికి అప్పగించింది. దీంతో వైసీపీ నాయకత్వానికి, పార్టీ శ్రేణులకు పని లేకుండా పోయింది. ప్రభుత్వం అంటే వలంటీర్ వ్యవస్థ అనే భావన ప్రజల్లో పాతుకుపోయింది. ప్రతి చిన్న అవసరానికి జనం వాలంటీర్ల చుట్టూ తిరిగారు. వైసీపీ క్యాడర్, స్థానిక నేతలకు ప్రజలతో గ్యాప్ ఏర్పడింది. అప్పట్లో వాలంటీర్ వ్యవస్థపై వైసీపీ ప్రజా ప్రతినిధులే పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. కానీ మాజీ సీఎం జగన్ లెక్క చేయలేదు. సరిగ్గా ఎన్నికల ముందు వాలంటీర్ వ్యవస్థను నిలిపివేసింది ఎన్నికల కమిషన్. దీంతో చాలామంది వాలంటీర్లు రాజీనామాలు చేశారు. అయితే కూటమి అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామని.. రాజీనామాలు చేయవద్దని విజ్ఞప్తితో.. సగం మంది రాజీనామాలు చేయలేదు. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదన్నర అవుతోంది. కానీ వాలంటీర్ వ్యవస్థపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం పెద్దగా మాట్లాడడం లేదు. వాలంటీర్ వ్యవస్థ మూలంగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నష్టం జరిగిందన్నది మెజారిటీ పార్టీ శ్రేణుల అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ఇప్పుడు వాలంటీర్ వ్యవస్థను సమర్థిస్తే.. భవిష్యత్తులో అధికారంలోకి వచ్చిన వెంటనే దానిని అమలు చేయాల్సి ఉంటుంది. అలా చేస్తే ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వం డైలామాలో ఉందట. అందుకే ఈ వ్యవస్థ విషయంలో కూటమి బాటలోనే నడవాలని వైసీపీ నిర్ణయించుకుందని పొలిటికల్ సర్కిళ్లలో మెయిన్ డిబెట్ పాయింట్‌గా మారింది. ఫైనల్‌గా వాలంటీర్ల వ్యవస్థకు తెరపడినట్లేనన్న టాక్ వినిపిస్తోంది. భవిష్యత్‌లో కార్యకర్తలకే ప్రయారిటీ ఇస్తామని స్వయంగా పార్టీ అధినేత జగన్ అంటున్నారు. అంటే వాలంటీర్లు ఉండరని చెప్పకనే చెప్తున్నారు జగన్. అలా అధికార, అపోజిషన్ వార్ మధ్య వాలంటీర్ వ్యవస్థ కనుమరుగైనట్లేనన్న ఒపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయి.

# మరొక జాతీయరహదారికి మహర్ధశ

కర్నూలు, జూలై 16,

ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల వెంబడి ఉన్న గ్రామాలు, పట్టణాల రోడ్ల అభివృద్ధిపై ఫోకస్ పెట్టారు.. గతంలో జాతీయ రహదారుల వెంబడి బైపాస్ రోడ్లు వేశారు.. అయితే వాటిని పట్టించుకోలేదు. తాజాగా కేంద్రం నిధులు ఇస్తుండటంతో అధికారులు వాటి అభివృద్ధికి ప్రణాళికలు వేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న జాతీయ రహదారుల అనుసంధాన రోడ్లను అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నంద్యాల-చిత్తూరు (నేషనల్ హైవే-40), కర్నూలు-గుంటూరు (340సీ), సోమయాజులపల్లె-డోన్ (340బీ), నేషనల్ హైవే 167, నేషనల్ హైవే-44, చెన్నై-సూరత్ 150సీ జాతీయ రహదారుల వెంబడి బైపాస్ రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఈ రోడ్ల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కేంద్రం నిర్ణయించడంతో అధికారులు అంచనాలు రూపొందించారు. నేషనల్ హైవే-40 పరిధిలో నంద్యాల, ఆళ్లగడ్డ బైపాస్ రోడ్ల అభివృద్ధికి రూ.10 కోట్లు అవుతుందని అంచనా వేశారు. దీనితో పాటుగా 340బీ సోమయాజులపల్లె-డోన్ రహదారిలో బేతంచెర్ల, డోన్ బైపాస్ రోడ్లకు నిధులు కేటాయించారు. కర్నూలు-గుంటూరు 340సీ రహదారిపై నన్నూరు టోల్‌ప్లాజా దగ్గర ఉన్న బైపాస్‌ను కూడా అభివృద్ధి చేస్తారు. కర్నూలు జిల్లాలో బళ్లారి-రాయచూరు నేషనల్ హైవే 167కు సంబంధించి.. హాలహర్వి-మాధవరం వరకు 58 కిలోమీటర్ల రోడ్డులో ఆదోని వద్ద బైపాస్‌కురూ.5 కోట్లు అవసరమని అంచనా వేశారు. బెంగళూరు-హైదరాబాద్ నేషనల్ హైవే-44కు రూ.10 కోట్లు



కావాలని అధికారులు అంచనా వేశారు. చెన్నై-సూరత్ 150సీ రహదారికి సంబంధించి రూ.10 కోట్లు అవసరమని అంచనాలు సిద్ధం చేశారు

వర్షాకాలంలో జాతీయ రహదారుల నుంచి బైపాస్ మార్గాలకు వెళ్లే రోడ్లపై నీళ్లు నిలిచిపోతున్నాయి. ఈ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి తోడు మురుగు కాల్వలు లేకపోవడంతో నీరు రోడ్లపై నిలుస్తుండటంతో రోడ్లు కూడా పాడైపోతున్నాయి. ఈ క్రమంలోనే కేంద్రం వన్ టైమ్ ఇంప్రూవ్మెంట్ నిధులు ఇస్తోంది.. వీటితో రోడ్లకు ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణం కూడా చేపడతారు. మొత్తం మీద కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో ఉమ్మడి కర్నూలు జిల్లాలో నేషనల్ హైవేల నుంచి గ్రామాలు, పట్టణాలకు కనెక్టివిటీ పెరగనుంది.

# బూస్టర్ లా భోగాపురం

విజయనగరం, జూలై 16,

విజయనగరం జిల్లాలో నిర్మాణంలో ఉన్న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్ట్ పూర్తయితే.. ఉత్తరాంధ్ర రూపురేఖలే మారిపోనున్నాయ్. భోగాపురంలో ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. ఆ ప్రాంతమే కాదు చుట్టపక్కల ఉన్న మిగతా ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయ్. ఈ ప్రాజెక్టుతో రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడమే కాదు.. పారిశ్రామిక, ఆర్థిక, సామాజిక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు బీజం పడనుంది. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం.. అదే.. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్.. విజయనగరంలో జిల్లాలో ఈ విమానాశ్రయం పూర్తయితే.. ఉత్తరాంధ్ర లెక్కే మారిపోతుందనే మాటలు వినిపిస్తున్నాయి. అటు విశాఖ, ఇటు శ్రీకాకుళానికి మధ్య ఉన్న విజయనగరాన్ని కలిపేలా.. ఈ ఎయిర్‌పోర్ట్‌ని నిర్మిస్తున్నారు. ఎన్‌హెచ్-16కి ఆనుకొని దీనిని నిర్మిస్తుండటం.. మరో మేజర్ ప్లస్ పాయింట్. ఇప్పటికే.. ఎయిర్‌పోర్ట్ పనులు సుమారు 80 శాతం వరకు పూర్తయ్యాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి.. భోగాపురం ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తీసుకురావాలని.. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎయిర్‌పోర్ట్ పనుల్లో కదలిక. ఎయిర్‌పోర్ట్ పనులు వేగంగా సాగుతుండటంతో.. పదేళ్లుగా పడకేసిన రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. 2014లో టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక.. ఎయిర్‌పోర్ట్ నిర్మాణ ప్రతిపాదన వచ్చింది. దాంతో.. రియల్టర్లంతా పెద్ద ఎత్తున లేఅవుట్‌లు వేసుకున్నారు. తర్వాత వైసీపీ హయాంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ క్వశ్చన్ మార్క్‌లా మారింది. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక.. విమానాశ్రయ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతుండటంతో.. రియల్టర్లలో మళ్లీ ఆశలు చిగురించాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుతో.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మాణం వల్ల ఉద్యోగ అవకాశాలు భారీగా పెరగనున్నాయి. ఎయిర్‌పోర్ట్ మెయింటెనెన్స్, లాజిస్టిక్స్, హాస్పిటాలిటీ, రిటైల్ లాంటి రంగాల్లో.. వేలాది మందికి ఉపాధి లభిస్తుంది. పారిశఅరామికంగా, విమానాశ్రయానికి సమీపంలో కొత్త పరిశ్రమలు, గోడౌన్‌లు, వ్యాపార సంస్థలు ఏర్పడతాయి. ఇది.. ఆ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి ఊతమివ్వడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థని బలోపేతం చేస్తుందని చెబుతున్నారు. ఉత్తరాంధ్రలో ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ముందుకు. ఇదిలా ఉంటే.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఫ్యూచర్ అంతా టూరిజందే అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో.. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఇన్వెస్టర్లను కోరుతున్నారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల తీర ప్రాంతాల్లో.. టూరిజాన్ని డెవలప్ చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. ఫైవ్ స్టార్ హోటళ్ల నుంచి బీచ్‌లో కాటేజీల దాకా అన్నింటిపైనా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. టూరిజంతో పాటు ఐటీ సెక్టార్, ఇంజనీరింగ్ పరిశ్రమల్ని అభివృద్ధి చేసి.. ఉత్తరాంధ్రలో ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతోంది కూటమి ప్రభుత్వం. భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే.. ఉత్తరాంధ్రలో టూరిజం బాగా డెవలప్ కానుంది. విజయనగరం జిల్లా సమీపంలోని టూరిస్ట్ స్పాట్‌లకు.. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకుల రాకపోకలు పెరుగుతాయి. దాంతో.. హోటల్స్, రిసార్ట్స్, రెస్టారెంట్ల లాంటి హాస్పిటాలిటీ రంగం డెవలప్ అవుతుంది. మౌలిక సదుపాయాల కల్పనలోనూ ఊహించని మార్పులొస్తాయ్. రోడ్లు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, కరెంట్ సప్లై లాంటివన్నీ మెరుగుపడతాయి. మొత్తంగా.. భోగాపురం ఎయిర్‌పోర్ట్ విజయనగరం జిల్లాని ఓ ముఖ్యమైన ఎకనమిక్ జోన్‌గా మార్చి.. ఆ ప్రాంత సమగ్ర అభివృద్ధికి బూస్టర్‌లా మారనుంది

# చంద్రగిరి మండలంలో మరోసారి ఏనుగులు గుంపు బీభత్సం

తిరుపతి జూలై 16,

చంద్రగిరి మండలం యల్లంపల్లిలో ఏనుగుల గుంపు మరోసారి బీభత్సం సృష్టించింది. మంగళవారం రాత్రి యల్లంపల్లిలో పంట పొలాలపై పడ్డ 7 ఏనుగుల మంద ఫెన్సింగ్ రాళ్లు, పంటలను ధ్వంసం చేశాయి. స్థానిక రైతులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. ఏనుగుల నుంచి పంట పొలాలను రక్షించాలని ప్రభుత్వాన్ని గ్రామస్థులు, రైతులు కోరారు.

# మల్కాజిగిరిలో టెన్షన్.. టెన్షన్

మల్కాజిగిరి జూలై 16,

మల్కాజిగిరి రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. మంగళవారం అల్వాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య జరిగిన గొడవల ప్రభావం మల్కాజిగిరి వరకు వెళ్ళింది. దీనివల్ల ఇరు పార్టీల నేతలు పరస్పరం సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్నారు. "దమ్ముంటే మల్కాజిగిరి రా" అంటూ బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ నాయకులకు సవాల్ చేశారు. ఈ సవాల్ను స్వీకరించిన కాంగ్రెస్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు, ఆయన కుమారుడు మైనంపల్లి రోహిత్ సహా పార్టీ కార్యకర్తలు పెద్దఎత్తున మల్కాజిగిరి చౌరస్తాకు చేరుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి ఇరుపార్టీల వర్గాలను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ కాంగ్రెస్ నాయకులు మల్కాజిగిరిలోని ఆనంద్బాగ్ లో ఉన్న తమ పార్టీ కార్యాలయంలో తిష్టవేశారు. ఈ ఘటనల నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఎప్పుడైనా ఏమయిపోతుందో అన్న భయం అందరిలో కనిపించింది..

# సచివాలయ ఉద్యోగిని బ్రోకర్ అన్న ఎమ్మెల్యే

కడప జూలై 16,

టిడిపి ఎమ్మెల్యే మాధవిరెడ్డి సచివాలయ ఉద్యోగిపై నోరు పారేసుకుంది. తొలిఅడుగు కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగిని బ్రోకర్ అంటూ వ్యాఖ్యలు చేయడం వివాదం అయింది. కార్పొరేటర్కు బ్రోకర్ పని చేస్తున్నావా అంటూ వీఆర్వోను కించపరిచేలా ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేసారు. ఎమ్మెల్యే మాధవిరెడ్డి వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి.

# ఆరోగ్య సంజీవిని యోగా... సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే యోగాను ఆచరిద్దాం

చిత్తూరు జూలై 16,

మానవునికి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే యోగా.., ఆరోగ్య సంజీవిని అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. యోగాను జీవితంలో ఓ భాగం చేసుకొని, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందాలని వారు సూచించారు. యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్..., యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ చిత్తూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో శు



క్రవారం చిత్తూరులోని పి వి కే ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగే ఐదవ రాష్ట్రస్థాయి న్యాయ నిర్ణేతల శిక్షణా తరగతులను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి జీవన్ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఐదవ రాష్ట్రస్థాయి న్యాయ నిర్ణేతల శిక్షణా తరగతుల సమావేశాన్ని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే గురజాల, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నగర మేయర్ కుమారి అముద, చూడా ఛైర్పర్సన్ కఠారి హేమలత, యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు ఏ రాధిక, వేమూ విద్యాసంస్థల ఛైర్మన్ చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, యోగాంధ్రా సాధన వైపు అడుగులేస్తున్నారని తెలియజేశారు. ఇటీవల అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఏపీలో నిర్వహించి, గిన్నిస్ బుక్ రికార్డు సాధించడం దీనికి నిదర్శనం అన్నారు. ఇందులో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొని, యోగాసనాలు చేసి, ప్రజలను చైతన్య పరచడం చూస్తే... యోగా ఆచరించడం మనిషికి ఎంత అవసరమో తెలియజేస్తోందన్నారు. దీని పై అవగాహన కలిగిన యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ కమిటీ సభ్యులు.., ఐదవ రాష్ట్రస్థాయి న్యాయ నిర్ణీతల శిక్షణా తరగతుల ద్వారా యోగాను ప్రజలకు మరింత చేరువచేసి, వారి సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేయగలరని తాము ఆశిస్తున్నట్లు ఎంపీ, ఎమ్మెల్యేలు తెలియజేశారు.

## ఆరోగ్య సంజీవిని యోగా... సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే యోగాను ఆచరిద్దాం

చిత్తూరు

మానవునికి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే యోగా.., ఆరోగ్య సంజీవిని అని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ అన్నారు. యోగాను జీవితంలో ఓ భాగం చేసుకొని, దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం పొందాలని వారు సూచించారు. యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్..., యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ చిత్తూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం చిత్తూరులోని పి వి కే ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగే ఐదవ రాష్ట్రస్థాయి న్యాయ నిర్ణేతల శిక్షణా తరగతులను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ ముఖ్య అతిథులుగా హాజరై



ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి జీవన్ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఐదవ రాష్ట్రస్థాయి న్యాయ నిర్ణేతల శిక్షణా తరగతుల సమావేశాన్ని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ, ఎమ్మెల్యే గురజాల, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నగర మేయర్ కుమారి అముద, చూడా ఛైర్పర్సన్ కఠారి హేమలత, యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు ఏ రాధిక, వేమూ విద్యాసంస్థల చైర్మన్ చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, యోగాంధ్రా సాధన వైపు అడుగులేస్తున్నారని తెలియజేశారు. ఇటీవల అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఏపీలో నిర్వహించి, గిన్నిస్ బుక్ రికార్డు సాధించడం దీనికి నిదర్శనం అన్నారు. ఇందులో దేశ ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొని, యోగాసనాలు చేసి, ప్రజలను చైతన్య పరచడం చూస్తే... యోగా ఆచరించడం మనిషికి ఎంత అవసరమో తెలియజేస్తోందన్నారు. దీని పై అవగాహన కలిగిన యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ కమిటీ సభ్యులు.., ఐదవ రాష్ట్రస్థాయి న్యాయ నిర్ణేతల శిక్షణా తరగతుల ద్వారా యోగాను ప్రజలకు మరింత చేరువచేసి, వారి సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేయగలరని తాము ఆశిస్తున్నట్లు ఎంపీ, ఎమ్మెల్యేలు తెలియజేశారు.

## ఆత్మహత్యయత్నంతో చికిత్స పొందుతున్న లక్ష్మిదేవిపల్లి తాజా మాజీ సర్పంచ్ భర్తని పరామర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి జూలై 16,

కరీంనగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మిదేవి పల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ తాళ్ళ విజయలక్ష్మి భర్త రవి గ్రామ అభివృద్ధి కొరకు చేసిన అప్పులు తీర్చలేక చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో తీవ్ర మనస్థాపంతో ఆత్మహత్య యత్నం చేసుకోని హాస్పిటల్ లో వైద్య చికిత్స పొందుతుండగా బుధవారం చొప్పదండి నియోజకవర్గం ఎమ్మెల్యే డా మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆరెస్ ప్రభుత్వ హయంలో గ్రామభివృద్ధి కోసం అప్పులు తెచ్చి పనులు చేయించారని అన్నారు. ఆనాటి బిఆరెస్ ప్రభుత్వం వారికి సకాలం లో బిల్లులు చెల్లించక పోవడం వల్ల అప్పులు తెచ్చి పనులు చేసిన సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు ఈ నేపథ్యం లో చేసిన పనులకు ఆనాటి బిఆరెస్ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా మోసం చేసిందని ఆర్థిక ఇబ్బందులు భరించలేక తీవ్ర మనస్థాపం చెంది లక్ష్మి దేవి పల్లె తాజా మాజీ సర్పంచ్ భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసుకున్నాడని అన్నారు. చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చు స్వయంగా బరిస్తానని వారి కుటుంబ సభ్యులకు చెప్పి దైర్యం నింపారు. వారికి ఏ సమస్య వచ్చిన తనను కుటుంబ సభ్యుడిగా బావించి చెప్పాలని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సర్పంచులకు చెల్లించే బిల్లుల విషయంలో ఆనాటి బిఆరెస్ పార్టీ అనుసరించిన నీచమైన విధానాల వల్లే ఈరోజు సర్పంచులు అప్పుల ఊబిలో చిక్కుకు పోయారు బిల్లులు చెల్లిస్తాం పనులు చేయండి అని ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం సర్పంచులను ఆర్థికంగా వాడుకుని వారికి బిల్లులు ఇవ్వకుండా మోసం చేసిన పార్టీ బిఆరెస్ పార్టీ అని తీవ్రంగా విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట పలువురు గంగాధర మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న హీరోయిన్ ప్రణతి

తిరుమల శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా తిరుమల విచ్చేసిన హీరోయిన్ ప్రణతి కి టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వీఐపీ ప్రారంభ దర్శనంలో స్వామివారిని దర్శించుకున్నారు. అధికారులు ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద ఆశీర్వచనం అందించగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

# కోనసీమలో కేంద్రీయ విద్యాలయానికి నిధులు

రాజమండ్రి, జూలై 16,

పేద, మద్య తరగతి వర్గాలకు చెందిన వారిలో చాలామందిలో తమ పిల్లలు కేంద్రీయ విద్యాలయంలో చదివించాలని ఉంటుంది. ఎందుకంటే అక్కడ సీబీఎస్ఈ కరికులమ్ ఉంటుంది కాబట్టి. ప్రాథమిక విద్యలో కేంద్రీయ విద్యాలయానికి ఉన్న విలువ అటువంటిది. అయితే కేంద్రీయ విద్యాలయాలు చాలా పరిమితంగా ఉండడంతో చాలా మంది తల్లిదండ్రులు సీబీఎస్ఈ సిలబస్పై ఉన్న మక్కువతో తమ శక్తికి మించి ఈ సిలబస్ ఆఫర్ చేస్తోన్న ప్రయివేటు విద్యాసంస్థలను ఆశ్రయించే పరిస్థితి ఉంటుంది. అయితే ఇలా ఆకాంక్షించే వారి కో గుడ్న్యూస్ ఇది. కేంద్రీయ విద్యాలయం ఇప్పుడు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. అల్లవరం మండలం ఓడలరేవు సముద్రతీర ప్రాంతంలో 7.50 ఎకరాల భూమిలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి ఇప్పటికే ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయగా భవన, మౌలిక సదుపాయాల కల్పన కోసం 7.50 ఎకరాల భూమిని పరిశీలన చేశారు అధికారులు. అయితే ఇప్పుడు తాజాగా భూ సేకరణ నిమిత్తం రూ.3.30 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయడంపై కోనసీమ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంతవరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాజమండ్రిలో కేంద్రీయ విద్యాలయ ఉండగా అది ఓఎన్జీసీ సహకారంతో కొనసాగుతోంది. అయితే ఇప్పుడు అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మరొకటి మంజూరు కాగా ఇది రెండో కేంద్రీయ విద్యాలయం. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు సాగర తీరం సమీపంలో ఈ కేంద్రీయ విద్యాలయాన్ని నిర్మించేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధూర్ చొరవతో




భూ సేకరణ నిమిత్తం నిధులు మంజూరు కాగా దీనికి కృషిచేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కు ఎంపీ హరీష్ కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలంలోని వడలరేవు గ్రామంలో కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి మార్గం సుగమం అవ్వడంతో ముఖ్యంగా ఈ ప్రాంత విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా కోనసీమ వాసులు ఎదురుచూస్తోండగా ఈప్రాంతంలో ముఖ్యంగా వ్యవసాయ, మత్స్యకార కుటుంబాలు, కార్మిక కుటుంబాల్లోని పిల్లలతోపాటు ఇతర ప్రైవేటు రంగాలలో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలకు స్థానికంగా ఉన్నతమైన సీబీఎస్ఈ విద్యను అందించే అవకాశం కలగడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సీబీఎస్ఈ కోర్సను తమ పిల్లల్ని చదివించేందుకు నిరుపేదలు, మద్యతరగతి వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల భవిష్యత్తు కోసం ఓడలరేవు గ్రామంలో కేంద్రీయ విద్యాలయాన్ని త్వరితగతిన ప్రారంభించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ హరీష్ బాలయోగి తెలిపారు.

# అన్నమయ్య జిల్లా మహిళల అద్భుతాలు

కడప, జూలై 16,

అన్నమయ్య జిల్లా మహిళలు రసాయన ఎరువులకు దూరంగా ప్రకృతి వ్యవసాయంతో ఆదర్శంగా నిలుస్తున్నారు. పొదుపు సంఘాలతో కలిసి చిరుధాన్యాల తినుబండారాలు తయారు చేసి విక్రయిస్తూ లక్షలు సంపాదిస్తున్నారు. కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ, రాగి లడ్డూలు, కొర్ర పాయసం వంటి వాటిని మండల కేంద్రాల్లో అమ్ముతున్నారు. వారానికి రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం పొందుతూ, కుటుంబానికి లక్ష నుంచి రెండు లక్షల వరకు సంపాదిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్లో మహిళలు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రసాయన ఎరువుల కారణంగా పంటలు విషపూరితం అవుతున్నాయి. ఈ క్రమంలో ప్రకృతి వ్యవసాయం వైపు ఎంతోమంది రైతులు మొగ్గు చూపుతున్నారు. అన్నదాతలు మాత్రమే కాదు.. అన్నమయ్య జిల్లాలోని మహిళలు పొదుపు సంఘాలతో పాటు ప్రకృతి వ్యవసాయం కూడా చేస్తున్నారు. చిరుధాన్యాలతో తినుబండారాలు తయారు చేసి అమ్ముతున్నారు.. తద్వారా లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తున్నారు.. లాభాలు కూడా పొందుతున్నారు. అన్నమయ్య జిల్లా అయ్యవారిపల్లె, చింతలవారిపల్లె, చింతపర్తి, నగిరి మడుగ, బూడిద వేడుకు చెందిన 15 మంది మహిళలు కలిసి ఒక సంఘంగా ఏర్పడ్డారు. వారికి అందుబాటులో ఉన్న తక్కువ విస్తీర్ణంలోనే ఏకంగా ఏడు రకాల కూరగాయలు, ఆకుకూరలు నేచరల్గా పండిస్తున్నారు. అంతేకాదు చిరుధాన్యాలతో తినుబండారాలు తయారు చేస్తున్నారు.. వీటిలో రాగి లడ్డూలు, కొర్ర పాయసం, సద్ద మురుకులు వంటివి ఉన్నయాయి. ఇలా పండించిన కూరగాయలు, ఆకుకూరలు.. తయారు చేసిన తినుబండారాలను తీసుకెళ్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల దగ్గర విక్రయిస్తున్నారు.. ప్రతి సోమవారం అమ్మకాలు జరుగుతున్నాయి. ఇలా ప్రతి సోమవారం ఒక్క రోజులోనే దాదాపు 4 నుంచి 5 క్వింటాళ్ల కూరగాయలు అమ్ముతు సక్సెస్ అయ్యారు. ఇలా వీరు రూ. 14వేల నుంచి రూ. 20వేల వరకు ఆదాయం సంపాదిస్తున్నారు. ఏడాది పొడవునా దిగుబడి వస్తూనే ఉంటుందని మహిళా రైతులు చెబుతున్నారు. ఇలా తమ సంఘంలో ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు ఆదాయం వస్తుంది అంటున్నారు. వీరు స్టాల్స్ ద్వారా వారానికి ఒకరోజు అమ్మకాలు చేయడంతో మంచి ఆదాయం వస్తోంది. తాము కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నామని.. ఈ విధానం అటు మహిళలతో పాటుగా ఇటు ప్రజలకు మంచిదన్నారు. తాము స్వయంగా ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకుంటున్నామని చెబుతున్నారు మహిళలు. ఇటీవల కాలంలో ప్రజలు ప్రకృతి ఉత్పత్తులను కొనడానికి ఆసక్తి పెరిగిందని.. తాము ఏడాదికి లక్ష రూపాయలకు తగ్గకుండా ఆదాయం పొందుతున్నామంటున్నారు. అది కూడా తాము ప్రకృతి విధానంలో వ్యవసాయం చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నాము అంటున్నారు. నాణ్యమైన ఆహార ఉత్పత్తులను తయారు చేసి స్వయంగా అమ్ముకుంటున్నామని.. తమకు ఆర్థికంగా ఉపయోగంగా ఉంటుందంటున్నారు. ఇలా సంపాదించిన డబ్బులతో తమ పిల్లలను చదివిస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నామంటున్నారు. తామంతా కలిసి వ్యవసాయం చేస్తున్నామని.. అలాగే తినుబండారాలు తయారు చేసి అమ్ముతున్నామంటున్నారు మహిళలు. ఇలా మంచి ఆదాయం వస్తోందని.. తాము రాబోయే రోజుల్లో మరింత విస్తీర్ణంలో పంటలు పండించాలని భావిస్తున్నట్లు తెలిపారు. తాము కూడా భవిష్యత్లో పెద్ద ఎత్తున అమ్మకాలు జరపాలని ఆలోచన ఉందన్నారు. ఈ ఆలోచన ఒక్క అన్నమయ్య జిల్లాకు మాత్రమే కాదు రాష్ట్రవ్యాప్తంగా మహిళలు కూడా ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

# గొడ్డలి గుర్తు...రచ్చ...

విజయవాడ, జూలై 16,

వైఎస్సార్సీపీ ఎన్నికల గుర్తుకు సంబంధించి ఓ లేఖ వైరల్ అవుతోంది. ఆ పార్టీకి ఫ్యాన్కు బదులు గొడ్డలిని కేటాయించాలని కేంద్ర ఎన్నికల కమిషన్ను కోరుతూ లేఖ రాసినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఈ అంశంపై క్లారిటీ వచ్చింది.. వైఎస్సార్సీపీ ఎన్నికల గుర్తుగా ఫ్యాన్ బదులు గొడ్డలిని కేటాయించాలని తాను ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందన్నారు యుగతులసి పార్టీ అధ్యక్షుడు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు కొలిశెట్టి శివకుమార్. ఈ మేరకు వైరల్ అవుతున్న లేఖ పూర్తి అవాస్తవం, కల్పితమని తెలిపారు. సోషల్ మీడియాలో ఈ దుష్ప్రచారానికి కారకులైన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.. వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్రెడ్డిని కోరుతున్నట్లు తెలిపారు. అలాగే త్వరలోనే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రాబోతోందని తాను పోటీచేయనున్నట్లు శివకుమార్ తెలిపారు. మా పార్టీకి ప్రస్తుతం 'ఫ్యాన్' గుర్తు ఉంది.. పలు అంతర్గత సంప్రదింపుల అనంతరం మా పార్టీ చిహ్నాన్ని 'గొడ్డలి' గుర్తుగా మార్చాలని నేను ఏకగ్రీవంగా నిర్ణయించాను. మా పార్టీ భవిష్యత్తు, గుర్తింపు, రాజకీయ వ్యూహం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాను. 1968 ఎన్నికల చిహ్నాల ఆర్డర్ ప్రకారం సంబంధిత నియమాలు, విధానాలకు అనుగుణంగా వీలైనంత త్వరగా గొడ్డలిని తమ పార్టీ చిహ్నంగా కేటాయించాలని కోరుతున్నాను. పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానాలు, డాక్యుమెంట్లు, అఫిడవిట్లు లేఖకు జత చేశాను. మీ సానుకూల పరిశీలన కోసం మేము ఎదురుచూస్తున్నాము' అని ఆ లేఖలో ప్రస్తావించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో శివకుమార్ స్పందించి క్లారిటీ ఇచ్చారు.

వైఎస్సార్సీపీ (వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ) పూర్తి పేరు యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ.. దీనిని వైఎస్ రాజశేఖర్ రెడ్డి అభిమాని



శివకుమార్ ఎన్నికల సంఘం దగ్గర రిజిస్టర్ చేశారు. అయితే అనంతరం వైఎస్సార్ తనయుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి దానిపై హక్కులను పొందారు. 2009లో వైఎస్సార్ మరణం తర్వాత కాంగ్రెస్ పార్టీతో వైఎస్ జగన్కు విభేదాలు రావడంతో 2010 నవంబరు 29న కడప లోక్సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2010 డిసెంబరు 7న పులివెందులలో పార్టీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 2011 మార్చిలో యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో తొలిసారి పోటీచేసి ఘన విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయి ప్రతిపక్ష స్థానానికి పరిమితమైంది. 2019 ఎన్నికల్లో పోటీచేసి 151 స్థానాల్లో గెలిచి తొలిసారి అధికారంలోకి వచ్చింది.. ఆ తర్వాత 2024 ఎన్నికల్లో మరోసారి పోటీచేయగా ఘోర పరాజయం ఎదురైంది.. 11 స్థానాలకు పడిపోయింది.

## గ్రేటర్ లో మూడు నియోజకవర్గాల్లో ఎన్నికలు

హైదరాబాద్, జూలై 16,

లంగాణ రాజకీయం ఫుల్ హీట్ మీదుంది. నువ్వానేనా..తగ్గేదేలే అంటూ అధికార కాంగ్రెస్, అపోజిషన్ బీఆర్ఎస్ సవాళ్లు, ప్రతిసవాళ్లు..విమర్శలతో పొలిటికల్ వార్ను నెక్ట్ లెవల్కు తీసుకెళ్తున్నాయి. ఇదే టైమ్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పార్టీలు రెడీ అవుతున్నాయి. మాగంటి గోపినాథ్ సతీమణి సునీతను బరిలోకి దింపాలని గులాబీ పార్టీ ఆల్రెడీ డిసైడ్ అయిందంటున్నారు. ఇప్పటికే గ్రౌండ్లో పరిస్థితులను అంచనా వేయడానికి సర్వే కూడా చేయించినట్లు తెలుస్తోంది. అయితే జూబ్లీహిల్స్తో పాటు గ్రేటర్లో మరో రెండు బైపోల్స్ రాబోతున్నాయన్న టాక్ ఊపందుకుంది. ఖైరతాబాద్ అసెంబ్లీ సీటుకు కూడా ఉప ఎన్నిక రావొచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్లో గెలిచి..కాంగ్రెస్లో చేరి..హస్తం పార్టీ సింబల్ మీద ఎంపీగా కంటెస్ట్ చేసిన దానం నాగేందర్పై అనర్హత వేటు పడటం ఖాయమన్న చర్చ జరుగుతోంది. ఈ నెల 18 తర్వాత ఎప్పుడైనా కోర్టు తీర్పు రావొచ్చంటున్నారు. ఈ నేపథ్యంలోనే అనర్హత వేటు పడే కంటే ముందే రాజీనామా చేయాలనే ఆలోచనలో దానం ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే మంత్రి పదవి ఇస్తానంటే..జూబ్లీహిల్స్లో పార్టీని గెలిపిస్తా..తాను రిజైన్ చేసి ఖైరతాబాద్లో మళ్లీ గెలుస్తానని దానం కండీషన్ పెడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే వారం రోజుల్లోపే దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారని అంటున్నారు. నెలాఖరులో జరిగే మంత్రివర్గ విస్తరణలో ఆయనకు చోటు దక్కడం పక్కా అని..మినిస్టర్ హోదాలోనే ఆయన ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేస్తారని కూడా గాంధీభవన్ వర్గాల ఇన్ సైడ్ టాక్. దానం రిజైన్ చేస్తే గ్రేటర్లో రెండు బైపోల్స్ పక్కా. అదీ కూడా పక్క పక్క నియోజకవర్గాల్లోనే ఎన్నికలు జరగనున్నాయి. ఇదే క్రమంలో ఎమ్మెల్యే రాజాసింగ్ ఎపిసోడ్ ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్..బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ సందర్భంగా రాజీనామా చేయడం దుమారం లేపింది. ఇప్పుడు ఆయన రిసిగ్నేషన్ను పార్టీ హైకమాండ్ ఆమోదించడంతో రాజాసింగ్ ఎమ్మెల్యే పదవికి కూడా రిజైన్ చేస్తారన్న టాక్ వినిపిస్తోంది. బీజేపీ నేతలు కూడా రాజాసింగ్ రాజీనామా చేయాలన్న డిమాండ్లు తెస్తున్నారు. అవసరమైతే అనర్హత వేటు కోసం స్పీకర్కు కంప్లైంట్ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. రాజాసింగ్ కూడా ఎమ్మెల్యే పదవికి రిజైన్ చేయాలని భావిస్తున్నారట. అదే జరిగితే గ్రేటర్ హైదరాబాద్లో మూడు బైపోల్స్ రావడం పక్కా. అటు దానం..ఇటు రాజాసింగ్ జూబ్లీహిల్స్ బైపోల్ నోటిఫికేషన్ వచ్చే కంటే ముందే రిజైన్ చేస్తే..మూడు బైపోల్స్కు ఒకేసారి నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. అటు దానం..ఇటు రాజాసింగ్ డెసిషన్ తీసుకుంటే మాత్రం.. భాగ్యనగరం వేదికగా మినీ దంగల్ పక్కా. ఇదే జరిగితే పార్టీల వ్యూహాలు, ప్రతివ్యూహాలు ఎలా ఉండబోతున్నాయనేది ఇంట్రెస్టింగ్గా మారింది. అంతేకాదు ఒకేసారి మూడు బైపోల్స్ అంటే చిన్న విషయం కాదు. అన్నీ పార్టీలకు ప్రెస్టేజ్కా సవాల్. ఇందులో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలు రెండు..బీజేపీది ఒకటి. ఇప్పటికే గ్రేటర్లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బైపోల్లో గెలిచిన కాంగ్రెస్..మూడు సీట్లకు ఉప ఎన్నికలు వస్తే మాత్రం ప్రతిష్టాత్మకంగా తీసుకునే అవకాశం ఉందిఇక రాజాసింగ్ విషయానికొస్తే బీజేపీ అధిష్టానం తన రాజీనామాను ఆమోదిస్తుందని ఆయన ఊహించలేదట. తన వెర్షన్ విని..అంతా సెట్రైట్ చేస్తారని భావించారట. అయితే రాజీనామా ఆమోదంతో..రాజాసింగ్ మహారాష్ట్ర రాజకీయాల్లోకి వెళ్లడం పక్కా అన్న టాక్ వినిపిస్తోంది. మహారాష్ట్రలోని ఉద్దవ్ శివసేనలో చేరి..ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా ఉంటూ..అక్కడ..ఇక్కడ పాలిటిక్స్ చేయాలనేది రాజాసింగ్ వ్యూహమట. లేకపోతే మహారాష్ట్రలోనే యాక్టీవ్ పాలిటిక్స్లో ఉండాలనేది రాజాసింగ్ ఆలోచన అని కూడా చెప్తున్నారు. ఈ క్రమంలో గోషామహల్ నుంచి మళ్లీ పోటీ చేసి గెలవాలనే కసితో రాజాసింగ్ ఉన్నా..బీజేపీ ఆయనపై అనర్హత ఫిర్యాదు చేసినా..బైపోల్ రావడం ఖాయం. అదే జరిగితే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు ముందే..రాష్ట్ర రాజధానిలో మూడు అసెంబ్లీ సీట్ల ఎన్నికల సమరం పొలిటికల్ హీట్ను పెంచనుంది. దానం ఇచ్చిన ఆఫర్పై కాంగ్రెస్ ఎలా స్పందిస్తుంది..? ఎమ్మెల్యే పదవికి రాజీనామాపై రాజాసింగ్ ఆలోచనేంటి.? అనేది చూడాలి మరి

## కరకట్ట పనులను త్వరతగతిన పూర్తి చేయాలి

### బీఆరెస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నరసింహారావు

ములుగు జూలై 16, ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో గోదావరిని అనుకుని ఉన్న కరకట్ట పనులను త్వరతగతిన పూర్తి చేయాలని బీఆరెస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మీ నరసింహారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రం మరియు రామన్నగూడెం గోదావరి కరకట్టను పార్టీ శ్రేణులతో కలిసి బీఆరెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకులమరి లక్ష్మీనర్సింహారావు పరిశీలించారు. ఇరవై యేళ్ళ క్రితం నిర్మించిన గోదావరి కరకట్ట వరద తాకిడికి చాలా ప్రదేశాల్లో దెబ్బతిని వ్యవసాయ భూములతో పాటు ఇళ్ళలోకి వరద నీరు చేరే ప్రమాదమున్నదని, గత బీఆరెస్ ప్రభుత్వం దెబ్బతిన్న కరకట్ట ప్రదేశాలలో రివిట్ మెంట్ చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రేస్ ప్రభుత్వం కరకట్ట పనులను త్వరతగతిన ప్రారంబించి ప్రమాదానానికి చేరువలో ఉన్న ఓడగూడెం వద్ద కరకట్ట ఎత్తు నిర్మాణం చేపట్టాలని సూచించించారు. జియో ట్యూబ్ టెక్నాలజీ తో అస్సాం రాష్ట్రంలో సక్సస్ అయింది కాని మన వద్ద ఆ టెక్నాలజీ పై ఇంజనీర్లకు అవగాహన లేదని మంత్రి సీతక్క ఈ టెక్నాలజీ పై పూర్తి అధ్యయనం చేయించి పనులు ప్రారంబించేలా చేయాలన్నారు.

# గిరిజన గ్రామాల మధ్య పులిజోన్ చిచ్చు

అదిలాబాద్, జూలై 16,

నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మైసంపేట్, రాంపూర్ పునరావాస గ్రామాల వద్ద ఉద్రిక్తత నెలకొంది. 94 మంది లబ్ధిదారులకు ఇక్కడ వ్యవసాయ భూములు కేటాయించింది. దీన్ని నచ్చన్ ఎల్లాపూర్ గొండ్ గూడ రైతులు వ్యతిరేకించారు. వ్యవసాయ భూముల పంపిణీలో అటవీ,పోలీస్,రెవెన్యూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, ఎంపీడీవో రేవంత్ చంద్ర



ఆధ్వర్యంలో అటవీ అధికారులు రెవెన్యూ అధికారులతో కలిసి పంపిణీకి సిద్ధమయ్యారు. కేటాయించడానికి గుర్తించిన రెవెన్యూ భూములకు హద్దు రాళ్ళు వేసేందుకు అధికారులు వచ్చారు. అక్కడ నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ రైతులు ఆందోళన చేపట్టారు. ఈ భూములు తమవని కష్టపడి సాగచేసుకున్నామని అధికారులకు తెలియజేశారు. ఈ భూముల జోలికి రావద్దంటూ రెవెన్యూ, అటవీ అధికారుల కాళ్ళు మొక్కేందుకు కాళ్ళ మీద పడ్డారు. అటవీ అధికారులు టైగర్ జోన్ పరిధిలో ఖాళీ చేసిన రాంపూర్, మైసంపేట పునరావాస గ్రామస్తులకు కేటాయించారు. ఈ భూమిని సాగుచేస్తున్న తమపై అటవీ భూమి అని కేసులు పెట్టారని తెలియజేశారు. ఈ భూమికి తామే అర్హులమని, పంటలు వేస్తే తమకే ఇవ్వాలంటూ రైతులు డిమాండ్ చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య తీవ్రవాగ్వాదం చోటు చేసుకుంది. కేటాయించిన భూముల హద్దులు చూపెడతాము రమ్మని పిలవడంతో మైసంపేట్, రాంపూర్ ప్రజలు వచ్చారు. అధికారుల చర్యలు అడ్డుకోవడానికి నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజన రైతులు వచ్చారు. ఈ క్రమంలోనే ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులు చెప్పినా వినకపోవడంతో రెండు రోజుల తర్వాత మళ్లీ హద్దుల ఏర్పాటు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. అనంతరం అందరూ వెనుదిరిగారు.

# కనిపించని వరుణుడు... ఎండుతున్న పంటలు

మెదక్, జూలై 16,

ఖరీఫ్ సాగుకు సిద్ధమైన అ న్నదాతలకు,కన్నీటి కష్టాలు ఎదురవుతున్నా యి. మండల వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్లో సాగయ్యే ప్రధాన పంటలు పత్తి, వరి, మిర్చిఇతర వాణిజ్య పంటలపై వరుణుడు తన ప్రభావాన్ని చూపుతున్నాడు. ఈ సీజన్లో జూన్ నెల ప్రారంభంలో రైతులు పత్తి, నారుమళ్ళను నాటారు. ఇప్పటివరకు సరైన వర్షాలు పడకపోవడంతో అవి మొలకెత్తలేదు.రైతులు మళ్లీ జూలై నెలలో పత్తి విత్తనాలు రెండవసారి నాటారు .అవి మొలకెత్తిన తర్వాత వర్షాలు కనుమరుగు అ య్యాయి. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం జాడలేక ప్రభు త్వం సాగర్ కాలువల ద్వారా సాగునీరు విడుదల చేయక పంట పొలాలు బీటలు వారడంతో కాలువల కింద వ్యవసాయం



చేస్తున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇం జన్ల ద్వారా నీరు అందిస్తూ పంట ను కాపాడుకోవటానికి భగీరథ ప్రయ త్నం చేస్తున్నారు. కళ్ళ ముందే ఎండుతున్న పంటలను చూసిన రైతు తట్టుకోలేకపోతున్నారు.. నాట్లు వేశామని ఆనందపడిన అన్నదాతలు నేడు సాగునీరు లేక ఎండుతున్న పంటలను చూసి బావురుమంటున్నారు. సకాలంలో వర్షాలు పడతా యని, కాలువలతో సాగునీటికి ఇబ్బంది ఉండదని పంటలు వేసిన అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి. నియోజక వర్గంలో సుమారు లక్ష ఎకరాల్లో వరి సాగవుతుంది. వరి సాగు చేసిన రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.కళ్ల ముందే బీటలువారి ఎండుతున్న పంటలనుకాపాడు కోవడానికి అన్నదాతలు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. కాలువలో ఉన్న అరకొర నీటిని ఆయిల్ ఇంజన్లతో తోడి పంటలను కాపాడుకో వటానికి అష్టకష్టాలు పడుతు న్నారు. పొలంలో చుక్కనీరు లేక నెర్రెలు ఇచ్చి.. ఎండిపోతు చూసి రైతు ఆవేదన చెందు తున్నారు. కొద్దిపాటి నీటిని తొడటానికి రోజుకు ఆయిల్, ఇంజను అద్దె కలిపి రోజుకు 2 వేల రూపాయలు అదనంగా ఖర్చవుతుందని, ఇప్పటికే ఎకరాకు రూ. 22 వేలు ఖర్చు చేశామని వాపోతున్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సాగర్ నీటిని విడుదల చేస్తే ఎ లాంటి ఇబ్బంది లేకుండా వ్యవసాయం చేసుకుంటామని లేకపోతే ఆత్మహత్యలే శరణ్య మంటున్నారు.

# సేమ్ సీన్... ఆల్ పార్టీస్

హైదరాబాద్, జూలై 16, (న

తెలంగాణలోని ఏదైనా గ్రామంలోకి వెళ్లి కాంగ్రెసోళ్ల గురించి అడిగితే తిడుతున్నారు. మరి బీఆర్ఎస్ సంగతేంది అంటే మద్దతుగానూ మాట్లాడడం లేదు. అసలు బీజేపీని పట్టించుకోవడం లేదు. ఇలాంటి దృశ్యం తెలంగాణలో ఎప్పుడూ లేదు. ఏదో ఒక పార్టీకి వెన్నుదన్నుగా ఉండేవారు ఇక్కడి వారు. కానీ ఎందుకో ఇప్పుడు మూడు ప్రధాన పార్టీల విషయంలో జనాల్లో విముఖత స్పష్టంగా కనిపిస్తోంది. కొత్త శక్తులు, పార్టీలు వచ్చే స్కోపు లేదు. సో ఈ మూడింటిలోనే ఒకదాన్ని ఎంచుకోవాల్సిన పరిస్థితి. ప్రస్తుతానికి ఏ పార్టీకి కూడా అంతగా ఎడ్జ్ లేని వాతావరణం అయితే స్పష్టంగా కనిపిస్తోంది.తెలంగాణ ప్రజల తీర్పు ఖచ్చితంగా ఉండేది.. అనాదిగా ట్రాక్ రికార్డ్ చూస్తే ఏదో ఒక పార్టీకి పట్టం కట్టేవారు. క్లియర్ కట్ మెజార్టీ అయితే ఈ ప్రాంతంలో వచ్చేది. ప్రజలు సూటిగా సుత్తిలేకుండా ఆలోచించేవారు. అయితే తెలంగాణలో పార్టీలు ఎక్కువయ్యాయి. మంది ఎక్కువైతే మజ్జిగ పలుచన అయినట్టు.. జనాలు మారిపోయారు. మూడు పెద్ద పార్టీలు.. మధ్యలో చిన్నా చితక పార్టీలతో మొత్తం కలగపులగంగా తయారైంది.తెలంగాణలో బరువుకు మించి హామీలతో గద్దెనెక్కింది కాంగ్రెస్ సర్కార్. రేవంత్, నేతల దూకుడుతో.. బోలెడంత సంక్షేమం, అభివృద్ధి, వేలకు వేలు అకౌంట్లో పడిపోతాయిన జనం భ్రమించి ఓటేశారు. కానీ తెలంగాణ అప్పుల్లో కూరుకుపోయిందని.. కేసీఆర్ అప్పుల పాలు చేశాడని రేవంత్ జరుపుకుంటూ వచ్చేశారు. మొత్తానికి కిందా మీదా పడి డబ్బులు సర్దుకుంటూ సంక్షేమం పంచుతున్నా.. కొందరికి పడుతూ.. మరికొందరికి పడక వ్యతిరేకత అయితే బాగా స్ప్రెడ్ అవుతోందని క్షేత్రస్థాయి పరిస్థితులను బట్టి అర్థమవుతోంది. ఎవరినీ అడిగినా కాంగ్రెస్ గురించి ప్రస్తుతానికి పాజిటివ్ గా స్పందించడం లేదు..మరి ఈ వ్యతిరేకత బీఆర్ఎస్ పై పాజిటివ్ గా మారుతుందా అంటే అదీ లేదు. ఎందుకంటే గత ప్రభుత్వంలో కేసీఆర్ ప్రజలు, ప్రజాప్రతినిధులకు దూరంగా పాలించారు. జనాలకు డైరెక్టుగా కనెక్ట్ కాలేకపోయారు. కొన్ని పథకాలు, సంక్షేమం బాగానే ఉ న్నా.. బీఆర్ఎస్ నేతలు జనంలోకి రాకపోవడం వారిపై వ్యతిరేకతకు కారణమైంది. కాంగ్రెసోళ్లు మొత్తం జనాల్లోనే ఉ ండడం.. తెలంగాణ పట్టణ జనాభా కంటే గ్రామీణ జనాభా మొత్తం కాంగ్రెస్ వెంట నడిచింది. అసలు గ్రామాల్లోకి వెళ్లని బీఆర్ఎస్ ఓడిపోయింది. ఎమ్మెల్యే సీట్లు అన్నీ కూడా కాంగ్రెస్ రూరల్ లోనే గెలిచింది. బీఆర్ఎస్ ఎప్పుడైతే జనానికి దూరమైందో అదే వారి ఓటమికి కారణమైంది. ఇప్పటికీ కాంగ్రెస్ ను తిడుతున్నా.. బీఆర్ఎస్ నేతలు జనంలోకి రారు.. రాలేరు అన్న అపప్రదతో ఆ పార్టీకి మనస్ఫూర్తిగా జనాలు అనుకూలత చూపించడం లేదు..మరి బీజేపీది మరో కథ.. రెండేళ్లకోసారి అధ్యక్షుడిని మారుస్తూ ఏ బీజేపీ నేత ఎప్పుడు ఉంటారో.. ఎవరు నడిపిస్తారో.. అసలు నడిపిస్తామన్న వారికి అధ్యక్ష పీఠం ఎందుకు ఇవ్వరో అర్థం కాని పరిస్థితి. ఒక బలమైన నాయకుడిని ఎదగనీయకుండా కేంద్ర బీజేపీ నాయకత్వం తెలంగాణలో అసలు ఎలాంటి స్ట్రాటజీని అమలు చేస్తుందో బీజేపీ రాష్ట్ర నేతలకు కూడా అర్థం కాని పరిస్తితి. రాజాసింగ్ లాంటి నేతలు దీనిపై నిలదీస్తే 'గెట్ అవుట్' అంటూ గెంటించేస్తున్నారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో పట్టుమని పాతిక నియోజకవర్గాలకు కూడా బలమైన నేతలు, క్యాడర్ లేదు. ఇదే బీజేపీని తెలంగాణకు దూరం చేస్తోంది. సోదిలో లేకుండా చేస్తోంది..ఏతావాతా చెప్పొచ్చేది ఏంటయ్యా అంటే.. తెలంగాణలో ప్రస్తుతం ఏ పార్టీని చూసినా ఏమున్నాది గర్వకారణం అన్నట్టుగా ఉంది.

# రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్న కమలం

రంగారెడ్డి, జూలై 16

స్థానిక సంస్థల ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ సమాయత్తం అవుతోంది. ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు దక్కించుకోవడమే లక్ష్యంగా నాయకులను, శ్రేణులను సంసిద్ధులను చేయడానికి రంగం సిద్ధం చేసిం ది. ఈమేరకు మంగళవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి అవుషాపూర్‌లో రాష్ట్ర పదాధికారులతో ప్రత్యేక వర్క్ షాపు నిర్వహించింది.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి పార్టీ జాతీయ కార్యదర్శి సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా వచ్చారు. వర్క్‌షాపునకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి అభయ్‌పాటిల్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ తేదీల వారీగా ప్రకటించా రు.ఈనెల 18 నుంచి ఆగస్టు 20వరకు వరుసగా కార్యక్రమాలు



నిర్వహించనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చి నామినేషన్లు వేసిన తర్వాత తదుపరి కార్యక్రమాలకు రూపకల్పన చేయనున్నారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ మాదిరిగానే, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే అవినీతి, ప్రజావ్యతిరేక పాలనను కొనసాగిస్తోందని విమర్శించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా తాను నల్లగొండ, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో మొట్టమొదటి పర్యటన చేశానని, ఈపర్యటనలో వివిధ వర్గాల ప్రజలను కలిసి నట్లు తెలిపారు. గ్రామాల్లో బీజేపీ బలం పెరుగుతోందని, ప్రజలు బీజేపీ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు.గతంలో భారతీయ జనతా పార్టీకి ఒక్క ఎమ్మెల్యే, నలుగురు ఎంపీలు మాత్రమే ఉండగా, ఇప్పుడు ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు, ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని, ప్రతీ ఎన్నికలో బీజేపీ ఓటుశాతం, ప్రాతినిధ్యం పెరుగుతోందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలిచేలా విజయసంకల్పంతో ముందుకు సాగాలని, అందుకుకార్యకర్తలు, నాయకులు ముందుకు రావాలని, అందరం కలిసిమెలిసి ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు అందులో 10 శాతం మతపరమైన రిజర్వేషన్లను కలుపాలని చూస్తోందని ఇది బీసీలకు వ్యతిరేకమైన చర్య ఉన్నారు. మతపరమైన కారణాల వల్లే ఆనాడు భారతదేశ విభజన జరిగిందన్న విషయాన్ని గుర్తుచేశారు.విద్యా, ఉద్యోగాల్లో మతపరమైన 4 శాతం రిజర్వేషన్లను బీజేపీ గతంలోనే వ్యతిరేకించిందని, కానీ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు రాజకీయం కోసం ఇప్పుడు రాజకీయాల్లోనూ అదే విధానాన్ని కొనసాగిస్తోందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని, ప్రజల కోసం పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచేలా ఇప్పటినుంచే కృషి చేయాలన్నారు.

# మిధున్‌రెడ్డి అరెస్టుకు లైన్ క్లియర్

విజయవాడ, జూలై 16,

మద్యం కుంభకోణం కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుంది కూటమి ప్రభుత్వం. దీని ద్వారా భారీగా ధనం హవాలా రూపంలో విదేశాలకు వెళ్లిపోయిందని అనుమానిస్తోంది. మొన్నటి ఎన్నికల్లో మద్యం ద్వారా వచ్చిన నగదును ఖర్చు చేసేందుకు కూడా వైసిపి సిద్ధమైనట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఇప్పటికే ఈ కేసులో కీలక అరెస్టులు జరిగాయి. మరోవైపు ఇప్పుడు ఎంపీ మిధున్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అప్పట్లో మద్యం కంపెనీలతో డీల్.. డిస్టలరీలను చేజిక్కించుకోవడం వంటి వాటిలో మిథున్ రెడ్డి కీలకపాత్ర పోషించారని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేలింది. దీంతో మిధున్ రెడ్డిని అరెస్టు చేస్తారని ప్రచారం సాగింది. ఈ తరుణంలో మిథున్ రెడ్డి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆయనకు నిరాశ ఎదురయింది.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ హయాంలో దూకుడుగా వ్యవహరించిన, అవినీతికి పాల్పడిన నేతలపై ఫుల్ ఫోకస్ పెట్టింది. ముఖ్యంగా వైసిపి మద్యం పాలసీ ద్వారా వేలకోట్ల ముడుపులు అందాయని అనుమానిస్తోంది. దాదాపు నాలుగు వేల కోట్ల రూపాయల వరకు హవాలా రూపంలో దేశం దాటించారని కూడా అంచనా వేస్తోంది. ఈ మొత్తం కుంభకోణంలో రాజ్ కసిరెడ్డి పాత్ర ఉందని తేలింది. ముందుగా ఆయన అరెస్టు జరిగింది. అప్పటి సీఎంఓ కీలక అధికారి ధనుంజయ రెడ్డి, మొన్నటికి మొన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని కూడా అరెస్టు చేశారు. అయితే పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి ఎంపీ కావడంతో ఆయన అరెస్ట విషయంలో దర్యాప్తు బృందం తర్జనభర్జన పడుతోంది. ఈ నేపథ్యంలో కేసు హైకోర్టు నుంచి సుప్రీంకోర్టుకు.. సుప్రీంకోర్టు నుంచి హైకోర్టుకు తిరుగుతూ వస్తోంది. అయితే ఇప్పుడు హైకోర్టులో ముందస్తు బెయిల్ విషయంలో తీర్పు వచ్చింది. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్న ఇలాంటి సమయంలో ముందస్తు బెయిల్ ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. అంటే మిథున్ రెడ్డి అరెస్టు జరగకుండా.. రక్షించలేమని న్యాయస్థానం తేల్చేసిందన్నమాట.



మద్యం కుంభకోణంలో రాజ్ కసిరెడ్డి సూత్రధారి. ఈ విషయం వైయస్సార్ కాంగ్రెస్ మాజీ నేత విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. మద్యం కంపెనీలతో డీల్ కు సంబంధించి సిట్టింగులు జరిగాయని.. అందులో నేను కూడా ఉన్నానని.. కానీ ఆ కుంభకోణంతో తనకు సంబంధం లేదని విజయసాయిరెడ్డి తేల్చి చెప్పారు. అయితే ఇప్పుడు రాజ్ కసిరెడ్డి వెనుక మిథున్ రెడ్డి ఉ న్నారని స్పష్టమవుతుంది. అందుకే విజయసాయిరెడ్డి రాజ్ కసిరెడ్డిని టార్గెట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. రాజ్ కసిరెడ్డి ద్వారా వ్యవహారం నడిపింది మిథున్ రెడ్డి అని.. ప్రతి శనివారం తాడేపల్లి ప్యాలెస్ కు వెళ్లి లెక్కలు చెప్పే వారని ఒక ప్రచారం అయితే ఉంది. అయితే లిక్కర్ స్కాం డబ్బులను మనీ లాండరింగ్ గా చేశారని.. దీనికి సంబంధించి సిట్ వద్దా స్పష్టమైన సాక్షాలు ఉన్నాయి. కానీ చట్టంలో ఉన్న లొసుగులను ఉపయోగించుకొని ముందస్తు బెయిల్ పొందాలని మిథున్ రెడ్డి భావించారు. అయితే సుప్రీంకోర్టు వరకు ఈ ముందస్తు వెళ్ళగా.. హైకోర్టుకు వెళ్లి తేల్చుకోవాలని ఆదేశించింది అత్యున్నత న్యాయస్థానం. కానీ హైకోర్టులో ఇప్పుడు షాకింగ్ తీర్పు వచ్చింది. మిథున్ రెడ్డి అరెస్ట్ కు లైన్ క్లియర్ అయ్యింది. ఒకటి రెండు రోజుల్లో అరెస్టు తప్పదని తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# నక్సల్స్‌కు ఛత్తీస్ ఘడ్ ఓపెన్ ఆఫర్

## సంసార జీవితం ఇస్తామని హామీ

రాయ్ పూర్, జూలై 16,

నమ్మిన సిద్ధాంతం కోసం.. దోపిడీ లేని సమాజం కోసం.. నక్సల్స్ సంవత్సరాలుగా అజ్ఞాత జీవితాన్ని గడుపుతున్నారు. అడవుల్లో బతుకుతూ.. సభ్య సమాజంలో మార్పుకు కృషి చేస్తున్నారు. దీనికోసం ఎంచుకున్న వారి పోరాటం కొన్ని సందర్భాల్లో సత్ఫలితాలను.. మరి కొన్ని సందర్భాలలో దుష్ఫలితాలను ఇస్తోంది. వీటి గురించి చర్చ పక్కన పెడితే.. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను ఏరిపారేస్తోంది. ఇటీవలి కాలంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్ర నాయకులను కేంద్ర బలగాలు మట్టు పెడుతున్నాయి. వరుస ఆపరేషన్లతో ఊపిరి ఆడకుండా చేస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు నక్సల్స్ లేని దేశంగా భారత్ ను మార్చుతామని పేర్కొన్నారు. ఇది ఇలా ఉ ండగానే చత్తీస్ గడ్ ప్రభుత్వం సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది..చత్తీస్ గడ్ ప్రభుత్వం నక్సలైట్లకు సంసార జీవిత యోగాన్ని కల్పించేందుకు ఒక కొత్త పథకానికి రంగం సిద్ధం చేసింది. అయితే సంసారపు జీవితానికి మావోయిస్టులు ఆకర్షితులవుతారా? తిరిగి జనజీవన స్రవంతిలోకి వస్తారా? అనే ప్రశ్నలకు సమాధానాలు లభించాల్సి ఉంది. సంసార జీవితానికి ఆకర్షితులు కాని వారంటూ ఉండరు.. ఎందుకంటే 1990లో తిప్పారపు రాములు అనే నక్సలైట్ వరంగల్ నగరాన్ని తన కంటిచూపుతో శాసించేవాడు. ఎంతోమందిని మట్టుపెట్టాడు. వరంగల్ జాయింట్ కలెక్టర్ ను చూస్తుండగానే కిడ్నాప్ చేశాడు. అయితే ఇతడిని హన్మకొండలోని గుడిమండల్ అనే ప్రాంతంలోని సుధా నగర్ ఏరియాలో పోలీసులు ఎన్కౌంటర్ చేశారు.



సుధా నగర్ ఏరియాలో రాములు ఉన్న ఇల్లు ఓ మహిళకు చెందింది. ఆ మహిళతో అతడికి సన్నిహిత సంబంధం ఉంది. అతడికి ఉన్న ఈ వీక్నెస్ ను పోలీసులు గుర్తించి.. ఆమె ఇంటికి వచ్చేది కనిపెట్టి.. చివరికి లేపేశారు.1996లో ఉమ్మడి ఆదిలాబాద్ లో నస్పూర్ ఏరియాలో ఒక పెద్ద ఎన్కౌంటర్ జరిగింది. నాటి పీపుల్స్ వార్ గ్రూపుకు అనుబంధంగా ఉండే సింగరేణి కార్మిక సమాఖ్య అగ్ర నాయకుడు రమాకాంత్ అలియాస్ మాదిరెడ్డి సమ్మిరెడ్డి పోలీసులతో ఏకంగా 36 గంటల పాటు పోరాడాడు. నాడు అతడి చేతిలో సిఐ చక్రపాణి, ఇంకా చాలామంది కానిస్టేబుళు చనిపోయారు.. రమాకాంత్ అత్యంత తెలివిగా తప్పించుకోవడంతో.. ఒకానొక దశలో పోలీసులు ఏమీ చేయలేక చేతులెత్తేశారు. చివరికి రమాకాంత్ ఒక మహిళతో ఉన్నాడని తెలుసుకున్నారు. అతడు ఆమెతో ఉన్న ఇంటి పై కప్పుకు రంధ్రం చేసి.. అందులో నుంచి పెట్రోల్ పోశారు. నిప్పు అంటించి అంతం చేశారు. ఈ ఉదాహరణలు సంసార జీవితానికి దూరంగా ఉన్న అగ్రనేతల వీక్నెస్ పాయింట్లను బయటి ప్రపంచానికి తెలిసేలా చేశాయి.ఇప్పుడు మావోయిస్టులకు చత్తీస్ గడ్ ప్రభుత్వం ఓపెన్ ఆఫర్ ఇవ్వడంతో ఏం చేస్తారనేది చూడాల్సి ఉంది. మరోవైపు ఇటీవల కాలంలో ఆ రాష్ట్రంలో దొరికిపోతున్న మావోయిస్టులు పోలీసులు నిర్వహించిన ప్రెస్ మీట్ లలో సంచలన విషయాలు చెబుతున్నారు.. దళంలో ఆడవాళ్లకు రక్షణ లేకుండా పోతుందని.. అత్యాచారాలు నిరాటంకంగా జరుగుతున్నాయని మహిళా నేతలు చెబుతున్నారు. ఈ ప్రచారాన్ని మావోయిస్టు నేతలు ఖండిస్తున్నారు.. ఈ ప్రచారం ఎలా ఉన్నప్పటికీ.. సంసార జీవితాన్ని కోరుకొని మనిషి ఉండడు. సంసార జీవితానికి ఆకర్షితుడు కాని వ్యక్తి ఉ ండడు.. అలాంటప్పుడు చత్తీస్ గడ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సత్ఫలితాలను ఇస్తుందని చెబుతున్నారు.ఇక ప్రస్తుతం చత్తీస్ గడ్ రాష్ట్ర విషయానికి వస్తే బస్తర్ జిల్లాలోని కాంకేర్ ప్రాంతంలో 2010లో దాదాపు ఆరడజను మంది నక్సలైట్లు వివాహానికంటే ముందు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్నారు. ఈ విషయాన్ని అక్కడ పోలీసులు గుర్తించారు. బస్తర్ పోలీసుల పరిశీలనలో 26 కేసులు వెలుగులోకి వచ్చాయి. అయితే ఇందులో 12 మందికి వైద్యుల పర్యవేక్షణలో తిరిగి సంసార జీవితాన్ని ప్రసాదించారు. మిగతా వారికి కూడా ఆ యోగాన్ని కల్పించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది మాత్రమే కాకుండా లొంగిపోయే మావోయిస్టులకు గృహాలు.. వివాహాలు.. ఐవీఎఫ్ విధానంలో తల్లిదండ్రులయ్యే అవకాశాన్ని కల్పిస్తామని చత్తీస్ గడ్ హోం శాఖ మంత్రి విజయవర్మ ఇప్పటికే చెప్పడం గమనార్హం.

# గాయపడిన యువకుడిని ఆదుకున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ జూలై 16,

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తన గొప్ప మానవత్వాన్ని చాటుకున్నారు. దిగులు చెందొద్దు... అండగా నేను ఉంటానంటూ రోడ్డు ప్రమాద బాధితుడికి ఆపన్న హస్తం అందించారు. సకాలంలో ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించేలా చొరవ చూపించారు. మంగళవారం రాత్రి అధికారిక కార్యక్రమాలను ముగించుకొని వస్తున్న సమయంలో కేబుల్ బ్రిడ్జి కి సమీపంలో ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రోడ్డు పక్కన పడి ఉన్న

ఓ యువకుడిని చూసి చలించిపోయారు. వెంటనే తన వాహనాన్ని ఆపి కిందకి దిగి... బాధితుడికి ఆందోళనకు గురి కావొద్దంటూ ధైర్యం చెప్పారు. స్థానిక పోలీసులను అప్రమత్తం చేశారు.

స్వయంగా దగ్గరుండి క్షతగాత్రుడిని ఆటోలో నిమ్స్ ఆసుపత్రికి పంపించారు. సాయంగా ఓ కానిస్టేబుల్ ను కూడా వెంట పంపించారు. ఏదైనా అవసరం అయితే ఫోన్ చేయమని... వ్యక్తిగత సహాయకుడి ఫోన్ నంబర్ ఇచ్చారు. ఆసుపత్రికి చేరుకోగానే నిమ్స్ వైద్యులతో ఫోన్లో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా చొరవ తీసుకున్నారు. చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి పై ఆరా తీశారు.

సకాలంలో ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం అందేలా కృషి చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# బీసీ ఏలోకి ముదిరాజ్...

హైదరాబాద్, జూలై 16

తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్లను బీసీ డీ కేటగిరీ నుండి బీసీ ఏ కేటగిరీలోకి తక్షణమే మార్చాలని ముదిరాజ్ అధ్యయన వేదిక అధ్యక్షుడు, మాజీ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ డిమాండ్ చేశారు. నిర్మల్ మండలం వెంగ్వాపేట్ గ్రామంలో సోమవారం జరిగిన ముదిరాజ్ జెండా పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ... రాష్ట్రంలో ముదిరాజ్ల జనాభా 60 లక్షలకు పైగా ఉందని.. అయినప్పటికీ వారు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా తీవ్రంగా వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్ల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక రిజర్వేషన్లు తప్పనిసరని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో కూడా బీసీఏ కేటగిరీలో ముదిరాజ్‌లను చుర్చుతామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. దీనిలో భాగంగానే బీసీఏలోకి ముదిరాజ్ లను చేర్చాలని డిమాండ్స్ కూడా పెరుగుతున్నాయి. ముదిరాజ్ నాయకులు ఈ అంశంపై ప్రజాప్రతినిధులను కలుసుకొని వినతి పత్రాలను కూడా సమర్పిస్తున్నారు. ఇదిలా ఉండగా.. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రామాల్లోని ప్రతి చెరువులో 18 ఏళ్లు నిండిన ముదిరాజ్లకు మత్స్యకార సొసైటీ సభ్యత్వాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని పిట్టల రవీందర్ డిమాండ్ చేశారు. మత్స్యకారుల సభ్యత్వాల విషయంలో ఎటువంటి వివాదాలకు తావులేకుండా, జిల్లా మత్స్య అభివృద్ధి శాఖ సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లు పెద్ద ఎత్తున పోటీ చేసి, రాజ్యాధికారాన్ని సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇది వారి సామాజిక, రాజకీయ ప్రాధాన్యతను పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు బొజ్జ నారాయణ, సలేందర్ శివయ్య, బోండ్ల గంగాధర్, బర్మ రాజనర్సయ్య, అనిల్, కిష్టయ్య, దర్శనం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ డిమాండ్ నెరవేరితే ముదిరాజ్ సామాజిక వర్గం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించే అవకాశం ఉంది. ఈ అంశం తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక పరిణామంగా మారే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజ్ సామాజిక వర్గం అత్యధిక జనాభా కలిగిన బీసీ కులాల్లో ఒకటి. రాష్ట్రవ్యాప్తంగా వీరు విస్తరించి ఉన్నప్పటికీ, కొన్ని జిల్లాల్లో వారి జనాభా సాంద్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా.. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో ముదిరాజ్‌ల జనాభా అత్యధికంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రాంతాల్లో మత్స్యకారులుగా, వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే ముదిరాజ్‌లు ఎక్కువగా కనిపిస్తారు. అలాగే.. ఉమ్మడి నల్గొండ, కరీంనగర్ జిల్లాల్లో కూడా వీరి ఉనికి గణనీయంగా ఉంటుంది.

# మచిలీపట్నంలో ప్రారంభమైన మెగా జాబ్ మేళా

## జాబ్ మేళాకు యువత నుండి అనూహ్య స్పందన

మచిలీపట్నం జూలై 16 మచిలీపట్నంలో మెగా జాబ్ మేళా ప్రారంభమయింది. జాబ్ మేళాకు యువత నుండి అనూహ్య స్పందన లభించింది. మంత్రి కొల్లు రవీంద్ర ఆదేశాల మేరకు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహణ జరిగింది. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి మంత్రి కొల్లు రవీంద్రల జాబ్ మేళాను ప్రారంభించారు. జాబ్ మేళాకు సుమారు 30 కార్పొరేట్ కంపెనీలు హాజరయ్యాయి. జాబ్ మేళాలో పాల్గొనేందుకు వేలాదిగా యువత తరలివచ్చింది. తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు బారులు తీరారు. సుమారు 1500 మంది పైగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. గత మూడు రోజులుగా జాబ్ మేళాలో పాల్గొనే యువతకు అధికారులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

# నిమిష ప్రియ కేసులో ఎన్నెన్నో మలుపులు

న్యూఢిల్లీ, జూలై 16,

సినిమాలలో ఏవైనా నేరాలకు పాల్పడిన వారికి ఉరి శిక్షలు విధిస్తుంటారు.. ఒకవేళ చేయని నేరానికి కథానాయకుడు లేదా కథా నాయక పాల్పడితే చివరి క్షణం వరకు కథను నెట్టుకొస్తుంటారు. వారికి ఉరిశిక్ష అమలు చేసే క్రమంలో అప్పటికప్పుడు కీలక నిర్ణయం వెలువడుతుంది. చివరికి ఉరి శిక్ష రద్దు అవుతుంది..యెమెన్ దేశంలో ఉరిశిక్ష కరారైన నిమిషప్రియ విషయంలో కూడా ఇలాంటిదే ఏదైనా అద్భుతం జరుగుతుందని అందరూ అనుకున్నారు. కానీ అలాంటిదేమీ చోటు చేసుకోలేదుకేరళ రాష్ట్రానికి చెందిన నిమిషప్రియ ఇక్కడ నర్సింగ్ కోర్స్ చదువుకుంది. ఆ తర్వాత ఉన్నత ఉద్యోగం నిమిత్తం యెమెన్ దేశానికి వెళ్లిపోయింది. అక్కడ ఓ ఆసుపత్రిలో పనిచేస్తోంది. అంతా బాగుంటుందనుకుంటున్న తరుణంలో ఒక్కసారిగా ఆమె ఓ వ్యక్తి మరణానికి కారణం కావలసి వచ్చింది. ఆమె కావాలని చేసిందా? పొరపాటున జరిగిందా? అనే విషయాలను పక్కన పెడితే అక్కడ పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు. న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. ఆమె ఆ నేరం చేసిందని పోలీసులు నిరూపించడంలో విజయవంతమయ్యారు. న్యాయ స్థానానికి కూడా కావలసింది సాక్ష్యాలు మాత్రమే కాబట్టి ఆమె ఒక వ్యక్తి మరణానికి కారణమైందని భావిస్తూ.. అక్కడి చట్టాల ప్రకారం మరణ దండన విధించింది.. దీంతో నిమిష ప్రియ రోజులు లెక్క పెట్టాల్సి వచ్చింది. నిమిష ప్రియను కాపాడేందుకు అనేక వ్యవస్థలు పనిచేయడం మొదలుపెట్టాయి. కేంద్ర ప్రభుత్వం యెమెన్ ప్రభుత్వ పెద్దలతో సంప్రదింపులు జరిపింది. అయినప్పటికీ అవి విజయవంతం కాలేదు. నిమిష ప్రియాను కాపాడేందుకు ఒక యాక్షన్ కౌన్సిల్ కూడా ఏర్పాటు అయింది. దానికి శామ్యూల్ జెరోన్ నాయకత్వం వహిస్తున్నాడు.. అతడు కూడా అనేక దఫాలుగా యెమెన్ ప్రభుత్వంతో చర్చలు జరిపాడు.. చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడాడు. జరిగిన ఘటన బాధాకరమని.. తనవంతుగా పరిహారం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని.. క్షమాభిక్ష ప్రసాదిస్తే మిలియన్ డాలర్ల పరిహారాన్ని ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామంటూ అతడు తన సంసిద్ధతను వ్యక్తం చేశాడు. అయితే శామ్యూల్ చేసిన ప్రతిపాదనను చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులు ఆమోదించారా? లేదా? అనేది తెలియ రాలేదు.. దీంతో నిమిషప్రియకు ఉరి తప్పదు అనే వార్తలు రావడం మొదలైంది. న్యాయస్థానం వెలువరించిన తీర్పు ప్రకారం నిమిష ప్రియకు బుధవారం ఉరి శిక్ష అమలు చేయాలి. కానీ ఉరి శిక్షను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు యెమెన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర విదేశాంగ శాఖ జరుపుతున్న చర్చల వల్ల ఉరిశిక్ష వాయిదా పడిందని తెలుస్తోంది.. సోమవారం నిమిషప్రియ ఉరిశిక్ష పై సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ దాఖలు చేయగా.. ఆ పిటిషన్ ను విచారించిన సుప్రీంకోర్టు.. కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ అడిగింది.."ఇప్పటికే చేయాల్సింది మొత్తం చేసేసాం. నిమిష ప్రియ విషయంలో అనేక దఫాలుగా చర్చలు జరిగినప్పటికీ ముందడుగు పడలేదు. అక్కడ షరియా చట్టాలు అమలవుతుంటాయని" కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. అయితే అలా చెప్పిన ఒక్కరోజులోనే కేంద్ర విదేశాంగ శాఖ యెమెన్ ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరపడం వల్ల నిమిషప్రియ ఉరిశిక్ష వాయిదా పడింది.. అయితే ఈ ఉరిశిక్ష వాయిదా పడుతుందా.. లేకుంటే పూర్తిగా రద్దు అవుతుందా అనేది మరికొద్ది రోజుల్లో తేలుతుంది.

# పొలిటికల్ జంక్షన్‌లో కవిత...

హైదరాబాద్, జూలై 16,



పార్టీనే తనదంటున్నారు.. అధినేతను ఒక్క మాట అనడానికి కూడా ఇష్టపడట్లేదు. అపోజిషన్ గులాబీబాస్‌ను విమర్శిస్తే కూడా ఆమె సహించట్లేదు. కానీ అన్నతో పేచీ..కేసీఆర్ చుట్టూ దయ్యాలంటూ కుంపటి రాజేసి..పొలిటికల్ జంక్షన్‌లో నిల్చున్నారు ఎమ్మెల్సీ కవిత. కేసీఆర్‌కు కాళేశ్వరం నోటీసులు ఇచ్చినా..చివరకు కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చినా..ఆమె రియాక్ట్ అయ్యారు. కేసీఆర్‌ను విచారణకు పిలవడాన్ని నిరసిస్తూ ఏకంగా ఇందిరాపార్క్ దగ్గర నిరసన కూడా తెలిపారు.ఆ ధర్నాలో ఒక్క బీఆర్ఎస్ నేత కూడా పాల్గొనలేదు..అది వేరే సంగతి. సరే అదంతా అలా ఉన్నా..లేటెస్ట్‌గా బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో మొదలైన వివాదం? కవితపై ఆయన చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం లేచాయి. సోషల్ మీడియాలో అన్నివర్గాలు మల్లన్న వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ కూడా మల్లన్న మాటలను తప్పుబట్టారు. అయితే సొంత పార్టీ నుంచి మాత్రం కవితకు మద్దతు లభించలేదు.ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జగదీశ్వర్ రెడ్డి మినహా కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులే కాదు పార్టీ ముఖ్యనేతలెవరూ మల్లన్న వ్యాఖ్యలపై కనీసం స్పందించలేదు. ఇదే ఎమ్మెల్సీ కవితను మరింత అసంతృప్తికి గురిచేస్తోందట. తనకు పార్టీ అండగా లేకపోవడం..కనీసం మాట వరుసకు అయినా ఖండిస్తూ ఓ ప్రకటనో, ట్వీటో చేయకపోవడం కవితను కలచివేస్తోందట. అందుకే ఇక కారులో ఉండే పరిస్థితి లేదనే నిర్ణయానికి కవిత వచ్చేశారన్న టాక్ విన్పిస్తోంది.. .బీసీ రిజర్వేషన్ల విషయంలో రేవంత్ సర్కార్ చర్యలను అపోజిషన్ బీఆర్ఎస్ తప్పుబడుతోంది. ఆర్డినెన్స్ తెచ్చి హడావుడి చేసే ప్రయత్నం తప్ప చిత్తశుద్ధి లేదని విమర్శిస్తోంది. ఇదే సమయంలో జాగృతి తరపున కవిత సంబరాలు చేయడం బీఆర్ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఎమ్మెల్సీగా ఉంటూ పార్టీ లైన్‌కు విరుద్ధంగా కవిత వెళ్తున్నారన్న సంకేతాలు మంచివి కావని పలువురు కీలక నేతలు అభిప్రాయపడుతున్నారు. సేమ్‌టైమ్ ఆమె కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారని గతంలోనే వార్తలు వచ్చాయి. లేటెస్ట్‌గా తీన్మార్ మల్లన్న కూడా అదే విషయాన్ని చెప్పారు. మొన్నటి క్యాబినెట్ విస్తరణలోనే కవిత మంత్రి కావాల్సి ఉండే అని ఓపెన్ స్టేట్‌మెంట్ ఇచ్చి చర్చకు దారితీశారు. ఈ డెవలప్‌మెంట్స్ నేపథ్యంలో కవితను బీఆర్ఎస్ అధినాయకత్వం చాలా లైట్ తీసుకుంటుందట. సోమవారం డే మొత్తం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సుదీర్ఘంగా భేటీ అయి..బీసీ రిజర్వేషన్లు, కాళేశ్వరం, బనకచర్ల, లోకల్ బాడీ పోల్స్, పార్టీ ఫ్యూచర్ ప్లాన్స్‌పై డిస్కస్ చేశారట. కానీ కవితపై మల్లన్న చేసిన వ్యాఖ్యలు గురించి గానీ..కవిత సంబరాల అంశానికి సంబంధించి గానీ ఒక్కమాట కూడా కేసీఆర్ ప్రస్తావించలేదని తెలుస్తోంది. కనీసం ఆమె పేరును కూడా కేసీఆర్ ప్రస్తావించలేదని..దీంతో కేటీఆర్, హరీశ్‌లు కూడా ఆ విషయాన్ని మాట్లాడలేదని బీఆర్ఎస్ ఇన్ సైడ్ టాక్. ఇక కాళేశ్వరం విచారణకు వెళ్లేప్పుడు కేసీఆర్‌ను కలిసేందుకు కవిత వెళ్లగా అప్పుడు కూడా ఆయన కనీసం మాట్లాడడానికి ఇష్టపడలేదన్న లీకులు వచ్చాయి. అనారోగ్యంతో హాస్పిటల్‌లో ట్రీట్‌మెంట్ పొందుతున్న తండ్రిని పరామర్శించేందుకు వెళ్తే అక్కడ కూడా కవితను కేసీఆర్ పట్టించుకోలేదట. ఈ పరిస్థితులన్నీ గమనించిన కవిత..ఇక తాను బీఆర్ఎస్‌లో ఉండలేనని సన్నిహితులతో చెప్తున్నారట. పార్టీలో ఉండడమా.. బయటకు రావడమా? అనే విషయంపై అత్యంత క్లోజ్‌గా ఉండేవాళ్లతో డిస్కస్ చేస్తున్నారట కవిత. బీఆర్ఎస్‌ను వీడితే కొత్త పార్టీ పెట్టాలా లేక మరేదైనా పార్టీలో చేరాలా.? జాగృతి తరపునే తన యాక్టివిటీని నడిపించి..కేసీఆర్ పిలిచి మాట్లాడినప్పుడే వెళ్లాలా అనే దానిపై కవిత మల్లగుల్లాలు పడుతున్నారట.

ఇక మొదటినుంచీ కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఉన్న ఓ వర్గం తనకు పూర్తి అండగా ఉంటుందని భావిస్తున్నారట కవిత. ఈ క్రమంలో బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చే విషయంపై ఇప్పుడే నిర్ణయం తీసుకుంటే బెటర్ అనే ఆలోచనకు కవిత వచ్చారని అంటున్నారు. స్థానిక ఎన్నికలకు ముందే కవిత కీలక నిర్ణయం ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. అయితే గతంలోనూ కవిత బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పడం ఖాయమన్న చర్చ జరిగింది. ఇప్పుడు తాజా పరిస్థితులతో మరోసారి ఆమె కారు దిగడం పక్కా అన్న టాక్ వినిపిస్తోంది. రాజకీయంగా కవిత అడుగులు ఎటువైపు పడుతాయో చూడాలి మరి.

# కృష్ణా-వికారాబాద్ మార్గం రైల్వే లైన్ సర్వే పూర్తి

హైదరాబాద్, జూలై 16,

తెలంగాణ ప్రజలకు తీపి కబురు. రాష్ట్రంలో మరో కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి రానుంది. కృష్ణా-వికారాబాద్ కొత్త రైల్వే లైన్ తుది సర్వే పూర్తయింది. సుమారు 122 కిలోమీటర్ల ఈ మార్గం, రూ. 2,000 కోట్ల అంచనా వ్యయంతో ఈ లైన్ నిర్మించనున్నారు. దీనికి సంబంధించిన ఆఖఖీ ఈ నెలాఖరుకు రైల్వేబోర్డుకు చేరనుంది. కృష్ణా-వికారాబాద్ మార్గం పూర్తయితే హైదరాబాద్-గోవా మధ్య దూరం 35-40 కి.మీ. తగ్గుతుంది.తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి కేంద్రం చర్యలు చేపట్టింది. ఇప్పటికే అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వే స్టేషన్లు ఆధునీకరించి అందుబాటులోకి తీసుకొచ్చింది. మరికొన్ని స్టేషన్లు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. అదే సమయంలో రైల్వే కనెక్టివిటీ పెంచేందుకు కొత్త మార్గాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా.. రాష్ట్రంలో మరో కొత్త రైల్వే లైన్ అందుబాటులో రానుంది. నారాయణపేట జిల్లా కృష్ణా రైల్వేస్టేషన్ నుంచి వికారాబాద్ వరకు ప్రతిపాదిత కొత్త రైలు మార్గానికి సంబంధించిన తుది సర్వే (ఫైనల్ లొకేషన్ సర్వే) విజయవంతంగా పూర్తయ్యింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ నెలాఖరుకల్లా డీపీఆర్ రైల్వేబోర్డుకు చేరే అవకాశం ఉందని రైల్వే వర్గాలు తెలిపాయి. ఈ మార్గం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ మీదుగా వెళ్లనుండటం గమనార్హం. కృష్ణా-వికారాబాద్ నూతన రైల్వే లైన్ కోసం చాలాకాలంగా డిమాండ్ ఉంది. రైల్వే కనెక్టివిటీలో వెనుకబడిన వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లోని పలు ప్రాంతాలకు ఈ ప్రాజెక్టు ఎంతో కీలకమని ప్రజలు ఆశిస్తున్నారు. గత ఏడాది జనవరి 31న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ రైల్వే లైన్ విషయమై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాశారు. ఈ రైల్వే లైను నిర్మాణ వ్యయాన్ని 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరించాలని ఆయన లేఖలో కోరారు. తుది సర్వేలో భాగంగా ఆర్థిక, సాంకేతిక, పర్యావరణ, భూసంబంధిత అంశాలపై సమగ్ర విశ్లేషణ జరిగింది. కృష్ణా-వికారాబాద్ లైనులో రేట్ ఆఫ్ రిటర్న్ ఐదారు శాతం వరకు వస్తుందని రైల్వే అధికారులు అంచనా వేసినట్లు సమాచారం. సాధారణంగా 10 శాతం ఖీూఖీ ఉంటే రైల్వేశాఖ సులభంగా ఆమోదిస్తుంది. అయితే, ప్రాథమిక సర్వేలోని అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు చేసినట్లు తెలుస్తోంది. కొడంగల్ నియోజకవర్గ కేంద్రానికి కొంత దూరంగా ఉన్న ప్రాథమిక అలైన్‌మెంట్‌ను, స్టేషన్‌ను అక్కడి ప్రజలకు చేరువలో ఉండేలా మార్చారు. ప్రతిపాదిత రైల్వేలైన్‌ను కృష్ణా-మక్తల్-నారాయణపేట- దామరగిద్ద-బాలంపేట -దౌల్తాబాద్- కొడంగల్-పరిగి-వికారాబాద్ వరకు నిర్మించనున్నారు. మె?త్తం 122 కిలోమీటర్లు కాగా.. అంచనా వ్యయం సుమారు రూ. 2 వేల కోట్లు. ఈ ప్రతిపాదిత రైలు మార్గం కార్యరూపం దాల్చి, నిర్మాణం పూర్తయితే అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి గోవాలోని మడ్‌గావ్ రైల్వేస్టేషన్‌కు జడ్చర్ల, గద్వాల, కర్నూలు, డోన్, గుంతకల్ మీదుగా ట్రైన్లు వెళ్తున్నాయి. కృష్ణా-వికారాబాద్ మార్గం అందుబాటులోకి వస్తే హుబ్బళ్లి, గోవాలోని మడ్‌గావ్‌కు 35-40 కిలోమీటర్ల దూరం తగ్గే అవకాశం ఉంది. దీని ద్వారా తక్కువ సమయంలోనే హైదరాబాద్ నుంచి గోవాకు చేరుకోవచ్చు. అంతేకాకుండా, తాండూరు సిమెంటు పరిశ్రమల నుంచి సిమెంటు రవాణా సులభం అవుతుంది. ప్రస్తుతం గుంతకల్ మార్గంలో ట్రాక్ రద్దీగా ఉండటంతో అదనపు రైళ్లను ప్రవేశపెట్టడం కష్టంగా మారింది. ఈ ప్రతిపాదిత మార్గంతో ఆ సమస్య ఉండదు. ఇది ప్రాంతీయ అభివృద్ధికి, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు రైల్వే బోర్డు ఆమోదం పొంది, త్వరితగతిన కార్యరూపం దాల్చాలని స్థానికులు, వ్యాపార వర్గాలు ఆశిస్తున్నాయి

# పొంచి ఉన్న నీటి ముప్పు

## ఇంకుడు గుంటలు తప్పనిసరి

హైదరాబాద్, జూలై 16

హైదరాబాద్ నగరవాసులకు జలమండలి హెచ్చరిక జారీ చేసింది. 300 గజాల పైన స్థలం ఉన్న ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలని, లేనిచో ట్యాంకర్ల ధరలు పెంచుతామని తెలిపింది. నగరంలో నీటి ట్యాంకర్ల వినియోగం విపరీతంగా పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. భూగర్భ జలాలను పెంచేందుకు.. నీటి కొరతను అధిగమించేందుకు ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ట్యాంకర్ల బుకింగ్‌లు 36 శాతం పెరిగాయి. హైదరాబాద్‌లో నివసించే వారికి.. ముఖ్యంగా నీటి ట్యాంకర్లను బుక్ చేసుకుంటున్న ఇళ్ల యజమానులకు వాటర్ బోర్డు ఒక ముఖ్యమైన హెచ్చరిక జారీ చేసింది. నగరంలో సరిపడా వర్షాలు కురవకపోవడం వల్ల అనేక ప్రాంతాల్లో భూగర్భ జలాలు గణనీయంగా అడుగంటిపోయాయి. ఈ పరిస్థితితో నగరం అంతటా నీటి ట్యాంకర్ల బుకింగ్‌లు విపరీతంగా పెరిగాయి. ఇది వాటర్ బోర్డుకు ఆందోళన కలిగిస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 300 గజాలు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని జలమండలి స్పష్టం చేసింది. ఈ నిబంధనను పాటించని వారికి.. అంటే ఇంకుడు గుంత లేకుండా నీటి ట్యాంకర్లను బుక్ చేసుకున్న వారికి, ట్యాంకర్ల ధరలను పెంచుతామని వాటర్ బోర్డు హెచ్చరికలు జారీ చేసింది. వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల క్షీణత నేపథ్యంలో.. భవిష్యత్తులో భూగర్భ జల మట్టాలను పెంచే లక్ష్యంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు జలమండలి అధికారులు తెలిపారు. ఈ చర్య ప్రస్తుత నీటి కొరతను అధిగమించడమే కాకుండా.. దీర్ఘకాలికంగా నగరానికి నీటి భద్రతను కల్పించే ఒక వ్యూహాత్మక చర్యగా తెలుస్తోంది. గత ఏడాది జూలై నెలతో పోలిస్తే.. ప్రస్తుత జూలైలో హైదరాబాద్‌లో ట్యాంకర్ల బుకింగ్‌లు 36 శాతం పెరిగాయి. గత సంవత్సరం జూలై 1 నుండి 14వ తేదీ వరకు 63,724 ట్యాంకర్లు బుక్ కాగా.. ఈ ఏడాది అదే కాలంలో 86,520 ట్యాంకర్లు బుక్ అయ్యాయి. అంటే.. దాదాపు 22,796 ట్యాంకర్ల బుకింగ్‌లు అదనంగా జరిగాయి. ఇది సుమారు 36 శాతం పెరుగుదల. ప్రస్తుతం జలమండలి పరిధిలో దాదాపు 1,135 నీటి ట్యాంకర్లు సేవలు అందిస్తున్నాయి. ఇంకుడు గుంతల ఏర్పాటు తప్పనిసరి కావడం, లేనిపక్షంలో ధరలు పెరగడం వంటి చర్యలు ప్రజల్లో ఇంకుడు గుంతల ఏర్పాటుపై అవగాహన పెంచి, ఆచరణలో పెట్టేందుకు దోహదపడతాయని అధికారులు ఆశిస్తున్నారు. ఇంకుడు గుంతలు వర్షపు నీటిని భూమిలోకి ఇంకింపజేసి, భూగర్భ జల మట్టాలను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పట్టణ ప్రాంతాల్లో కాంక్రీట్ నిర్మాణాలు పెరిగి, సహజంగా నీరు భూమిలోకి ఇంకే అవకాశం తగ్గింది. దీనివల్ల వర్షపు నీరు వృథాగా ప్రవహించి మురుగునీరుగా మారుతోంది. ఇంకుడు గుంతలు ఈ నీటిని సేకరించి, భూమిలోకి పంపి, భవిష్యత్ అవసరాల కోసం



జలవనరులను పునరుజ్జీవింపజేస్తాయి. ఈ చర్యలు కేవలం వ్యక్తిగత ఇంటికే కాకుండా, మొత్తం నగరానికి దీర్ఘకాలికంగా నీటి భద్రతను అందిస్తాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నీటి సంరక్షణ పట్ల ప్రజల్లో బాధ్యతను పెంపొందించడమే కాకుండా.. పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుంది. వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు

# ప్రఖ్యాత కవి చౌడూరి కి"కవితా కళా ప్రపూర్ణ" బిరుదుతో శ్రీగురు పురస్కారం

గుంటూరు, భారత శక్తి ప్రతినిధి, జూలై 16:పల్నాడు జిల్లా నరసరావుపేట కాసు కళ్యాణ మంటపంలో మంగళవారం నాడు జరిగిన అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం ఆంధ్రప్రదేశ్ శాఖ విద్వత్ సభలలో శ్రీ చౌడూరి నరసింహా రావుకు అందిన ప్రతిష్టాత్మకమైన శ్రీ గురు పురస్కారం.అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నాడు నరసరావుపేట కాసు కళ్యాణమంటపంలో జరిగిన జాతీయ స్థాయి విద్వత్ సభలలో అతిథుల చేతుల మీదుగా హైదరాబాద్ (నాగోల్) కు చెందిన ప్రఖ్యాత కవి, పత్రికా రచయిత, బహు గ్రంథకర్త, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ప్రవచన కర్త, "సాహిత్య కళా విభూషణ" "స్వర్ణ నంది పురస్కార గ్రహీత" శ్రీ చౌడూరి నరసింహా రావు "కవితా కళా ప్రపూర్ణ" బిరుదుతో శ్రీ గురు పురస్కారం అందుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏబిబిఎం ఏపీ అధ్యక్షుడు డాక్టర్ ఇంద్రగంటి ప్రసాద శర్మ సిద్ధాంతి, కార్యదర్శి డాక్టర్ దేవెల్ల వసంత సాయినాథ్ శర్మ, ఎబిబిఎం ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ భారత (అ)పూర్వ రాష్ట్ర పతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పండితుని మనవడు, అంతర్జాతీయ ప్రముఖ వ్యాపారవేత్త అయిన డాక్టర్ గౌరవరం సుబ్రహ్మణ్య శర్మ, రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీ గురు పురస్కారాల గౌరవాధ్యక్షుడు, ప్రముఖ సంస్కృత పండితుడు శ్రీ పిటి జివి రంగాచార్యులు తదితర ప్రముఖులు శ్రీ చౌడూరి నరసింహారావును కవితా కళా ప్రపూర్ణ బిరుదుతో శ్రీ గురు పురస్కారాన్ని అందించి, జ్ఞాపిక, యోగ్యతా పత్రం, శాలువాతో సభా సదుల కరతాళ ధ్వనుల మధ్యన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పురస్కారాల పరిశీలకులు శ్రీ పి టి జి వి రంగాచార్యులు మాట్లాడుతూ శ్రీ చౌడూరి నరసింహారావు గత 40 ఏళ్లుగా తెలుగు కవిత్వానికి భాషా సాహిత్యాలకు ఎనలేని సేవలందిస్తూ.. మరోవైపు సంస్కృత భాషకు కూడా గణనీయంగా సేవలు అందిస్తున్నారు. వీరు అమృత వర్షిణి (కవితా సంపుటి), ఆణిముత్యాలు, నవకవి రత్నాలు, స్ఫూర్తి కిరణాలు తదితర గ్రంథాలను వెలయించారు. ప్రతి రోజూ కవిత్వార్చనతో తెలుగు కవిత్వానికి సేవలందిస్తున్నారు. ఇప్పటికే ఎన్నో సంస్థలు వీరి సాహిత్య సేవలను గుర్తించి, ఎన్నో పురస్కారాలు ఇచ్చి గౌరవించాయి. వాటన్నిటినీ పరిశీలించిన మా కమిటీ చౌడూరి ని ఈ పురస్కారంతో సత్కరిస్తున్నామని తెలిపారు.ఎంతో ప్రతిష్టాత్మకమైన శ్రీ గురు పురస్కారాన్ని అందుకున్న చౌడూరి స్పందిస్తూ.. ఈ గురు పురస్కారంతో తనను సత్కరించిన ఎబిబిఎం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులకు, పురస్కారాల పరిశీలకుడు శ్రీ రంగాచార్యులకు ముందుగా కృతజ్ఞతలు తెలుపుతూ... శ్రీ గురు



పురస్కారం అందుకున్న ఈరోజుననే నా 66వ పుట్టినరోజు రా(కా)వడం, పైగా ప్రఖ్యాత సంస్కృతాంధ్ర పండితుల చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకోవడం నిజంగా పూర్వజన్మ సుకృతంగా, ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను అని ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఈ అవార్డు తనకు ఇంకా బాధ్యతను పెంచిందని, బ్రాహ్మణ జాతి పూర్వవైభవానికి నా వంతు కర్తవ్యాన్ని నిర్వహించగలనని తన మనోభావనను వ్యక్తపరిచారు. తమ అధ్యక్షుడికి ఇంతటి ఉన్నత గౌరవం లభించడం పట్ల చౌడూరి కళా పీఠం సభ్యులు స్థానిక సాహితీ వేత్తలు, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు స్నేహితులు తమ హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు.

## మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వన్ కలిసిన మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 16: కామారెడ్డి జిల్లా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.వాలియా కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఆశిష్ సంగ్వన్ కు బుధవారం రోజున మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. గతంలో డాక్టర్ బి వాలియా సికింద్రాబాద్ గాంధీ హాస్పిటల్ లో ప్రొఫెసర్ ఆర్థోపెడిక్ గా పనిచేసి ప్రమోషన్ పై కామారెడ్డి జిల్లా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ గా బాధ్యతలు చేపట్టారు.

## దివ్యాంగుల సహాయ వస్తువుల కొరకు ఆన్లైన్ అప్లికేషన్ యొక్క ధృవ పత్రాలను వెరిఫికేషన్ చేసిన అడిషనల్ కలెక్టర్ వి.విక్టర్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 17: సంచాలకులు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు బుధవారం వివిధ సహాయ ఉపకరణాల (స్కూటీ,బ్యాటరీ ట్రై సైకిల్,బ్యాటరీ ఆటో ,లాప్ టాప్,5జి స్మార్ట్ ఫోన్ ) కొరకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుల లకు వారి యొక్క ధ్రువ పత్రాలను అడిషనల్ కలెక్టర్ వి.విక్టర్ అధ్యక్షతన వెరిఫికేషన్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఆర్ టి ఒ శ్రీనివాస్, వైద్య శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.

## లిమెప్మా ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రతి పాదనలు సిద్ధం చేయాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ.



వేములవాడ,జూలై 16 ( భారత శక్తి) : మెప్మా ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. వేములవాడ అర్బన్ మండలం పరిధిలోని మారుపాక వద్ద సర్వే నంబర్ 339 లో ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలం హద్దులు సిద్ధం చేయాలని, మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులు పెట్రోల్ బంక్ నిర్మాణ ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి కింద మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ పర్యటనలో వేములవాడ మున్సిపల్ కమిషనర్ జి.అన్వేష్,డీటీసీపీఓ అన్సార్, పంచాయతీ రాజ్,ఇరిగేషన్ అధికారులు,డిపిఓ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలతో ముఖ్యమంత్రి స్థాయిని దిగజారుస్తుండు: బిఆర్ఎస్ నాయకులు కొప్పుల సైదిరెడ్డి



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై16: తుంగతుర్తి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమ నేత రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి గురించి మాట్లాడిన మాటలు ఆయనలో పెరిగిపోతున్న అసహనానికి అభద్రత భావానికి నిదర్శనమని మాజీ జెడ్పిటిసి కొప్పుల సైదిరెడ్డి అన్నారు. హుజూర్ నగర్ మండలంలోని అమరవరం లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన బిఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో సీమాంధ్ర నాయకుల పంచన చేరి విద్యార్థి ఉద్యమకారులపై తుపాకీ ఎక్కు పెట్టిన రేవంత్ రెడ్డి కెసిఆర్ త్యాగంతో వచ్చిన తెలంగాణలో అనుకోకుండా నడ మంత్రంగా వచ్చిన ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి పదవిలో కూర్చుని కులుకుతున్నాడని ఎద్దేవా చేశారు. 2014 కంటే ముందు తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం ఉత్పత్తి 68 లక్షల టన్నులు ఉంటే 2014 తర్వాత అది 272 లక్షల టన్నులకు చేరిందంటే అది కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్లనే సాధ్యమైంది అన్న విషయం కళ్ళుండి చూడలేనటువంటి కాంగ్రెస్ పెద్దలకు కనబడటం లేదన్నారు. సాగునీరుకి, తాగునీరుకి ఎన్నో కష్టాలు పడిన తుంగతుర్తి నియోజకవర్గం సూర్యాపేట నియోజకవర్గం కోదాడ నియోజకవర్గం లోని కొన్ని మండలాలకు గోదావరి నీళ్లు తీసుకువచ్చి ఇక్కడ భూములను సస్యశ్యామలం చేయడమే కాక ఉమ్మడి నల్లగొండ జిల్లాను ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రంలోనే అగ్ర భాగాన నిలిపిన ఘనత తెలంగాణ ఉద్యమ శిఖరం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డికి దక్కుతుందన్నారు. సూర్యాపేటను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడమే కాక మెడికల్ కళాశాలను, కలెక్టర్ కార్యాలయాన్ని, ఎస్పీ ఆఫీసును సూర్యాపేట పట్టణాన్ని ఊహించని విధంగా అభివృద్ధి చేసింది జగదీశ్ రెడ్డి అన్నారు.

కళ్ళ ముందు కనబడుతున్న వాస్తవాలను ఒప్పుకోలేక కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను 420 హామీలను అమలు చేయలేక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్భం ఏదైనా ప్రతి బహిరంగ సభలో కెసిఆర్ కేటీఆర్ జగదీష్ రెడ్డి గురించి బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం గురించి ముఖ్యమంత్రి చేస్తున్న రోత మాటలు మకిలి చేష్టలతో ముఖ్యమంత్రి స్థాయిని దిగజార్చుతున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ నబీ, మాజీ సర్పంచ్ లు గుజ్జుల సుజాత అంజిరెడ్డి, పత్తిపాటి రమ్య, నాగరాజు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కామిశెట్టి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి పుప్పెల చిన్న లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 100 రోజుల ప్రణాళిక స్వచ్ఛత కాంపిటీషన్ పోటీలు

### విద్యార్థులకు బహుమతులందజేత

సూర్యాపేట జిల్లా బ్యూరో(భారతశక్తి) జూలై 16:100 రోజుల ప్రణాళిక స్వచ్ఛత కాంపిటీషన్ లో భాగముగా హుజూర్ నగర్ పురపాలక సంఘ కార్యాలయ ఉద్యోగులు అందరికీ ఆటల పోటీలు క్రికెట్, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించుట జరిగినది. గ్రీన్ వుడ్ పాఠశాల మరియు ఎన్ఎస్పి క్యాంపు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు పర్యావరణం పరిశుభ్రత పై డ్రాయింగ్ కాంపిటీషన్స్ నిర్వహించి మొదటి బహుమతి షేక్ సఫియా తనీమ్, 8 వ తరగతి, సిహెచ్ శ్రీకాంత్ 10 వ తరగతి మరియు 2 వ బహుమతి డి నేహ శ్రీ, 6 వ తరగతి, వివేక్ 9 వ తరగతి వారికి బహుమతులు అందించడం జరిగినది. ఇట్టి కార్యక్రమములో పురపాలక సంఘ




కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి , పీఈటి లు గ్రీన్ వుడ్, ఎన్ ఎస్ పి క్యాంపు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పురపాలక సంఘ అన్ని విభాగాధిపతులు కార్యాలయ సిబ్బంది, మెప్మా ఆర్ పి లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులుకు ఇసుక %ఓ% మొరం అనుమతించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 16: ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి లబ్ధిదారులకు ఇసుక అవసరం పడినప్పుడు పంచాయతీ సెక్రెటరీ కీ దరఖాస్తు సమర్పించిన లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వన్ సబ్ కలెక్టర్, ఆర్డీఓ లు, తాసిల్దార్ లు, ఎంపీడీవో లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. ఈ టెలికాన్ఫరెన్స్ లో ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ఇసుక రవాణా గురించి ఎంపీడీవోలకు, పంచాయతీ సెక్రెటరీలకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా ఇవ్వబడుతుంది. రవాణా ఏర్పాటు లబ్ధిదారులే చేసుకోవాలి అని అన్నారు. అంతేకాక ఇసుక లభ్యత లేనట్లయితే పక్క మండల నుంచి ఇసుకను పొందవచ్చు అని పేర్కొన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్లకు మొరం అవసరమైన వారు పంచాయతీ కార్యదర్శి సిఫారసుతో ట్రాక్టర్కు 300 చొప్పున టిప్పర్ కు 1200 చొప్పున డిడి రూపంలో చెల్లించి మొరం అనుమతి పొందవచ్చు అని అన్నారు.తదుపరి అసిస్టెంట్ డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ వారిని స్థానిక అవసరాల నిమిత్తం ఇసుక కొరకు 5 ప్రదేశాలలో కిష్టాపూర్, హాసుగుల్, కుర్ల,ఖతగావ్, శెట్లూర్ లకు పర్యావరణ అనుమతులకు తగు చర్యలకు వేగవంతం చేయాలని ఆదేశించారు.ఇట్టి ఇసుక రవాణాపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని ఆర్డీవోలు, ఏడి మైన్స్ కు ఆదేశాలుఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, సబ్ కలెక్టర్ బాన్స్ వాడ కిరణ్మయి, పి.డి హౌసింగ్ విజయ పాల్ రెడ్డి,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి అఫ్ తెలంగాణ అనే అప్లికేషన్ కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



(భారత శక్తి ప్రతినిధి) కామారెడ్డి, జులై 16: ప్రభుత్వ శాఖలు ప్రైవేట్ సంస్థలు, విద్య సంస్థల సమన్వయంతో ఉద్యోగార్థులకు, ఉద్యోగదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రిచే ప్రారంభింపబడిన డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి అఫ్ తెలంగాణ (డిఇఇటి). డిఇఇటి అనే అప్లికేషన్ కు సంబంధించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ చేత ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం అనగా 16/07/2025 నాడు కలెక్టర్ చేత కార్యక్రమం విజయవంతంగా జరిగింది. డిఇఇటి అనే అప్లికేషన్ కు సంబంధించిన పూర్తి వివరాలు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆఫీస్ లోని జిల్లా పరిశ్రమల కేంద్రం, రూమ్ నెంబర్ 122 నందు సంప్రదించగలరు.

## ఉప్పల్ ఫ్లైఓవర్ పై ప్రత్యేక శ్రద్ధ,

ఉప్పల్ ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి నారపల్లి వరకు 8 కిలోమీటర్ల మేరకు నిర్మిస్తున్న ఫ్లైఓవర్ పేనులు శరవేగంగా జరుగుతున్నాయని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

బుధవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తో కలిసి ఫ్లైఓవర్ పనులను పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యాదగిరిగుట్ట భువనగిరి వరంగల్ హైవేపై దాదాపు 8 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఫ్లైఓవర్ పనులు ఆర్థిక వనరులు, ఇతర కారణాల వల్ల తీవ్ర జాప్యం జరిగిందన్నారు. తమ ప్రభుత్వం రాగానే ఫ్లైఓవర్ పై ప్రత్యేక దృష్టి సారించి కేంద్ర మంత్రి నితిన్ ఘట్కారితో సైతం చర్చలు జరిపి పనుల్లో వేగం పెంచామన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి మొన్నటి వరకు పనులు నిర్వహించిన కాంట్రాక్టర్ను సైతం మార్చి కొత్తవారికి పనులు అప్పగించామని.. ప్రత్యేక శ్రద్ధతో పనుల్లో వేగాన్ని పెంచి పరితగతిన పూర్తి చేస్తామన్నారు. నగరంలో పివి ఎక్స్ప్రెస్ హైవే తర్వాత అతిపెద్ద ఫ్లైఓవర్ గా పేరున్న ఉప్పల్ ఫ్లైఓవర్ అన్నారు. వచ్చే దసరా నాటికి ఫ్లైఓవర్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు.

==================================

## హత్యకేసులో ఆరుగురు అరెస్టు

భూపాలపల్లి జూలై 16

జయశంకర్ భూపాలపల్లి జిల్లా:రేగొండ పాండవుల గుట్ట వద్ద ఈనెల 10వ తేదీన జరిగిన భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామానికి చెందిన రవి హత్య కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు మీడియా సమావేశంలో తెలిపారు.

గత కొంతకాలంగా రెండో భార్య రేణుకకు అక్రమ సంబంధం ఉన్నదని అనుమానంతో శారీరకంగా,మానసికంగా రవి హింపించడం చేస్తున్నాడని పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగినప్పటికీ రవి ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో రెండో భార్య కుమారుడు శ్రీకర్,తన తల్లి రేణుక, కేటీపీపీ సెక్యూరిటీ గార్డ్ శ్రీ పాల్ తో కలిసి రవిని హత్య చేయాలని పథకం పన్నారని,మరో ముగ్గురు తో కలిసి రవిని హత్య చేశారని డిఎస్పి తెలిపారు.నిందితుల వద్ద నుంచి 5 వేల నగదు,ఒక కారు,ఆరు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు డిఎస్పి సంపత్ రావు.

# వడ్డీ వ్యాపారి ఇంటిముందు రైతుల అందోళన

మంచిర్యాల జూలై 16

మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో వడ్డీ వ్యాపారి ఇంటి ఎదుట రైతులు చేసిన ధర్నా చర్చనీయాంశం అవుతోంది . మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పట్టణంకు చెందిన అకినపల్లి శ్రీధర్ అనే వ్యక్తి లక్షెట్టిపేట పట్టణం లోని ఒక రైస్ మిల్ లీజ్ కు తీసుకోని గత 15 సంవత్సరాలనుండి రైతుల వద్ద వడ్లు కొనుగోలు చేస్తున్నాడు. ఈ క్రమంలో రైతులకు దగ్గర ఉంటూ వారి వద్ద కొనుగోలు చేసిన ధాన్యం కు కొంతమంది రైతులకు డబ్బులు చెల్లెస్తూ మరి కొంతమంది రైతులకు చెల్లించకుండ ప్రతి సంవత్సరం ప్రామిసరి నోట్ వ్రాసి ఇస్తున్నాడు.

ఇలా సుమారు 100 మంది రైతులకు 3 నుండి 4 కోట్ల రూపాయల వరకు డబ్బులు బాకీ పడ్డాడు. వీరితో పాటు స్థానిక వడ్డీ వ్యాపారుల నుండి మరో 5 కోట్ల రూపాయలు అప్పు చేసాడు.

ఈ అప్పులు బాధ నుండి తప్పించుకోవడానికి నిందితుడు శ్రీధర్ హైదరాబాద్ కు పారిపోయి ఐపీ పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాడు. స్థానిక నాయకుల ఒత్తిడితో రైతులకు తన ఆస్తి అమ్మి డబ్బు చెల్లించేలా ఒప్పందం జరిగింది.. ఇదిలా ఉంటే మల్యాల విశ్వనాధం అనే వడ్డీ వ్యాపారి, అకేనపల్లి శ్రీధర్ కు కొంత మొత్తం అప్పుగా ఇచ్చాడు.. తనకు డబ్బు ఇవ్వకుండా శ్రీధర్ రైతులకు డబ్బులు ఇవ్వడం ఇష్టంలేక సదరు వ్యాపారి విశ్వనాధం, శ్రీధర్ తన అగ్రికల్చర్ ల్యాండ్ అమ్మకుండా కోర్ట్ నుండి స్టే ఆర్డర్ తీసుకోని వచ్చాడు.

ఈ విషయం తెలిసిన దండేపల్లి కి చెందిన సుమారు 50 మంది రైతులు ఈ రోజు ఉదయం విశ్వనాధం ఇంటి ఎదురుగా బైటాయించి ఆందోళన చేపట్టి నిరసన తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వడ్డీ వ్యాపారిని దండేపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు..రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచనలు చేస్తున్నట్టు సమాచారం

==============================

# చిలుకోడులో దొంగల హల్ చల్

డోర్నకల్ జూలై 16

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో వరస దొంగతనాలతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రోజు అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తుల ఇళ్లల్లో దొంగతనం జరిగినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటన పోలీస్ ల విచారణలో ఉండగానే మరో చోరీ గ్రామస్తులను బెంబేలెత్తిస్తుంది. గ్రామంలోని మంద గోపయ్య, ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డరు దుండగులు బీరువాను పగలగొట్టి ఆరు తులల బంగారం, పది తులాల వెండి.50, వేల రూపాయల నగదు అపహరణకు గురైనట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలో మూడు దొంగతనాలు జరగడంతో చిలుకోడు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామం లో సీసీ కెమెరాలు తో పాటు పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తే దొంగతనాలను అరికట్టవచ్చని గ్రామస్తులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని క్లూస్ టీమ్ తో ఆధారాలు సేకరిస్తున్నారు.

==============================

# ఇసుక క్వారీ ముందు డ్రైవర్లు బైటాయించి ధర్నా

పెద్దపల్లి జూలై 16

ముత్తారం మండలం ఖమ్మంపల్లి లో తాడిచర్ల బ్లాక్ 2 ఇసుక క్వారీ వద్ద లారీ డ్రైవర్ల ధర్నా. ఇసుక క్వారీ ముందు లారీ డ్రైవర్లు బైటాయించి నిరసన.ఈసందర్భంగా డ్రైవర్లు మాట్లాడుతూ గత వారం రోజులుగా ఇసుక క్వారీ లో ఇసుక లోడింగ్ సరిగ్గా జరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మేము సిరియల్ లో ఉండగా కొంత మంది క్వారీ వారికి ఫోన్ చేసి లోడింగ్ డబ్బులు మాట్లాడుకొన్న వారి లారీలను క్వారీ ఇంచార్జీ వచ్చి సైడ్ నుండి తీసుకవేళ్లి లోడింగ్ చేసి పంపిస్తున్నారని ఆరోపించారు. తాము వారం రోజులుగా ఇల్లు, పిల్లలు వదిలి తిండి, మంచినీళ్లు లేక రాత్రి అడవిలో నిద్ర రాక నరకయాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు వెంటనే స్పందించి మాకు లోడింగ్ చేయించాలి డిమాండ్ చేశారు..

==============================

# నీళ్లకోసం విద్యార్థుల ధర్నా

సూర్యాపేట జూలై 16

సూర్యాపేట జిల్లా, హుజూర్ నగర్ నియోజకవర్గం పరిధిలోని మేళ్లచెరువు లో గురుకుల పాఠశాత వసతి గృహం విద్యార్థులు రోడ్డు మీద ఆకస్మిక ధర్నా చేపట్టారు. గత రెండు రోజులుగా గురుకుల పాఠశాల, కాలేజీలో నీళ్ళు రావడం లేదని ఆందోళన చేపట్టారు. దీనివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, టీచర్లు, అధికారులు సైతం ఏమీ చేయలేక చేతులు ఎత్తేశారని ఆరోపించారు. దీంతో.. కోదాడ-మేళ్లచెరువు రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సమాచారం అందుకుని రంగంలోకి దిగిన పోలీసులు విద్యార్థులకు సర్ది చెప్పి హైవేపై నుంచి వారిని పక్కకు తీసుకెళ్లారు. ట్రాఫిక్ జామ్ ను క్లియర్ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలకు త్వరలో గ్యాస్ కనెక్షన్లు

## మారుపాక ప్రభుత్వ స్కూళ్లలో ఆకస్మిక తనిఖీ.

## సైన్స్, సోషల్, మ్యాథ్స్ పాఠాలు బోధన.

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



వేములవాడ, జూలై 16 (భారత శక్తి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు త్వరలో గ్యాస్ కనెక్షన్లు అందుబాటులోకి రానున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు.వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలోని అంగన్వాడి , ప్రీప్రైమరీ,ప్రైమరీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి శుభ్రం చేయించాలని పంచాయత్ సెక్రటరీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు.బడి బాట కార్యక్రమం లో ఏమి చేశారని ప్రశ్నించారు.ప్రైమరీ స్కూల్లోని తరగతి గదిలో విద్యార్థుల బెంచీలు సరైన క్రమంలో ఏర్పాటు చేసి వారికి వీలైనంత సువిశాల గదిని కేటాయించాలని,రంగులు వేయించాలని సూచించారు.అలాగే ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డెస్క్ బెంచీలు లేకపోవడం గమనించి వెంటనే ఇతర పాఠశాలల్లో అధికంగా ఉన్న వాటిని ఇక్కడికి వెంటనే తెప్పించి, ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలకు సరైన ప్రహరీ ఉపాధి హామీ కింద నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యాలయంలోని 8,9,10 విద్యార్థులకు సైన్స్, సోషల్ మ్యాథ్స్ పాఠాలు బోధించారు. విద్యార్థులను ప్రశ్నలడిగి సమాధానాలు రాబట్టారు విద్యార్థులకు సరైన విధంగా విద్యాబోధన చేయవలసిందిగా ఉపాధ్యాయులకు ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలోని పిల్లల బరువును చెక్ చేశారు.పాఠశాల పరిసరాలు మొత్తం కలియతిరిగి పరిశుభ్రంగా లేకపోవడం గమనించి వెంటనే శుభ్రం చేయించాలని పేర్కొన్నారు.అంగన్వాడి భవనం వాటర్ లీకేజీ లేకుండా వెంటనే బాగు చేయించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని వంటగదిని ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.

# వాగ్దేవి హైస్కూల్ లో ఘనంగా బోనాల పండుగ వేడుకలు

## సాంప్రదాయాలను సంస్కృతిని ఎల్లవేళల కాపాడుకోవాలి: కరెస్పాండెన్స్ జాల జ్యోతి బాబు, ప్రిన్సిపాల్ గంగాధర్



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై16:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని వాగ్దేవి హై స్కూల్ నందు బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. మొదట అమ్మవారికి పాఠశాల యాజమాన్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఇట్టి కార్యక్రమంలో పిల్లలు వివిధవేషధారణలో పాల్గొని అలంకరించారు.తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక ఐన బోనాల సంబరాలు జరుపుకోవడం వల్ల పిల్లలలో భక్తి భావం పెరగడంతో పాటు మన సాంప్రదాయం సంస్కృతిని ఎల్లవేళల కాపాడుకోవాలని పాఠశాల కరెస్పాండెన్స్ జాల జ్యోతి బాబు, ప్రిన్సిపాల్ గంగాధర్ లు తెలియజేశారు. కార్యక్రమం లో టీచర్స్ నాగలక్ష్మి, మౌనిక, స్వతంత్ర, కళ్యాణి, ఉపేంద్ర, గృహ లక్ష్మీ, సునీత, పుష్ప, ఇంద్రజ తదితరులు,విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొనడం జరిగింది.

# కష్టజీవుల ఆర్థిక హక్కులను హరించి వేస్తున్న మోడీ ప్రభుత్వం.

## -కనీసవేతనం, విద్యా, వైద్యం, ఉపాధి ప్రాథమిక హక్కుల జాబితాలో చేర్చాలి.

## - ఆర్థిక కడగండ్లతోనే కార్మిక పోరాటాలు జరుగుతున్నాయి.


## -మున్సిపల్ సమ్మెకు మద్దతుగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్.







కడప, భారత శక్తి ప్రతినిధి, జూలై 16: బుధవారం నాటికి, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర వ్యాప్త సమ్మె 4వ రోజు చేరుకున్న సందర్భంగా కడప కార్పొరేషన్ కార్యాలయం ఎదుట, మున్సిపల్ కార్మికుల "నిరసన ఆందోళన"కు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్), సిపిఎం కడప జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ సందర్శించి, వారికి సంపూర్ణ మద్దతు తెలియజేసి మాట్లాడుతూ.. కార్మికులు, కష్టజీవుల ఆర్థిక హక్కులను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం హరించి వేస్తోందని ఆరోపించారు. కార్మికులు గత 100 సంవత్సరాలు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, పారిశ్రామిక ఆధిపతులకు, కార్పొరేట్లకు, క్రోనీ క్యాపిటలిస్టులకు, శారీరక శ్రమను, మేధో శ్రమను దోపిడీ విచ్చలవిడిగా చేసుకోవడానికి, పని గంటలు పెంచుకోవటానికి, జీతభత్యాలు తగ్గించడానికి, ఉద్యోగ భద్రత లేకుండా చేయడానికి, సంక్షేమ పథకాలు అమలు వర్తించకుండా చూడడానికి, కార్మిక చట్టాల సవరణల పేరిట నాలుగు కోడ్లు తెచ్చి "శ్రమ దోపిడీ పీడనను పెంచారని" విమర్శించారు.సమాన పనికి సమాన వేతనం, విద్యా, వైద్యం, ఉపాధి హక్కు, రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల జాబితాలో చేర్చాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, శ్రామిక ప్రజలందరూ ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. నూటికి 90 శాతం ప్రజల్లో కొనుగోలు శక్తి బాగా పడిపోయిందని, వారికి వస్తున్న స్వల్ప వేతనాలు వారి ఆర్థిక కడగండ్లను తీర్చలేకున్నాయని అందుచేతే కార్మిక పోరాటాలు జరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోయలేని పన్నుల భారాలు వివిధ రూపాలలో వేస్తున్నారని, ప్రజా ఉద్యమాలు భవిష్యత్తులో రాబోతున్నాయని వారు హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపికి వినిపించడం లేదని, వారి చెవులు పనిచేయడం లేదని, రాష్ట్రంలో టిడిపి సంకీర్ణ ప్రభుత్వానికి బుద్ధి లేదని బుద్ధి మందగించిందని ఎద్దేవ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు ఐ.ఎన్.సుబ్బమ్మ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సుంకర రవి, తిరుపాలు, శ్రీరామ్, కిరణ్, విజయ్, గోపి తదితర నాయకులు మాట్లాడుతూ.. జీవో నెంబర్ 36 అమలు చేస్తూ కనీస వేతనం 2400 రూపాయలు అమలు చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచి ప్రభుత్వ అధికారులకు ఇచ్చే అన్ని బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, వారికి కేడర్ ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులు, ఇంజనీరింగ్ కార్మికులు, కార్యాలయ సిబ్బంది కార్మికులు, ఈ నిరసన ఆందోళన కార్యక్రమంలో, సమ్మెలో పాల్గొన్నారు.





# స్నానాలు చేయాలన్న, బాత్రూములకు వెళ్లాలన్న చేలాల్లో బావులే దిక్కాయే

## మేళ్లచెరువు-కోదాడ రహదారిపై ఆందోళన చేస్తూ ధర్నా

## దిగిన ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై16:సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండల కేంద్రంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు బుధవారం ఉదయం మేళ్లచెరువు-కోదాడ రహదారిపై ఆందోళన చేస్తూ ధర్నా చేశారు.మేళ్ల చెరువు ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో సుమారు 450 మంది విద్యార్థులు హాస్టల్ లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు.పాఠశాలలో బోర్ లో భూగర్భ జలాలు అడుగంటుకుపోయి నీరు లేక గత నెల రోజులుగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు నామ మాత్రంగా ట్యాంకర్ల ద్వారా నీరు సరపరా చేయడం ఆ ట్యాంకర్ నీటినే బట్టలు ఉతకడానికి తాగడానికి వంటలు వండడానికి స్నానానికి అన్నిటికీ వినియోగిస్తుండడం తెచ్చిన టాంకర్ నీళ్లు సరిపోయే పరిస్థితి లేదని నాలుగు రోజులకు ఒక ట్యాంకరు తెప్పియడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, గత పది రోజుల నుండి సరిపడా నీరు రాకపోవడంతో స్నానాలు చేసేందుకు కనీసం బాత్రూంకు వెళ్లేందుకు కూడా నీరు లేక విద్యార్థులు ప్రిన్సిపాల్ ని అడిగితే దగ్గరలోని పొలాలలో బావులు బోర్ల వద్దకు వెళ్లి స్నానాలు చేయమని బాత్రూములకు వెళ్ళమని ఉచిత సలహా ఇస్తున్నారని తప్పా సమస్య పరిష్కరించడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు స్కూల్ లో 20 బాత్రూములు ఉన్నప్పటికీ ఒక్కటి కూడా సక్రమంగా పనిచేయట్లేదని వాపోయారు ఇక తప్పక తమ బాధలు చెప్పుకునేందుకు రోడ్ ఎక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు.ధర్నా చేస్తున్న సంఘటన స్థలానికి మేళ్లచెరువు పోలీసులు చేరుకొని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థుల ధర్నా విరమించుకున్నారు. ధర్నా చేయడం వలన కోదాడ నుండి మేళ్లచెరువు వెళ్లే వాహనాలకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది దీంతో పోలీసులు ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేస్తారో లేదో వేచి చూడాలి.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి చేసిన మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



సూర్యాపేట జిల్లా బ్యూరో (భారత శక్తి) జూలై 16:ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మాజీ మంత్రి,సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి బుధవారం లబ్ధిదారులకు సూర్యాపేట క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పంపిణి చేశారు. నియోజకవర్గంలో 148 లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కాగా ఆయా గ్రామాల నాయకుల సమక్షంలో చెక్కులు అందజేశారు ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సహకారాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, నాయకులు గోపగాని వెంకటనారాయణ, పేరుమాళ్ల అన్నపూర్ణ,నిమ్మల శ్రీనివాస్ గౌడ్,వై వెంకటేశ్వర్లు,జీడీ భిక్షం,నెమ్మది బిక్షం,పుట్ట కిషోర్,జీవన్ రెడ్డి,మొరిశెట్టి శ్రీను,బాషా,యుగేందర్, శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ,నర్సింహా రావు సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థిని మృతి విద్యార్ది సంఘాల ధర్నా

సూర్యాపేట నడిగూడెం లోని కస్తూర్బా బాలికల పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని (తనుజా మహాలక్ష్మి) అనుమానాస్పద మృతిచెందడం విద్యార్ది సంఘాల అదోళనకు దారి తీసింది. ఆత్మహత్యా కాదు. హత్యేనని విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థి సనీఘాలు అంటున్నారు. విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంటుంటే పాఠశాల సిబ్బంది లేరాఅని పేరెంట్స్ ప్రశ్నిస్తున్నారు.

# కాసులు కురిపిస్తున్న ఆయిల్‌పామ్ సాగు

పెద్దపల్లి) విదేశాల నుంచి పామ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకోకుండా ఉండేందుకు దేశీయంగానే ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో రైతులకు రాయితీలు ఇస్తూ పంట సాగుకు చేస్తున్న ప్రోత్సాహం సత్ఫలితాలను ఇస్తోంది. పెద్దపల్లి జిల్లాలో ప్రయోగాత్మకంగా కొందరి రైతుల భూముల్లో సాగు చేసిన ఆయిల్ పామ్ పంట చేతికి వచ్చింది. ఇప్పటి వరకు రెండు కటింగ్‌లు చేపట్టిన రైతులకు ఉద్యాన శాఖాధికారులు సూచించిన మేరకు దిగుబడులు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొదటిసారి ఆయిల్ పామ్ పంట చేతికి వచ్చింది. టన్నుకు 20 వేల రూపాయల పైచిలుకు ధరకు ఆయిల్ పామ్ గెలలను రైతులు విక్రయించారు. మూడేళ్లుగా ఉద్యాన, వ్యవసాయ శాఖాధికారులు రైతులను ప్రోత్సహిస్తుండడంతో సాగు విస్తీర్ణం 3,100 ఎకరాలకు చేరింది. జిల్లాలో ఆయిల్ పామ్ సాగును పెంచేందుకు అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు మూడేళ్ల క్రితం చేపట్టారు. ఎలిగేడు మండలం రెబ్బల్‌దేవ్‌పల్లి వద్ద తిరుమల ఆయిల్ కేమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నర్సరీని ఏర్పాటు



చేసి మొక్కలను పెంచింది. రైతులు పంట దిగుబడులను కూడా కంపెనీ కొనుగోలు చేసింది. కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాతుపల్లి గ్రామ శివారులో ప్రభుత్వం ఇచ్చిన భూమిలో ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని కూడా చేపట్టింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ఆయిల్ పామ్ గెలలను శుద్ధి చేసి ఆయిల్‌గా మార్చి ఆయా ప్రాంతాలకు ఎగుమతి చేయనున్నారు. 2022-23 సంవత్సరంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేయిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 3,100 ఎకరాల్లో రైతులు పంట వేశారు. ఎకరానికి చతురస్రాకారంలో 50 మొక్కలు, త్రిభుజాకారంలో 57 మొక్కలు నాటుతారు. ఒక్కో మొక్కకు రైతులు 20 రూపాయల చొప్పున డీడీ చెల్లిస్తే, ప్రభుత్వం 193 రూపాయల సబ్సిడీ ఇస్తుంది. అలాగే డ్రిప్ ఇరిగేషన్ కోసం ఎకరానికి 20 నుంచి 27 వేల వరకు సబ్సిడీ ఇస్తుంది. రెండు విడతల్లో పంట కలుపు, ఎరువులు, అంతర పంట కోసం 16,800 రూపాయలు ప్రభుత్వం రైతులకు అందజేస్తుందని అధికారులు తెలిపారు. మూడేళ్ల తర్వాత పంట కాపునకు వస్తుందని ఎకరానికి 8 నుంచి 10 టన్నుల వరకు దిగుబడి వస్తుందని అధికారులు తెలిపారు. తద్వారా ఏడాదికి లక్షా 50 వేల నుంచి 2 లక్షల రూపాయల ఆదాయం వస్తుందని, నిర్వహణ ఖర్చు 40 వేలు పోతే లక్షకు పైగా ఆదాయం వస్తుంది. పంట కాలం 30 నుంచి 35 ఏళ్ల వరకు ఉంటుంది.

జిల్లాలో ప్రయోగాత్మకంగా ఆయిల్ పామ్ పంటను ఆరుగురు రైతులు 11.23 ఎకరాల్లో సాగు చేశారు. ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ చెందిన నాంసాని సమ్మయ్య 1.73 ఎకరాలు, కళ్యాణపు రాయమల్లు 2.50 ఎకరాలు, మైదంబండకు చెందిన గుజ్జుల రాజిరెడ్డి ఎకరం, కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన పత్తి శ్రీలత 2.50 ఎకరాలు, ధర్మారం మండలం నర్సింగాపూర్ చెందిన బద్దం రాంరెడ్డి 1.50 ఎకరాలు, ఎలిగేడు మండలం శివపల్లికి చెందిన జునేని శ్యామ్‌సుందర్ రావు 2 ఎకరాలు, మొత్తం 11.23 ఎకరాల్లో పంట సాగు చేశారు. పంట కాపునకు వచ్చి గెలలు వేస్తున్నది. ఇప్పటి వరకు రెండుసార్లు పంట కోయగా, 18 టన్నుల 35 క్వింటాళ్ల 70 కిలోల వరకు దిగుబడి వచ్చింది. ఈ పంటను టన్నుకు 20,057 నుంచి 20,074 రూపాయల ధర పలికింది. 3 లక్షల 68 వేల 359 రూపాయలు రైతులకు ఆదాయం వచ్చింది. దీంతో పంట సాగు చేసిన రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తున్నది.

# తెలంగాణ రైతాంగంపై బీజేపీ వివక్ష

గోదావరిఖని, జూలై 16): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి యూరియా కోటా తగ్గించి కక్ష సాధింపులకు పాల్పడుతుందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్)ను సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్ఎఫ్‌సీఎల్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత యువతకు ఉపాధి లభిస్తుందని, రైతాంగానికి ఎరువులు అందుబాటులో ఉంటాయని ప్రజలు భావించారన్నారు. మన్మోహన్ సింగ్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం ఎఫ్‌సీఐ పునరుద్ధరణకు అన్నీ చర్యలు చేపట్టిందన్నారు. ఈ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డా ఆర్ఎఫ్‌సీఎల్ నిర్మాణాన్ని స్వాగతించారన్నారు.కానీ ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాలకు అధిక యూరియా కేటాయించి తెలంగాణపై వివక్ష చూపుతుందన్నారు. రాష్ట్ర రైతాంగాన్ని ఇబ్బందులు పెడుతున్న బీజేపీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత సంవత్సరం కంటే ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి 1.14లక్షల టన్నులు తక్కువ కేటాయించారని, జూలై కోటాలోనే 30వేల టన్నులు తగ్గించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ఎరువుల శాఖ మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను కలిసి విజ్ఞప్తి చేసినా సరఫరా పెరగలేదన్నారు. వరి నాట్ల సీజన్ మొదలైందని, పది రోజుల్లో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈలోపే కేంద్రం యూరియాను సరఫరా చేయాలని కోరారు. తాను కూడా కేంద్ర మంత్రిని కలిసి రైతాంగం ఇబ్బందుల గురించి వివరిస్తానన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా పని చేయాలి: తెలంగాణ విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళీ

**-ఆదర్శ పాఠశాలల్లో విద్యా బోధనకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలి**

**-పైలెట్ ప్రాజెక్టు క్రింద 11 పాఠశాలలను 2 క్యాటగిరీలుగా అభివృద్ధి చేయాలి**

**-మార్కెట్ రేటు ప్రకారం ప్రతిపాదనలు తయారు చేయాలి**

**-స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు**





ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూలై 16:విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని తెలంగాణ విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళీ అన్నారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళీ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ లతో కలిసి బుధవారం సంబంధిత అధికారులతో మధిర నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు క్రింద 11 ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా తెలంగాణ విద్యా కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళీ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా మనమంతా ధృడచిత్తంతో పని చేయాలన్నారు. తెలంగాణ విద్యా కమీషన్ తరపున ప్రభుత్వానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రతి మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రవేశ పెట్టాలని సిఫార్సు చేశామని అన్నారు. మధిర నియోజకవర్గం పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా అభివృద్ధి చేయాలని అన్నారు. ప్రతి పాఠశాలలో టీచింగ్ సరిగ్గా జరిగేలా, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం సృష్టించాలని అన్నారు. ఈ దిశలో 11 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించినట్లు, అందులో 2 పాఠశాలలను క్యాటగిరి ఒకటి క్రింద, 9 పాఠశాలలను క్యాటగిరి రెండుగా విభజించాలని అన్నారు. క్యాటగిరి 1 లోని రెండు పాఠశాలలను ఎంపిక చేసి, వాటిలో 1000 నుంచి 1200 మంది విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, లైబ్రరీ, ల్యాబ్స్, స్పోర్ట్స్, కిచెన్, డైనింగ్ హాల్, కాంపౌండ్ వాల్ వంటి వివిధ సౌకర్యాలు పూర్తి స్థాయిలో అందించాలని అన్నారు. క్యాటగిరి 2 లోని 9 ప్రభుత్వ పాఠశాలల్లో కోటి నుంచి 2 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. క్యాటగిరి 1 లో సిరిపురం, జమలాపురం పాఠశాలలను ఎంపిక చేస్తున్నట్లు, వీటిని పూర్తిస్థాయిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గా అభివృద్ధి చేయాలని విద్యా కమిషన్ చైర్మన్ తెలిపారు. క్యాటగిరి 1 లోని 2 పాఠశాలల్లో 25 నుంచి 30 తరగతి గదులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, కార్పోరేట్ స్థాయిలో తరగతి గదులను డిజైన్ చేయాలని, గ్రీన్ బోర్డు, డ్యూయల్ డెస్క్, ఫ్యాన్, లైట్లు ఏర్పాటు చేయాలని, తరగతి గదిలో వెంటిలేషన్ ఉండాలని, విద్యుత్ వైరింగ్ పక్కాగా జరగాలని అన్నారు. పాఠశాలలో పిల్లలు క్లాస్ రూమ్ వెళ్ళే వాక్ వే కలర్ ఫుల్ గా, ఆకర్షణీయంగా ఉండాలని అన్నారు.తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ లో గ్రంథాలయం, ల్యాబ్స్, స్పోర్ట్స్ సౌకర్యాలు కామన్ గా నిర్మించాలని తెలిపారు. పాఠశాలలో కాంపౌండ్ వాల్ తప్పనిసరిగా వుండాన్నారు. పాఠశాల అభివృద్ధి పనుల ప్రతిపాదనలు వేసే సమయంలో ఇంజనీరింగ్ అధికారులు జాగ్రత్తగా ఉండాలని, మార్కెట్ రేటుకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ద్వారా అభివృద్ధి పనులు చేయాలని అన్నారు. ఈ కమిటీలో విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రమే 30 మంది సభ్యులు ఉండాలని, వీరిలో 50 శాతం తప్పనిసరిగా మహిళలు ఉండాలని అన్నారు. పాఠశాల అభివృద్ధి పనులను స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఆమోదించాలని, చెక్కుల ద్వారానే చెల్లింపులు జరిగేలా చూడాలని అన్నారు.పాఠశాలలోని ఒక్కో విద్యార్థి నుంచి నామినల్ గా వేయి రూపాయల ఫీజు వసూలు చేసి స్కూల్ కార్పస్ ఫండ్ సృష్టించాలని, భవిష్యత్తులో ఎటువంటి మరమ్మత్తు పనులు, పాఠశాల నిర్వహణ కోసం ఆ నిధులు వినియోగించాలని అన్నారు. పీఎం శ్రీ, సమగ్ర శిక్ష అభియాన్, ఉపాధి హామీ నిధులను పాఠశాల అభివృద్ధి కోసం వినియోగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు మధిర నియోజకవర్గం పరిధిలో ఉన్న 5 మండలాల్లో ఎంపిక చేసిన 11 ప్రభుత్వ పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టు క్రింద సంపూర్ణంగా అభివృద్ధి చేయాలని అన్నారు. దీనిని ప్రత్యేక శ్రద్దతో అమలు చేయాలని అన్నారు. 11 ప్రభుత్వ పాఠశాలలను ఎటువంటి పొరపాట్లు చేయకుండా ఆదర్శవంతంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పాఠశాల ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని, డిప్యూటీ సీఎం ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన కార్యక్రమంలో ఎటువంటి నిర్లక్ష్యానికి ఆస్కారం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ, 11 పాఠశాలల్లో స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. క్యాటగిరి 1 లో అభివృద్ధి పనులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. క్యాటగిరి 2 లో ఉన్న 9 పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించి నివేదిక తయారు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, విద్యా శాఖ ఈఈ విన్సెంట్ రావు, మండల విద్యా శాఖ అధికారులు, విద్యా శాఖ డిఈ లు, ఏఈ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీతో ప్రజలకు సేవలందించి ఉన్నత స్థాయికి ఎదగాలి: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





ఖమ్మం ప్రతినిది (భారత శక్తి న్యూస్ ), జూలై 16:నిజాయితీతో ప్రజలకు సేవలందించి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సిఎస్సి శిక్షణ పొందుతున్న ఎస్.హెచ్.జి. మహిళలకు సూచించారు.ఖమ్మం ఐ.టి. హబ్ లో నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి డిజిటల్ ఇండియా మోడల్ సి.ఎస్.సి. శిక్షణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం సందర్శించారు. జిల్లాలో 153 మంది స్వశక్తి మహిళా సంఘాల సభ్యులకు శిక్షణలో భాగంగా మొదటి విడత 70 మందికి తరుణి హాట్ సెంటర్ లో శిక్షణ ఇవ్వగా, మిగతా వారికి ఐ.టి. హబ్ లో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా ఈడిపి., ఐటీ స్కిల్స్ పైన శిక్షణ కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కామన్ సర్వీస్ సెంటర్ శిక్షణ పూర్తి చేసుకుని గ్రామాలలో వ్యాపారవేత్తలుగా కెరియర్ ప్రారంభించ నున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలిపారు. సాంకేతికత విపరీతంగా పెరిగిందని, ప్రస్తుతం ఫోన్ ద్వారా ప్రతి ఒక్కరికి టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని, పట్టణాలకు మాత్రమే పరిమితం కాదని అన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ సేవలను మరింత విస్తరించవచ్చుని అన్నారు. ఆధార్ కార్డ్ అప్ డేట్, బ్యాంకింగ్ సేవలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, రవాణా టికెట్ బుకింగ్, పాస్ పోర్ట్ సేవలు , హెల్త్ కార్డ్ సేవలు వంటి అనేక రకమైన సేవలు మనం సిఎస్సి ద్వారా ప్రజలకు అందించవచ్చని అన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ తో పాటు జిరాక్స్ సెంటర్, జనరల్ స్టోర్స్ వంటివి ఏర్పాటు చేసి వ్యాపార విస్తరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జీవితంలో ఆటంకాలు వచ్చినప్పుడు అధైర్య పడకుండా ముందుకు సాగాలని అన్నారు. గ్రామంలో నిజాయితీతో ప్రజలకు సేవలు అందిస్తే వ్యాపారం క్రమంగా పెరుగుతోందని అన్నారు.

శిక్షణ పొందిన ప్రతి ఒక్కరు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ తెలిపారు. సి.ఎస్.సి ద్వారా మొదటి విడత శిక్షణ పొందిన మహిళలు మాట్లాడుతూ సిఎస్సీ సెంటర్ ద్వారా గ్రామాల్లో విస్తృతంగా, సంతృప్తికరంగా సేవలు అందిస్తామని, దీంతో పాటు గ్రామాల్లో చిన్న వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకు లింకేజీ రుణాలు అందించడంలో సహకరించాలని అన్నారు.అనంతరం సి.ఎస్.సి. దివస్ 16 సంవత్సరాల డిజిటల్ ఇన్ క్లూషన్ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యులతో కలిసి జిల్లా కలెక్టర్ కేక్ కట్ చేసి, ఎస్.హెచ్.జి. మహిళలకు బయోమెట్రిక్ డివైస్ లు అందజేశారు.ఈ కార్యక్రమంలో సి.ఎస్.సి. ప్రాజెక్టు మేనేజర్ బి. హరికృష్ణ కుమార్, టాస్క్ రీజనల్ మేనేజర్ అశోక్ కుమార్ నాయక్, ఖమ్మం ప్రాజెక్ట్ మేనేజర్ లు షేక్ ఫయాజ్, సురేష్ కుమార్, ఈడీపీ ట్రైనర్ బాలూ ప్రవరక్య, డిజి పే ఆధార్ సర్వీస్ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికలు కలెక్టర్లకు కీలక ఆదేశాలు

హైదరాబాద్

తెలంగాణ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు కీలక ఆదేశాలు ఇచ్చింది. పోలింగ్ సిబ్బంది డేటాను వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని సూచించింది. ఫిబ్రవరిలో నమోదైన రిటర్నింగ్,సహాయ రిటర్నింగ్, ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బంది వివరాలను పునఃపరిశీలించాలని తెలిపింది. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండలం, పంచాయతీలు,వార్డుల సంఖ్య ఆధారంగా వివరాలు ఉండాలంది దీంతో త్వరలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది.

================================

# నాణ్యతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

సిద్దిపేట

ఇందిరమ్మ ఇళ్లు నాణ్యత పాటిస్తూ ఇంటి నిర్మాణ పనులు పూర్తి చెయ్యాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పేర్కొన్నారు.

సిద్దిపేట ఐడిఓసి లోని సమావేశ మందిరంలో జనగాం నియోజక వర్గం పరిధిలోని జిల్లాలోని 4 మండలాల్లో దాదాపు 415 మంది లబ్ది దారులకు రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె. హైమావతి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మండలాల వారీగా చేర్యాల 160, కొమురవెల్లి 84, దూల్ మిట్ట 76, మద్దూర్ 95 మొత్తం 415 మంది లబ్ధిదారులకు కలెక్టర్ పంపిణి చేశారు.

అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ. అందరికీ సొంత ఇల్లు అనేది గౌరవ సూచికమని, ఈ సువర్ణ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోని, వచ్చే ముహూర్తం లోగా ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలి అన్నారు. నిర్మాణం కొరకు 60 గజాలు లోపు స్థలం ఉండాలని, ఇంటి నిర్మాణానికి సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు అధికారులకు తెలియజేయాలి తెలిపారు. ఇల్లు మంజూరు అయిన ఆర్థిక స్తోమత లేని నిరూపేద లబ్ధిదారులకు ఎస్.హెచ్.జి ల ద్వారా ఆర్థిక సహాయం అందించడంతో పాటు, ఇసుక సమస్యలు తలెత్తకుండా స్థానిక మండలంలోని తహసీల్దార్, యంపిడిఓ ల ద్వారా 8 ట్రిప్పుల ఇసుక అనుమతులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని, నిర్మాణ స్థాయిని బట్టి లబ్ధిదారులకు స్లిప్ ఇచ్చిన రోజే ఇసుకను లబ్ధిదారులు కచ్చితంగా తెచ్చుకోవాల్సిందిగా సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, హౌసింగ్ పిడి దామోదర్ రావు, ఆయా మండలాల సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

================================చీచీ

# ఇందిరా పార్క్ బిసీ సభ కు భారీగా తరలిన వెళ్లిన బిఆర్ఎస్ నాయకులు

**-సభలో పాల్గొన్న మంథని మాజీ ఏమ్మెల్యే పుట్ట మధుకర్**

మంథని

హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద బ్యాక్వర్డ్ క్లాసెస్ పబ్లిక్ రిప్రజెంటిటివ్ ఫోరం, వెనుకబడిన తరగతుల ప్రజాప్రతినిధుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బీసీ సభ కు మంథని మాజీ ఏమ్మెల్యే పుట్ట మధుకర్ ఆధ్వర్యంలో మంథని నియోజకవర్గం లోని బిఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. బీసీపీఎఫ్ ( బ్యాక్వర్డ్ క్లాసెస్ పబ్లిక్ రిప్రజెంటిటివ్ ఫోరం), వెనుకబడిన తరగతుల ప్రజాప్రతినిధుల వేదిక ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైదారాబాద్ ఇందిరా పార్క్ వద్ద బీసీ ల మహా ధర్నా లో,బీసీ సభ కార్యక్రమంలో మంథని మాజీ ఏమ్మెల్యే పుట్ట మధుకర్ పాల్గొని తన మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంథని బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఏగోలపు శంకర్ గౌడ్.ప్రధాన కార్యదర్శి లచ్చన్న, సింగిల్ విండో డైరెక్టర్ మచిడి రాజు గౌడ్. రచ్చపల్లి మజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్ యాదవ్. మాజీ ఎంపిటిసి పెగడ శ్రీనివాస్, బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు కొండా రవీందర్, నాయకులు పుప్పాల తిరుపతి. బడికెలా సధి లతో పాటు మంథని నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని యువకుడు దుర్మరణం

మదనపల్లె

మదనపల్లెలో ఆర్టిసి బస్సు ఢీకొని గుర్తుతెలియని యువకుడు ఇవ్వకూడదు దుర్మరణం చెందాడు. ఈ విషాదకర సంఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. సుమారు 25 సంవత్సరాల వయసున్న యువకుడ్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలం వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది

# లక్ ఉండుంటే 3-0 ఆధిక్యంలో భారత్..

## లార్డ్స్‌లో టర్నింగ్ పాయింట్ అదే: రవిశాస్త్రి



ఐదు టెస్టుల సిరీస్‌ల్లో ప్రస్తుతం ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలో ఉంది. ఇప్పటివరకు జరిగిన మూడు మ్యాచుల్లో భారత్ (%ఉఖుఎ ×అ఼ఖు%) ఒక్కటే గెలిచింది. తొలి మ్యాచ్‌లో భారీ టార్గెట్ నిర్దేశించినా ఓటమి తప్పలేదు. ఇక మూడో టెస్టులో స్వల్ప లక్ష్యాన్ని టీమ్‌ఇండియా ఛేదించలేకపోయింది. ఐదోరోజు అత్యంత కఠినంగా మారిన పిచ్‌పై 22 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. రవీంద్ర జడేజా పోరాడినా ఓటమి తప్పలేదు. ఈ సిరీస్‌లో అదృష్టం కలిసివచ్చుంటే భారత్ ఇప్పటికే 3-0 ఆధిక్యంలో ఉండేదని మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి వ్యాఖ్యానించాడు. అలాగే కరుణ్ నాయర్ ఆటతీరు పైనా స్పందించాడు.

''కొంచెం అదృష్టం కలిసివస్తే టీమ్‌ఇండియా పరిస్థితి ఇప్పుడున్న దానికి భిన్నంగా ఉండేది. లార్డ్స్ టెస్టులో టర్నింగ్ పాయింట్ మాత్రం తొలి ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్ రనౌట్ కావడమే. ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ మైండ్ ఆఫ్ ప్రెజెన్స్‌తో నాన్‌స్ట్రైకింగ్ వైపు బంతిని విసిరి రనౌట్ చేశాడు. అప్పటివరకు టీమ్‌ఇండియానే డ్రైవర్ సీట్‌లో ఉంది. ఎప్పుడైతే పంత్ ఔటయ్యాడో వెనకబడిపోయింది. కరుణ్‌నాయర్ ఏకాగ్రతను కోల్పోతున్నట్లు అనిపించింది. మంచి ఆరంభాలను సద్వినియోగం చేసుకోవడం లేదు. రెండో ఇన్నింగ్స్‌లో టాప్ ఆర్డర్ నుంచి మరొకరు ఆడినా బాగుండేది. బంతి పాతబడిన తర్వాత పరిస్థితులు మారాయి. జడేజా, బుమ్రా, సిరాజ్ చాలా అద్భుతంగా డిఫెన్స్ ఆడారు. నాలుగో రోజు కీలకమైన మూడు వికెట్లను కోల్పోకుండా ఉండి ఉంటే గెలుపు భారత్‌దే. ఈసందర్భంగా ఇంగ్లాండ్‌ను అభినందించాల్సిందే. క్లిష్టమైన పరిస్థితుల్లోనూ ఒత్తిడిని జయించి గేమ్‌ను లాగేసుకున్నారు. ఈ మ్యాచ్‌ను చూస్తుంటే నాకు 2021 టెస్టు గుర్తుకొచ్చింది. అప్పుడు భారత్ గెలిస్తే.. ఇప్పుడు ఇంగ్లాండ్ విజయం సాధించింది" అని రవిశాస్త్రి వెల్లడించాడు.



# అగ్రస్థానంలో బుమ్రా.. టాప్-10లో ఐదుగురు ఆస్ట్రేలియా బౌలర్లు


ఇంగ్లాండ్‌తో జరిగిన మూడో టెస్టులో ఏడు వికెట్లు పడగొట్టిన టీమ్‌ఇండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (901) టెస్టు ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. రెండో స్థానంలో ఉన్న కగిసో రబాడ (851) బుమ్రాకు మధ్య 50 రేటింగ్ పాయింట్ల వ్యత్యాసం ఉంది. వెస్టిండీస్‌తో జరిగిన పింక్ బాల్ టెస్టులో హ్యాట్రిక్ సహా ఆరు వికెట్లు తీసిన ఆసీస్ పేసర్ స్కాట్ బోలాండ్ ఆరు స్థానాలు ఎగబాకాడు. ఈ క్రమంలో బోలాండ్ ఆరో స్థానంలో నిలిచి కెరీర్‌లో బెస్ట్ ర్యాంకు అందుకున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లు పాట్ కమిన్స్ (3వ), హేజిల్‌వుడ్ (4వ), నాథన్ లైయన్ (8వ), మిచెల్ స్టార్క్ (10వ) స్థానాల్లో కొనసాగుతున్నారు. దీంతో టాప్-10లో ఐదుగురు ఆస్ట్రేలియా బౌలర్లు ఉన్నట్లయింది. ఆసీస్‌తో జరిగిన డే/నైట్ టెస్టులో ఎనిమిది వికెట్లు తీసిన విండీస్ ఫాస్ట్‌బౌలర్ షమార్ జోసెఫ్ 15 స్థానాలు ఎగబాకి 14వ ర్యాంకులో నిలిచాడు. లార్డ్స్ టెస్టులో నాలుగు వికెట్లు తీసిన భారత స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ 12 స్థానాలు మెరుగై 46వ ర్యాంకుకు చేరుకున్నాడు.

బ్యాటింగ్ ర్యాంకింగ్స్ విషయానికొస్తే.. ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ (888) తిరిగి అగ్రస్థానానికి చేరుకున్నాడు. భారత్‌తో జరిగిన మూడో టెస్టులో రూట్ (104, 40) రాణించిన సంగతి తెలిసిందే. హ్యారీ బ్రూక్ (862) మూడో స్థానానికి పడిపోగా.. కేన్ విలియమ్సన్ (867) రెండో ప్లేస్‌కు చేరుకున్నాడు. యశస్వి జైస్వాల్ (801)ను వెనక్కినెట్టి స్టీవ్ స్మిత్ (816) నాలుగో స్థానంలో నిలిచాడు. రిషభ్ పంత్ ఒక స్థానం డౌన్ అయి ఎనిమిదో స్థానానికి, శుభ్‌మన్ గిల్ మూడు స్థానాలు దిగజారి తొమ్మిదో ర్యాంక్‌కు పడిపోయారు. రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్ ఐదేసి స్థానాలు మెరుగై వరుసగా 34, 35 ర్యాంక్‌ల్లో నిలిచారు.

# "ప్లీజ్.. పృథ్వీషాలా వైభవ్ సూర్యవంశీ కెరీర్‌ను నాశనం చేయొద్దు"

FONT SIZE





పద్నాలుగేళ్లకే అతడొక సంచలనం. ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చి అదరగొట్టాడు. అత్యంత వేగవంతమైన సెంచరీ బాదిన భారత క్రికెటర్‌గా నిలిచాడు. ఇప్పుడు యూత్ క్రికెట్‌లోనూ సూపర్‌గా ఆడేస్తున్న ఆ కుర్రాడెవరో కాదు.. వైభవ్ సూర్యవంశీ అండర్-19 యూత్ క్రికెట్‌లో ఇంగ్లాండ్‌పై విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. తక్కువ బంతుల్లోనే సెంచరీ చేసిన బ్యాటర్‌గానూ రికార్డు సృష్టించాడు.

ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న వైభవ్‌కు ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా భారీగానే ఉంది. అతడి కోసం ఆరు గంటలు ప్రయాణించి మరీ ఇద్దరు యంగ్‌స్టర్స్ వచ్చారని తెలుసు కదా.. వైభవ్ ఆటతీరు వారిని ఎంతలా ఆకట్టుకుందో ఇట్టే అర్థమైపోతుంది. యూత్ టెస్టు ముగిసిన తర్వాత భారత సంతతివారే కాకుండా.. ఇంగ్లాండ్‌కు చెందిన చిన్నారులు కూడా వైభవ్‌తో ఆటోగ్రాఫ్‌లు, ఫొటోగ్రాఫ్‌లు తీసుకుంటూ సంబరపడ్డారు. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అయితే, ఇలాంటి సమయంలోనూ అత్యంత జాగ్రత్తగా కామెంట్లు వస్తున్నాయి. పృథ్వీ షా కెరీర్ మాదిరిగా వైభవ్ విషయంలో పొరపాట్లు జరగకూడదని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. పృథ్వీషా కూడా చిన్న వయసులోనే అద్భుత ఆటతీరుతో చాలా పాపులర్ అయ్యాడు. ఎక్కడ చూసినా అతడి గురించే చర్చ. కానీ, అతడు దానిని నిలబెట్టుకోలేకపోయాడు. వ్యక్తిగత జీవితంలో ఇబ్బందిపడ్డాడు. ఇటు దేశవాళీ క్రికెట్‌లోనూ నాణ్యమైన ప్రదర్శన చేయలేక ఐపీఎల్‌లో స్థానం కోల్పోయాడు. ఇక భారత జట్టులోకి ఎంట్రీ ఇవ్వడం కష్టమే. అందుకే, సూర్యవంశీని ఎక్కువగా ఇలాంటి ఫ్యాన్ క్రేజ్ విషయాలకు దూరంగా ఉంచాలని క్రికెట్ అభిమానులు సూచిస్తున్నారు.

"వైభవ్‌ను ఇలాగే కొనసాగనివ్వండి. ఆటతీరును మెరుగుపర్చుకునేలా చూడండి. అంతేకానీ, పృథ్వీషాలా కెరీర్‌ను నాశనం చేయొద్దు"

"ఇలాంటి చిన్న వయసులోనే ఇంతలా ఫ్యాన్ ఫాలోయింగ్ రావడం కాస్త ఆందోళన కలిగించే అంశమే. భవిష్యత్తులో మంచి ప్రదర్శన చేయలేకపోతే ఆటోమేటిక్‌గా ఒత్తిడి పెరుగుతుంది. ఇలాంటిది ఇప్పటికే మనం పృథ్వీ షా విషయంలో చూశాం"

# భారత్ గెలవాల్సింది

%ముంబయి: మూడో టెస్టులో టీమ్‌ఇండియా గెలవాల్సిందని మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. టాప్‌ఆర్డర్ మెరుగైన ప్రదర్శన చేసి ఉంటే సిరీస్‌లో భారత్ ఆధిక్యంలో ఉండేదని అన్నాడు. "ఈ సిరీస్‌లో భారత జట్టు బ్యాటింగ్ కాస్త నిరాశ కలిగించింది. లార్డ్స్‌లో ఆ జట్టు లక్ష్యాన్ని ఛేదించాల్సింది. జడేజా పోరాటం చూశాం.



జట్టులో ప్రతిభావంతులైన బ్యాటర్లు ఉన్నారు. సిరీస్‌లో 2-1 ఆధిక్యం సంపాదించే అవకాశం చేజారినందుకు టీమ్‌ఇండియా నా కన్నా ఎక్కువే నిరాశ చెంది ఉంటుంది" అని గంగూలీ చెప్పాడు. "బ్యాటింగ్ బలంగా ఉన్నప్పటికీ 193 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేకపోవడం భారత్‌కు నిరాశ కలిగించి ఉంటుంది. టాప్ ఆర్డర్ కాస్త పోరాడి ఉంటే భారత్ గెలిచేది" అని అన్నాడు.

# మనోళ్లూ డోసు పెంచాలి.. 'మాంచెస్టర్ టెస్టు' ముందు టీమ్‌ఇండియా సవాళ్లివే



ఇంగ్లాండ్ పర్యటనలో మూడో టెస్టు నాటికి అసలైన మజా ఏంటో అభిమానులు రుచి చూశారు. ఇంగ్లాండ్ - భారత్ జట్ల ఆటగాళ్ల భావోద్వేగాలు తీవ్రస్థాయికి చేరాయి. ఇదే వేడి సిరీస్ ఆసాంతం కొనసాగుతుందనడంలో సందేహం లేదు. సరిగ్గా వారం రోజుల తర్వాత మాంచెస్టర్ వేదికగా నాలుగో టెస్టు జరగనుంది. టీమ్‌ఇండియా సిరీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిందే. మరి మన జట్టు ముందున్న సవాళ్లేంటో ఓ లుక్కేద్దాం..!

తుది జట్టు విషయంలో టీమ్‌ఇండియా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మరీ ముఖ్యంగా కరుణ్ నాయర్‌ను కొనసాగించడంపై పునరాలోచన చేయాల్సిందే. దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టాడని తీసుకొచ్చి మరీ అవకాశాలు ఇచ్చినా.. అతడు మాత్రం వాటిని నిలబెట్టుకోవడంలో తడ'బ్యాటు'కు గురవుతున్నాడు. ఆరంభంలో కాన్ఫిడెంట్‌గానే ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తున్నప్పటికీ దానిని కొనసాగించలేక పెవిలియన్‌కు చేరిన సందర్భాలను చూశాం. సాయి సుదర్శన్ విషయంలో ఒక్క మ్యాచ్‌తోనే పక్కనపెట్టిన మేనేజ్‌మెంట్.. మూడు మ్యాచుల్లోనూ కనీసం అర్ధశతకం కూడా చేయలేకపోయిన కరుణ్‌పై వేటు వేయడం ఖాయమనే వాదనా ఉంది.

**ఇంగ్లాండ్ టెయిలెండర్లపై కన్ను**

మూడో టెస్టులో టీమ్‌ఇండియా ఓటమికి ప్రధాన కారణం.. ఇంగ్లాండ్ బ్యాటర్లు ఎనిమిదో వికెట్‌కు ఏకంగా 84 పరుగులను జోడించడమే. జేమీ స్మిత్, బ్రైడన్ కార్స్ అర్ధశతకాలు సాధించారు. ఎప్పుడైతే ఈ భాగస్వామ్యం విడిపోయిందో వెంటనే ఇంగ్లాండ్ ఆలౌట్ అయింది. ఒకవేళ ఈ జోడీని ముందే విడదీసి ఉంటే ఫలితం భారత్‌కు అనుకూలంగా వచ్చేదని మాజీల అభిప్రాయం. టాప్, మిడిలార్డర్‌ను త్వరగానే పెవిలియన్‌కు చేరుస్తున్నప్పటికీ లోయర్ ఆర్డర్‌పై భారత బౌలర్లు కాస్త కనికరం చూపిస్తున్నట్లుంది. మాంచెస్టర్‌లో ఇంగ్లాండ్ లోయర్ ఆర్డర్ పని పడితేనే విజయం టీమ్‌ఇండియా సొంతమవుతుంది. ఆ బాధ్యతను స్పిన్ ఆల్‌రౌండర్లు తీసుకోవడం బెటర్. స్పిన్ బౌలింగ్‌లో షాట్లు కొట్టేందుకు ప్రయత్నించి వికెట్లు సమర్పించే అవకాశం లేకపోలేదు.

**రెండో ఇన్నింగ్స్‌లో ఒత్తిడి వద్దు**

భారత జట్టు బ్యాటర్లు తొలి ఇన్నింగ్స్‌లో బాగా ఆడతారు. అదేంటో రెండో ఇన్నింగ్స్‌కు వచ్చేసరికి మాత్రం ఒత్తిడికి గురికావడం తరచూ చూస్తున్నాం. తొలి టెస్టులో అలానే ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఇప్పుడు మూడో టెస్టులోనూ సేమ్ రిజల్ట్. కానీ, టాప్‌ఆర్డర్‌లో మరొక బ్యాటర్ నిలిచినా ఫలితం మనకు అనుకూలంగా వచ్చేది. చెత్త షాట్‌కు గిల్ ఔట్ కాగా.. మంచి బంతికే గిల్ పెవిలియన్‌కు చేరాడు. రిషభ్ పంత్ గాయపడటం నష్టం చేసింది. ఇక్కడే భారత మేనేజ్‌మెంట్ కాస్త తెలివిగా వ్యవహరించి ఉంటే బాగుండేది. ఐదోరోజు అతడిని కాస్త లేటుగా బ్యాటింగ్‌కు పంపించాల్సింది. కొత్త బంతితో ఆర్చర్, వోక్స్, స్టోక్స్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. ఒకవేళ ఓ పదిహేను ఓవర్ల తర్వాత పంత్ బ్యాటింగ్‌కు వచ్చి ఉంటే బంతి సాఫ్ట్‌గా మారిపోయేది. అప్పుడు చాలా సులువుగా షాట్లు కొట్టేవాడే.

**'స్లెడ్జింగ్'లో మారాలి..**

లార్డ్స్‌లో భారత్ లక్ష్య ఛేదనకు దిగినప్పటినుంచి ఇంగ్లాండ్ ఆటగాళ్ల బాడీ లాంగ్వేజ్ మారిపోయింది. నాలుగో రోజు ఆఖర్లో ఆకాశ్‌దీప్‌పై కార్స్ మాటల యుద్ధం.. దానికి ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ వత్తాసు పలుకుతూ 'చప్పట్లు' కొట్టడం ఇలాంటి ఘటనలు మొదలయ్యాయి. ఇక ఐదోరోజు భారత్ ముందు కేవలం 135 పరుగులు ఉండటంతో ఇంగ్లాండ్ ప్లేయర్లు మరింత చెలరేగిపోయారు. పంత్ విషయంలో ఆర్చర్, తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి విషయంలో హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ 'ఐపీఎల్' వ్యాఖ్యలతో రెచ్చగొట్టారు. రవీంద్ర జడేజాను ఇంగ్లాండ్ ఆటగాళ్లు 'నిన్ను భారత మేనేజ్‌మెంట్ సరిగ్గా చూసుకోవడం లేదు. నువ్వు ఎన్ని చేసినా వృథా. నీకు విలువ లేదు' అని ఊరించారు. ఇలాంటప్పుడే భారత జట్టులో విరాట్ కోహ్లీ ఉండుంటే బాగుండని చాలామందికి అనిపించింది. ప్రత్యర్థిపై మాటల యుద్ధం చేయడంలో అతడెప్పుడూ ముందుంటాడు. ఈ విషయంలో ప్రస్తుతం గిల్ సేన కూడా మెరుగుకావాల్సిందే. మాటకు మాట సంధిస్తేనే ప్రత్యర్థి ఇంగ్లాండ్ ప్లేయర్లు వెనక్కి తగ్గుతారు. అదే సమయంలో బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన చేయాలి.

**అవే కొంప ముంచాయి**

మూడో టెస్టులో భారత్ ఓటమి అంతరం 22 పరుగులు. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా, ఇంగ్లాండ్ సమంగా స్కోరు చేశాయి. కానీ, భారత్ ఇచ్చిన ఎక్స్‌ట్రాలు 31. అదే ఇంగ్లాండ్ కేవలం 12 మాత్రమే ఇచ్చింది. ఇక రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 192 పరుగులు చేయగా.. ఇందులో 32 అదనపు పరుగుల రూపంలోనే వచ్చాయి. టీమ్‌ఇండియా 170 పరుగులకే ఆలౌటైంది. ఇంగ్లాండ్ బౌలర్లు ఇచ్చిన ఎక్స్‌ట్రాలు 18 మాత్రమే. అంటే రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ కలిపి ఇరుజట్ల మధ్య తేడా 33 రన్స్.

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్‌హోల్డర్లకు బొనాంజా? 19న బోర్డు కీలక భేటీ

ముంబయి: ప్రైవేటు రంగానికి చెందిన బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ( బోర్డు జులై 19న భేటీ కాబోతోంది. ఈ సమావేశంలో బోనస్ షేర్ల జారీ, మధ్యంతర డివిడెండ్‌పై కీలక నిర్ణయం తీసుకోబోతోంది. ఈ సమావేశంలో బోనస్ షేర్ల జారీకి బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇస్తే.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నుంచి బోనస్ షేర్ల జారీ ఇదే తొలిసారి అవుతుంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి (క్యూ1) ఫలితాల ప్రకటనపై జులై 19న బోర్డు భేటీ కాబోతోందని జూన్ 23నే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడించింది. తాజాగా బీఎస్‌ఈకి సమర్పించిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఇదే భేటీలో బోనస్ షేర్ల జారీ, మధ్యంతర డివిడెండ్ పైనా చర్చించనున్నట్లు పేర్కొంది. బ్యాంక్ నుంచి ఈ ప్రకటన వెలువడడంతో బుధవారం బ్యాంక్ షేర్లు 1.33 శాతం పెరిగి రూ.2,021 వద్ద గరిష్ఠాన్ని తాకాయి. బోనస్ షేర్ల జారీ అనేది నియంత్రణ సంస్థలు, వాటాదార్ల ఆమోదానికి లోబడి ఉంటుందని బ్యాంక్ తెలిపింది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ గత ఆర్థిక సంవత్సరానికి గానూ చివరి త్రైమాసికంలో ఒక్కో షేరుపై రూ.22 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. బ్యాంక్ షేర్లు కూడా ఇటీవల కాలంలో దూసుకెళ్తున్నాయి. గత ఏడాదిలో షేరు విలువ 23.01 శాతం పెరగ్గా.. గత ఆరు నెలల్లో 21.46 శాతం మేర లాభపడింది. మూడు నెలల్లో 6.99 శాతం రిటర్నులు ఇవ్వగా.. గత నెలలో 4.07 శాతం మేర పెరిగింది. బ్యాంకు మెరుగ్గా రాణిస్తుండడంతో ఇన్వెస్టర్లకు తీపికబురు అందించేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు 2011, 2019లో రెండుసార్లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్టాక్ స్ప్లిట్‌ను ప్రకటించింది.



# ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు.. 25,200 ఎగువన నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. త్రైమాసిక ఫలితాల సీజన్ కావడం, భారత్- అమెరికా మధ్య ట్రేడ్ డీల్‌పై ఇంకా స్పష్టత రాకపోవడంతో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. ఈ క్రమంలో ఉదయం నష్టాల్లో ట్రేడయిన సూచీలు.. రోజంతా ఓ మోస్తరు శ్రేణిలో కదలాడి స్వల్ప లాభాల్లో ముగిశాయి. ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి.

సెన్సెక్స్ ఉదయం 82,534.66 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,570.91) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. ఉదయమంతా దాదాపు నష్టాల్లోనే కొనసాగింది. మధ్యాహ్నం తర్వాత లాభాల బాట పట్టింది. ఇంట్రాడేలో 82,784.75 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 63 పాయింట్ల లాభంతో 82,634.48 వద్ద ముగిసింది. నిఫ్టీ 16.25 పాయింట్ల లాభంతో 25, 212.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.94గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, టెక్ మహీంద్రా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్ఫోసిస్, అదానీ పోర్ట్స్ ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నల్, సన్‌ఫార్మా, టాటా స్టీల్, టాటా మోటార్స్, బీఈఎల్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.50 డాలర్ల వద్ద కొనసాగుతుండగా..బంగారం ఔన్సు 3,347 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# చాట్‌జీపీటీ డౌన్.. చాట్‌బాట్‌లో ఎర్రర్ మెసేజ్‌లు



కృత్రిమ మేధ ఆధారిత చాట్‌బాట్ చాట్‌జీపీటీ సేవలకు అంతరాయం ఎదురైంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా అనేకమంది యూజర్లు ఈ సర్వీసులను పొందలేకపోతున్నారు. చాట్‌బాట్‌ను ఓపెన్ చేస్తుంటే.. చాట్ హిస్టరీ లోడ్ అవ్వట్లేదని పలువురు యూజర్లు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెడుతున్నారు. చాట్ చేయడానికి యత్నిస్తుంటే 'అసాధారణ ఎర్రర్' మెసేజ్‌లు వస్తున్నాయని పేర్కొంటున్నారు.


భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లోని యూజర్లకు ఈ సమస్య ఎదురైనట్లు తెలుస్తోంది. దాదాపు 82 శాతం మంది యూజర్లు చాట్‌జీపీటీ సేవలను పొందలేకపోతున్నారని డౌన్‌డిటెక్టర్ వెల్లడించింది. దీనిపై 'ఓపెన్‌ఏఐ ' సంస్థ స్పందించింది. సమస్యను గుర్తించామని, దాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. చాట్‌జీపీటీ రికార్డ్ మోడ్, సోరా, కోడెక్స్ వంటి సేవల్లో అంతరాయం ఉన్నట్లు తెలిపింది. త్వరలోనే సమస్యను పరిష్కరించి సేవలను అందుబాటులోకి తెస్తామని తెలిపింది. చాట్‌జీపీటీ సేవలు డౌన్ అవడం ఈ నెలలో ఇది రెండోసారి కావడం గమనార్హం.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే చాట్‌జీపీటీని 2022లో అందుబాటులోకి తెచ్చారు. ఈ చాట్‌బాట్ సహాయంతో కేవలం సెకన్లలోనే ఎలాంటి క్లిష్ట ప్రశ్నకైనా సమాధానం లభిస్తోంది. దీంతో చాలామంది ఈ టూల్‌ను వాడేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అందుకు అనుగుణంగానే కంపెనీ కూడా ఈ చాట్‌బాట్‌లో ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లు తీసుకొస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటోంది. అయితే, దీనిపై అతిగా ఆధారపడటం మంచిది కాదని స్వయంగా చాట్‌జీపీటీ (%జష్ఘ్‌ఙూ%) సృష్టికర్త, ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్టమన్ హెచ్చరించడం గమనార్హం.




# గూగుల్ స్టూడెంట్ ఆఫర్.. ఏడాది పాటు గూగుల్ ఏఐ ప్రో ఫ్రీ

భారతీయ విద్యార్థులకు గూగుల్ గుడ్‌న్యూస్ చెప్పింది. గూగుల్ అడ్వాన్స్‌డ్ ఏఐ టూల్స్‌ను ఏడాది పాటు ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పిస్తోంది. జెమినీ ఫర్ స్టూడెంట్స్ పేరిట ఈ ఆఫర్‌ను తీసుకొచ్చింది. 18 ఏళ్లు, అంతకు పైబడిన విద్యార్థులు ఏడాది ఉచిత సబ్‌స్క్రిప్షన్‌ను పొందొచ్చు. ఈ కాలంలో 2 టీబీ క్లౌడ్ స్టోరేజీ కూడా ఉచితంగా లభిస్తుంది.




జెమినీ సేవలను ఉపయోగించుకోవడానికి విద్యార్థులు ముందుగా గూగుల్ ఆఫర్ పేజీ ద్వారా నమోదు చేసుకోవాలి. దీనికి సెప్టెంబర్ 15 చివరి తేదీగా సంస్థ నిర్ణయించింది. ఒకసారి నమోదు చేసుకున్న తర్వాత గూగుల్‌లో పవర్‌ఫుల్ ఏఐ మోడల్ అయిన జెమినీ 2.5 ప్రోను ఉపయోగించుకోవచ్చు. ఈ ప్లాన్‌లో చదువుకోడానికి, రైటింగ్, రీసెర్చ్, ఉద్యోగానికి సంబంధించి కావాల్సిన టూల్స్ ఉన్నాయి.

పరీక్షలు, హోంవర్కులు, వ్యాసరచన, కోడింగ్, ఇంటర్వ్యూలకు సంబంధించి అన్‌లిమిటెడ్ అకడమిక్ సపోర్ట్ ఉపయోగపడుతుంది. నోట్‌బుక్‌ఎల్‌ఎంతో స్టడీ నోట్స్‌ను తయారుచేసుకోవచ్చు. జెమినీ లైవ్ టూల్‌తో రియల్-టైమ్ సంభాషణకు ఉపయోగపడుతుంది. ప్రజెంటేషన్లు, ప్రాజెక్టుల కోసం గూగుల్ ఏఐ ఆధారిత వీడియో క్రియేటర్ టూల్ వియో3ని కూడా ఈ ప్లాన్‌లో భాగంగా ఉచితంగా వినియోగించుకోవచ్చు. డీప్ రీసెర్చ్ టూల్‌తో మనకి కావాల్సిన సమాచారాన్ని లోతుగా అధ్యయనం చేయొచ్చు. ఈ జెమినీ అడ్వాన్స్‌డ్ ప్లాన్‌ను కొనుగోలు చేయాలంటే రూ.19,500 ఖర్చవుతుంది.

స్టడీస్ కోసం, భవిష్యత్ ప్రణాళికకు ఎక్కువ మంది విద్యార్థులు ఏఐ టూల్స్‌ను వినియోగిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గూగుల్ తెలిపింది. విద్య, ఉద్యోగ రంగాల్లో ఏఐ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో.. టెక్ కంపెనీలు దీనిలో భాగమవ్వడానికి ప్రయత్నిస్తున్నాయని పేర్కొంది. ఈ ఆఫర్ ఎంత మంది వినియోగించుకోవచ్చనే దానిపై గూగుల్ ఎలాంటి పరిమితీ విధించలేదు. అసైన్‌మెంట్లు పూర్తి చేయడంలో, రెజ్యూమె తయారు చేయడంలో విద్యార్థులకు గూగుల్ డిజిటల్ స్నేహితుడిగా ఉంటుందని కంపెనీ పేర్కొంది.


# గూగుల్ స్టూడెంట్ ఆఫర్.. ఏడాది పాటు గూగుల్ ఏఐ ప్రో ఫ్రీ

భారతీయ విద్యార్థులకు గూగుల్ గుడ్‌న్యూస్ చెప్పింది. గూగుల్ అడ్వాన్స్‌డ్ ఏఐ టూల్స్‌ను ఏడాది పాటు ఉచితంగా వినియోగించుకునే అవకాశం కల్పిస్తోంది. జెమినీ ఫర్ స్టూడెంట్స్ పేరిట ఈ ఆఫర్‌ను తీసుకొచ్చింది. 18 ఏళ్లు, అంతకు పైబడిన విద్యార్థులు ఏడాది ఉచిత సబ్‌స్క్రిప్షన్‌ను పొందొచ్చు. ఈ కాలంలో 2 టీబీ క్లౌడ్ స్టోరేజీ కూడా ఉచితంగా లభిస్తుంది.

జెమినీ సేవలను ఉపయోగించుకోవడానికి విద్యార్థులు ముందుగా గూగుల్ ఆఫర్ పేజీ ద్వారా నమోదు చేసుకోవాలి. దీనికి సెప్టెంబర్ 15 చివరి తేదీగా సంస్థ నిర్ణయించింది. ఒకసారి నమోదు చేసుకున్న తర్వాత గూగుల్‌లో పవర్‌ఫుల్ ఏఐ మోడల్ అయిన జెమినీ 2.5 ప్రోను ఉపయోగించుకోవచ్చు. ఈ ప్లాన్‌లో చదువుకోడానికి, రైటింగ్, రీసెర్చ్, ఉద్యోగానికి సంబంధించి కావాల్సిన టూల్స్ ఉన్నాయి.

పరీక్షలు, హోంవర్కులు, వ్యాసరచన, కోడింగ్, ఇంటర్వ్యూలకు సంబంధించి అన్‌లిమిటెడ్ అకడమిక్ సపోర్ట్ ఉపయోగపడుతుంది. నోట్‌బుక్‌ఎల్‌ఎంతో స్టడీ నోట్స్‌ను తయారుచేసుకోవచ్చు. జెమినీ లైవ్ టూల్‌తో రియల్-టైమ్ సంభాషణకు ఉపయోగపడుతుంది. ప్రజెంటేషన్లు, ప్రాజెక్టుల కోసం గూగుల్ ఏఐ ఆధారిత వీడియో క్రియేటర్ టూల్ వియో3ని కూడా ఈ ప్లాన్‌లో భాగంగా ఉచితంగా వినియోగించుకోవచ్చు. డీప్ రీసెర్చ్ టూల్‌తో మనకి కావాల్సిన సమాచారాన్ని లోతుగా అధ్యయనం చేయొచ్చు. ఈ జెమినీ అడ్వాన్స్‌డ్ ప్లాన్‌ను కొనుగోలు చేయాలంటే రూ.19,500 ఖర్చవుతుంది.

స్టడీస్ కోసం, భవిష్యత్ ప్రణాళికకు ఎక్కువ మంది విద్యార్థులు ఏఐ టూల్స్‌ను వినియోగిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు గూగుల్ తెలిపింది. విద్య, ఉద్యోగ రంగాల్లో ఏఐ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో.. టెక్ కంపెనీలు దీనిలో భాగమవ్వడానికి ప్రయత్నిస్తున్నాయని పేర్కొంది. ఈ ఆఫర్ ఎంత మంది వినియోగించుకోవచ్చనే దానిపై గూగుల్ ఎలాంటి పరిమితీ విధించలేదు. అసైన్‌మెంట్లు పూర్తి చేయడంలో, రెజ్యూమె తయారు చేయడంలో విద్యార్థులకు గూగుల్ డిజిటల్ స్నేహితుడిగా ఉంటుందని కంపెనీ పేర్కొంది.




# టెస్లా 'వై' వచ్చేసింది

అంతర్జాతీయ విద్యుత్ కార్ల దిగ్గజం టెస్లా మనదేశంలో అధికారికంగా విక్రయాలకు శ్రీకారం చుట్టింది. ఇక్కడి బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో టెస్లా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ మంగళవారం ప్రారంభించారు. అమెరికా కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా, మధ్యశ్రేణి ఎస్‌యూవీ 'మోడల్ వై' కారును ఇక్కడ ఆవిష్కరించింది. చైనా (షాంఘై)లోని తమ ప్లాంటులో పూర్తిగా తయారైన కారును (కంప్లీట్లీ బిల్ట్ యూనిట్ -సీబీయూ) దిగుమతి చేసుకుని, ఇక్కడ విక్రయిస్తున్నారు. ఇది సెల్ఫ్ డ్రైవింగ్ మోడల్ కారు కాదు. ముంబయిలో అయిదేళ్లకు లోధా లాజిస్టిక్స్‌లో 24,565 చ.అ. గిడ్డంగిని టెస్లా లీజుకు తీసుకుంది.

రెండు వేరియంట్లలో..ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యధికంగా విక్రయమైన విద్యుత్తు కారుగా ఉన్న 'మోడల్ వై'ని రెండు వేరియంట్లలో మనదేశంలో విక్రయించనున్నారు. రేర్-వీల్ డ్రైవ్ వేరియంట్ ధర రూ.59.89 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. ఒక ఛార్జింగ్‌తో 500 కి.మీ. ప్రయాణించొచ్చు. మరింత ఎక్కువ దూరం ప్రయాణించగలిగే లాంగ్ రేంజ్ రేర్ వీల్ డ్రైవ్ ప్రారంభ ధర రూ.67.89 లక్షలుగా ఉంది. ఒక ఛార్జింగ్‌తో 622 కి.మీ. పయనించొచ్చు. ఈ రెండు వేరియంట్ల డెలివరీలు వరుసగా ఈ ఏడాది మూడో, నాలుగో త్రైమాసికం నుంచి మొదలవుతాయి.

# విచిత్రమైన వలస జీవితాలు..

మొదటి పేజీ తరువాయి



చెబుతోంది. భారత్ సహా అనేక దేశాల తీరప్రాంతాల్లో ఇలాంటి దృశ్యాలే మనకు కనిపిస్తాయి..

పరిశోధకుల అంచనా ప్రకారం, 2050 నాటికి తువాలు రాజధాని ఫునాఫుటిలో సగం భాగం వరదలతో మునిగిపోనుంది. 2100 నాటికి ఆ దేశంలో 95శాతం భూభాగం జలమయం కావచ్చు. తువాలు ప్రజల సగటు వయసు దాదాపు 29 సంవత్సరాలు. ఏదో ఒక వృత్తిలో కుదురుకుని, కుటుంబ జీవితాన్ని కట్టుకోవాల్సిన తరుణంలో ఇలా వారి భవిష్యత్తు ప్రమాదంలో పడిపోయింది.. గాలిలో దీపం లాగా అవుతోంది. అయితే, 2023లో ఆస్ట్రేలియాతో కుదుర్చుకున్న 'ఫలేపిలి యూనియన్ ట్రీటీ' తువాలు వాసులకు ఆశాకిరణంలా మారింది. ఈ



ఒప్పందాన్ని అనుసరించి ఏటా 280 మంది తువాలు పౌరులకు ఆస్ట్రేలియాలో శాశ్వత నివాసంతో పాటు విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. ఇందుకు సంబంధించి ఇటీవలే పసిఫిక్ ఎంగేజ్‌మెంట్ వీసా కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తే, 4052 మందికి సంబంధించి మొత్తం 1124 దరఖాస్తులు అందాయి. త్వరలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేపడతారు. మరోవైపు, వీసా నిషేధాన్ని ఎదుర్కొంటున్న 36దేశాల జాబితా నుంచి తువాలును తొలగిస్తున్నట్లు అమెరికా తాజాగా వెల్లడించింది ఇది కొంతమేర ఆనందించాల్సిన విషయం..



దురదృష్ట వశాత్తూ తమ కళ్లెదుటే కనుమరుగవుతున్న తమ భూభాగాన్ని పరిరక్షించుకోవడానికి తువాలు ప్రభుత్వం ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. 'కోస్టల్ అడాప్టేషన్ ప్రాజెక్ట్' కింద ఐక్యరాజ్యసమితి గ్రీన్ క్లైమేట్ ఫండ్, ఆస్ట్రేలియాల సాయంతో ఫోంగఫలే, నానుమాగా, నానుమీ దీవుల్లో 3.6 చదరపు కిలోమీటర్ల మేర నేలను ఎత్తు చేస్తోంది. అక్కడ నీటి సరఫరా, ఆహార భద్రతకు చర్యలు తీసుకుంటోంది. 'డిజిటల్ నేషన్ ఇనీషియేటివ్' ద్వారా భావితరాలకు తన సాంస్కృతిక వారసత్వాన్ని అందించేందుకూ ప్రయత్నిస్తోంది. తువాలు ఒక్కటే కాకుండా కిరిబాటి, మాల్దీవులు, మార్షల్ ఐలాండ్స్ వంటి తక్కువ ఎత్తున్న ద్వీపదేశాలు సైతం సముద్రమట్టాల ఉద్ధృతి మూలంగా గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా 2050 నాటికి సుమారు 21.6 కోట్ల మంది వాతావరణ కారణంతో వలసలు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.. కాబట్టి, తువాలు వంటి దేశాలవారికి చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజానిదే. ప్రస్తుతమున్న యూఎన్ రెఫ్యూజీ కన్వెన్షన్-1951 వంటివి హింస లేదా రాజకీయ అణచివేతను ఎదుర్కొంటున్న వారికి మాత్రమే వర్తిస్తాయి. 2018 నాటి 'గ్లోబల్ కాంపాక్ట్ ఫర్ మైగ్రేషన్' వాతావరణ వలసలను గుర్తిస్తున్నా, చట్టపరమైన హామీ ఇవ్వదు. కాబట్టి, వాతావరణ కారక నిరాశ్రయులనూ పర్యావరణ వలసదారులనూ ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరముంది. ముఖ్యంగా మానవతా వీసాల జారీకీ, ద్వైపాక్షిక ఒప్పందాల ద్వారా దేశాల మధ్య వలసలకు అంగీకారం కుదర్చడానికీ గట్టి కృషి జరగాలి. ఐరాస ఆధ్వర్యంలో 'నాన్సెన్ ఇనీషియేటివ్' కింద వలసలకు రక్షణ కల్పించే డిజాస్టర్ డిస్‌ప్లేస్‌మెంట్ కార్యక్రమానికి 109 దేశాల మద్దతు ఉంది. దీన్ని చట్టపరంగా బలోపేతం చేయడంతో పాటు వాతావరణ నిధి, యూఎన్ఎఫ్‌సీసీసీ నష్టపరిహార నిధిని బాధితుల పునరావాసానికి వెచ్చించాలని పలుదేశాల్లో కోరుతున్నాయి.. 1954, 1961 స్టేట్‌లెస్‌నెస్ కన్వెన్షన్‌లను విస్తరించడం ద్వారా.. పూర్తిగా నీటమునిగే తువాలు వంటి దేశీయుల హక్కులను పరిరక్షించాలని, మానవతా దృక్పథంలో ఐక్యరాజ్య సమితి స్పందించాలని ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ అభ్యర్థిస్తోంది..

తువాలు దుస్థితిని హెచ్చరికగా భావించి, మనమూ మేలుకోవాలి. భారతదేశానికి 11,098 కిలోమీటర్ల మేర సముద్ర తీరముంది. సముద్ర మట్టాలు పెరగడం వల్ల సుందర్బన్ అడవులు, లక్షద్వీప్, అండమాన్-నికోబార్ దీవులు, చెన్నై, ముంబయి, కోల్‌కతా, విశాఖపట్నం వంటి చోట్ల నేల కోతకు గురవుతోంది. సముద్ర జీవుల ఆవాసాలు, జీవవైవిధ్యం దెబ్బతినిపోతున్నాయి. ఎంతోమంది మత్స్యకారులు, గ్రామీణులు స్థానికంగా ఉపాధి కోల్పోయి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వీటికి అడ్డుకట్ట వేయాలంటే శిలాజ ఇంధనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించి, ఆ మేరకు పునరుత్పాదక ఇంధన వనరుల వాడకాన్ని ప్రోత్సహించాలి. చెరువులు, నదులు, సాగరాల్లో వ్యర్థాలు, రసాయనాల పారబోతను అడ్డుకోవడంతో పాటు తీర ప్రాంతాల పరిరక్షణకు పెద్దపీట వేయాలి. అందుకు దేశీయంగా మరెంతో కృషి అవసరం. ప్రపంచ వ్యాప్తంగా ప్రబలుతున్న వాతావరణ మార్పుల కట్టడికి అన్ని దేశాలూ గట్టి ప్రయత్నం చేయకపోతే ఏదో ఒకరోజు యావత్ మానవాళి మనుగడకూ పెనుముప్పు తప్పదు అని హెచ్చరిస్తున్నాం..

# చదువు "కొంటున్నాం"

## ( విద్యాహక్కు చట్టం ఎటుపోయింది..? )

మొదటి పేజీ తరువాయి

విద్యా సంస్థలు చట్టంలోని సీట్ల రిజర్వేషన్ల అంశాన్ని దాటవేస్తూ అసలు పట్టించుకోలేదు. అంతేకాదు ఆర్టీఇ సెక్షన్ 18 ప్రకారం విద్యార్థుల వద్ద క్యాపిటేషన్ ఫీజు వసూలు చేయరాదని చట్టం నిర్దేశించినప్పటికీ, ప్రైవేటు విద్యా సంస్థలు విపరీతంగా ఫీజులు పెంచి వసూలు చేస్తున్నారు.

ఇక ట్యూషన్ ఫీజు విషయంలో కూడా ప్రైవేటు విద్యా సంస్థలకు నాలుగు రకాల స్లాబులు కాకుండా అందరికీ అందుబాటులో ఉండే ఒకే స్లాబును ప్రభుత్వం నిర్ధారించవలసి ఉంది. అప్పుడు మాత్రమే చట్టం నిర్దేశించిన విద్యా సమానత్వంకు అర్థం చేకూరుతుంది. రెండు అంశాలు ప్రైవేటు విద్యాసంస్థలు పట్టించుకొన్న దాఖలాలు లేవు. చట్టం అమలుజరపాలసిన ప్రభుత్వ వర్గాలు కూడా కేవలం నోటీసులిచ్చి చేతులు దులిపేసుకుంటున్నారు. ఇక ప్రభుత్వ విద్యా సంస్థల గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే.. బోధనా పద్దతులు, మూల్యాంకనం విధానం అమలు జరపడంలో వెనుకబడి పోతున్నాయి.. పదవతరగతి మూల్యాంకనం విషయంలో కూడా చట్టం నిర్దేశించిన విధానంలో కాకుండా 100 మార్కులకు జరిపి విద్యాశాఖ అధికారులు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది..


అయితే విద్యాహక్కు చట్టం ప్రకారం వయస్సు ఆధారిత సామర్థ్యాలు విద్యార్థులకు అందించడం, విద్యలో వెనుకబడ్డవారికి ప్రత్యేక బోధన, మానిటరింగ్ విధానం చట్టంకు అనుగుణంగా ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందుతూ వచ్చాయి. అందులో భాగమే చట్టం వచ్చాక ఆసర్ నివేదికలు విద్యార్థులు నేర్చుకునే సామర్థ్యాలలో వెనుకబడినట్లు నివేదికలు ఇస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కూడా టెట్ లాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. కానీ, ఉపాధ్యాయ విద్యలో, ఉపాధ్యాయ శిక్షణలో చట్టం అనుగుణమైన మార్పులు చేర్పులుపై ప్రభుత్వాలుగానీ,



అధికారులుగానీ దృష్టి పెట్టిన దాఖలాలు లేవు.

ఇక విద్యాహక్కు చట్టం ప్యాట్రన్ ప్రకారం 2౦3౦3౦4 ఇంటర్ విద్యను పాఠశాలలో ప్రవేశపెట్టాలి. ఆఊసే లేదు. విద్యాహక్కు చట్టం సెక్షన్ 13 ప్రకారం 6౦ 14 సంవత్సరాల వయస్సులో చదువుకునే విద్యార్థులకు నాన్-డిటెన్షన్ విధానం అమలు జరపాలని, సెక్షన్ 6 ప్రకారం విద్యార్థులు తమవయస్సు ఆధారిత తరగతిలో ఉండాలని చట్టం స్పష్టంగా నిర్దేశిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఆసర్ నివేదిక సాకుగా చూపి, గీతాబుక్కల్ కమిటీ చేసిన ఓ చిన్న వెసులుబాటును ఆసరాగా 5,8 తరగతులకు డిటెన్షన్ విధానం అమలు జరపాలని ప్రకటించింది. అమలు జరిపే వెసులుబాటు రాష్ట్ర ప్రభుత్వాలపై మోపింది. అయితే, గీతాబుక్కల్ కూడా తమ నివేదికలో డిటెన్షన్ విధానం అమలు జరపాలని స్పష్టంగా చెప్పలేదు. ఆమెకూడా విద్యా హక్కు చట్టం అమలులో జరుగుతున్న లోపాలను వివరించే సందర్భంలో చివరి అంశంగా డిటెన్షన్ విధానం తీసుకు రావడంపట్ల జాగ్రత్తగా ఆలోచించాలని చెప్పారు.

కానీ, కేంద్రం ఈవిషయంలో 5, 8 తరగతులకు డిటెన్షన్ అమలు జరపాలని స్పష్టంగా ప్రకటించింది. మన తెలుగు రాష్ట్రాలలోనైతే 1971ప్రాంతంలోనే డిటెన్షన్ అప్పటి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం ఈ విధానం ఎత్తివేయడం జరిగింది. 2007లోనే ఏడవతరగతి కామన్ పరీక్ష




కూడా ఎత్తేసుకున్నాం. డిటెన్షన్ విధానం ఎత్తివేసిన తర్వాతనే పాఠశాల మానివేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. అయితే కేంద్రప్రభుత్వం 5, 8 తరగతులకు తిరిగి డిటెన్షన్ విధానం ప్రవేశపెడితే విద్యాహక్కు చట్టం సెక్షన్ 6 నిర్దేశించిన వయస్సు ఆధారిత తరగతి అనే నిబంధనకు తిలోదకాలు ఇచ్చినట్లే! అంతేకాదు! విద్యాహక్కు చట్టం నిర్వచించిన వయస్సు ఆధారిత సామర్థ్యాలు అందజేత, 6౦14 వయస్సు పిల్లలకు నిర్భందోచిత ప్రాథమిక విద్య అనబడే విద్యాహక్కు చట్టం మూల సూత్రంకు మంగళం పాడినట్లే అవుతుంది.

నిజానికి 2009 చట్టానికి ఆదిలోనే పాతర పడింది.. ఉచిత విద్యకు పేద విద్యార్థులు నోచుకోవడం లేదు.. 25 శాతం అమలులో విద్యాసంస్థల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.. కోర్టు ఆదేశాలతోనూ ఎలాంటి మార్పు కనిపించడం లేదు..




కనుక ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు అన్ని విద్యాసంస్థలు చట్టబద్ధమైన విద్యాహక్కు ఖచ్చితంగా అమలు జరపడానికి ఓ వ్యవస్థను ఏర్పరచాలి. చట్టం అమలుకు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. విద్యాహక్కు చట్టం పటిష్టంగా అమలు జరిపి తీరితేనే సమాన విద్యావకాశాలు సమాజానికి అందుతాయి. కనుక ఆ దిశగా అడుగులు పడాలని ఆశిస్తోంది ఫోరమ్ ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ..



## విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావుకు రిమాండ్

హైదరాబాద్: విశ్రాంత ఈఎన్సీ మురళీధర్‌రావుకు రిమాండ్ విధించారు. ఏసీబీ కోర్టు ఆయనకు 14రోజుల రిమాండ్ విధించింది. మురళీధర్‌రావును చంచల్‌గూడ జైలుకు పోలీసులు తరలిస్తున్నారు. అక్రమాస్తుల కేసులో మంగళవారం ఆయన్ను అరెస్టు చేశారు. ఆయన పేరిట భారీగా ఆస్తులున్నట్లు గుర్తించారు.

మంగళవారం బంజారాహిల్స్‌లోని మురళీధర్‌రావు ఇంటితో పాటు మరో 11 ప్రాంతాల్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఆయనతోపాటు కుటుంబ సభ్యులు, బినామీల పేరిట ఉన్న చర, స్థిరాస్తుల్ని గుర్తించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు తనిఖీలు కొనసాగాయి.



## ఆలూ చిప్స్ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

హైదరాబాద్: జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీలో అగ్ని ప్రమాదం జరిగింది. సూర్య ఎంటర్ ప్రైజెస్ ఆలు చిప్స్ గోదాములో ఈ తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. నివాస ప్రాంతాల్లో గోదాము ఉండటంతో కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని రెండు ఫైరింజన్లతో మంటలు ఆర్పివేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed at Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana .Published at Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana
Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy